

గన్‌ఫైట్ ఇన్
గ్రీన్‌లాండ్
MVS
PUBLICATIONS
మధుబాబు

# ముందు మాట

కిల్లర్స్ గాంగ్ ఒక వరల్డు వైడ్ ఈవిల్ ఆర్గనైజేషన్ ఇది ఒక దేశానికి గాని, లేక ఒక ప్రదేశానికి గాని చెందినది కాదు. దీనికి స్థావరాలు అన్ని దేశాలలోనూ వున్నాయి. దీని మెంబర్స్‌లో అన్ని జాతులవారు. ఎన్నో వృత్తుల వారూ వున్నారు.

వీరందర్నీ ఒక సుప్రీమ్ కమాండ్ కంట్రోల్ చేస్తూ వుంటుంది. ప్రపంచంలోని అన్ని దేశాలనూ వశపరచుకుని తమ పరిపాలనలోకి తీసుకురావాలని వీరి తాపత్రయం. అందుకోసం వీరు చెయ్యని ప్రయత్నం అంటూ లేదు.

డబ్బు తీసుకొని చిన్న చిన్న నేరాలూ, హత్యలు చేయటం దగ్గిరనుంచి, విప్లవాలు రేపి శాంతి భద్రతలను తుదముట్టించే ప్రయత్నాలవరకూ వీరి చర్యలు కొనసాగుతూ వుంటాయి.

కిల్లర్స్ గాంగ్ ఒక మొండి శిఖండిలాంటిది. ఎన్ని సార్లు చావు దెబ్బలు తిన్నా, తిరిగి తన పనులు తాను చేసుకుపోతూనే వుంటుంది.

అటువంటి కిల్లర్స్ గాంగ్‌ని తుదిముట్టించటానికి కంకణం కట్టుకున్నది ఇండియన్ సి.ఐ.బి.

అందుకే ప్రపంచంలో ఏ మూల దాని చర్యలు పొడచూసినా వెంటనే ఎదుర్కొనే గురుతర బాధ్యతను స్వీకరించింది.

అటువంటి ప్రయత్నాలలో ఒకటి యీ 'గన్ ఫైట్ ఇన్ గ్రీన్‌లాండ్.'

'కిల్లర్స్ గాంగ్‌తో చెలగాటం చాలా ప్రమాదకరం. బీ కేర్‌ఫుల్.' అని హెచ్చరించారు కులకర్ణిగారు. మొదటి అడుగు దగ్గిర నుంచీ చాలా కేర్‌ఫుల్ గానే వున్నాడు షాడో. అయినా అనుకోకుండా తప్పటడుగు వేశాడు. ఫలితంగా తప్పించుకోటానికి వీలులేని అండర్‌గ్రౌండ్ గదిలో బందింపబడ్డాడు.

మరొకవైపు నుంచి వారి రహస్యాలను కనిపెట్టటానికి ప్రయత్నించిన ముఖేష్, ప్రాణాలు కాపాడుకోవటానికి పారిపోతూ – భయంకరమైన ఊబిలో చిక్కు పడిపోయాడు.

ప్రపంచాన్ని సర్వనాశనం చేయగల వస్తువులు కిల్లర్స్ గాంగ్ చేతుల్లోకి పోబోతున్నాయి.

వారి దుండగాలను ఆపటానికి కంకణం కట్టుకున్న ఇండియన్ సి.ఐ.బి. ఏం చేస్తుంది? భారత దేశంలో "కిల్లర్స్ గాంగ్" ఆటలు సాగనీయకుండా అడుగు అడుగుకూ అడ్డు పడిన "షాడో" యీసారి గ్రీన్‌లాండ్‌లో వారి ప్రయత్నాలను ఎదుర్కోగలడా?

ఇది మధుబాబు రచన

'గన్ ఫైట్ ఇన్ గ్రీన్‌లాండ్'

చదివి చూడండి

# గన్ ఫైట్ ఇన్ గ్రీన్‌లాండ్

"గుడ్ మార్నింగ్ సర్"

ముందున్న ఫైలులోనుంచి తల ఎత్తి చూశారు కులకర్ణిగారు. స్మార్ట్‌గా శాల్యూట్ చేస్తూ నిలబడి వున్నరు షాడో ముఖేష్, శ్రీకర్.

"వెరీ గుడ్ మార్నింగ్ ! టేక్ యువర్ సీట్స్" అని మళ్ళీ ఫైలులో తల దూర్చారాయన.

టేబిల్ ఎదురుగావున్న కుర్చీలలో కూర్చుంటూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు ముగ్గురూ.

"రాజూ! ఏదో మన పీకల మీదికి రాబోతోంది. బీ కేర్‌ఫుల్!" చిన్న స్వరంతో హెచ్చరించాడు శ్రీకర్.

"లాస్ట్ ఎస్సైన్‌మెంట్‌కి సంబంధించిన ఎకౌంట్స్ సబ్‌మిట్ చేశావా ముఖేష్?..........." అదే టోన్‌లో అడిగాడు షాడో.

"బాస్ చూస్తున్నది ఎకౌంట్స్ ఫైలు కాదు. ఆ గ్రీన్ కలర్ ఫారిన్ ఎఫైర్స్‌కి వాడుతారు" జవాబిచ్చాడు ముఖేష్. "వెల్ మైడియర్......" అంటూ తల ఎత్తారు కులకర్ణి.

"జంటిల్మన్!" కులకర్ణిగారి మాటల మధ్యలోనే చటుక్కున అందుకున్నాడు శ్రీకర్. అన్న వెంటనే తమ మాట్లాడుతున్నది బాస్‌తో అని గ్రహించి నాలుక కొరుక్కుని తల వంచుకున్నాడు.

కనుబొమల మధ్యనుంచి అతని వంక తీక్షణంగా చూశారాయన మిగిలిన యిద్దరూ గోడల వంక గోళ్ళవంకా చూసుకోసాగారు.

"గ్రీన్‌లాండ్ గురించి మీకేం తెలుసు?" ఉన్నట్లుండి ప్రశ్నించారు కులకర్ణిగారు.

"గ్రీన్‌లాండ్ ఆర్కిటిక్ మహా సముద్రంలో వున్నది సార్." వెంటనే జవాబిచ్చాడు శ్రీకర్.

"నెక్ట్స్?"

"చల్లగా..... అందంగా ..... లోయలు ......... పర్వతాలు ఆ వాతావరణం చాలా బాగుంటుంది" అన్నాడు ముఖేష్.

"నాకు కావల్సింది కాంక్రీట్ ఫాక్ట్సు – కవిత్వం కాదు" గుర్రుమన్నారు కులకర్ణిగారు.

సీనియర్ ఏజెంట్స్ యిద్దరూ మళ్ళీ శ్రీకర్ వంకే చూశారు. అటువంటి జనరల్ నాలెడ్జి విషయాలు అతనికి బాగా తెలుసు.

"బ్రాంది బీరు మొదలయిన ఆల్కహాలిక్ డ్రింక్స్ అక్కడ ఎక్కువగా తయారౌతాయి. ప్రపంచంలో వున్న ప్రొడక్షన్‌లో అరవై శాతం గ్రీన్‌లాండ్ లోనే వుంది"

"వెరీ గుడ్!" అని చిరునవ్వు నవ్వారు కులకర్ణి. తను చేసిన తప్పుకు సరిపోయే మంచి పని ఒకటి చేసినందుకు తేలికగా వూపిరి పీల్చుకున్నాడు శ్రీకర్.

"రాజూ! నిన్ను ఇన్‌ఫర్‌మేషన్ డిపోలో క్లర్కుగా పంపించాలని వుంది. నీకు తోడుగా ముఖేష్‌ని కూడా పంపుతాను. అప్పుడుగాని మీ బుర్రలు కాస్త పదును ఎక్కవ్." వారిద్దరి వంక చూస్తూ సీరియస్‌గా అన్నారాయన.

"బాస్..... అంతకన్నా.... కాస్త.... కేష్ డిపార్టుమెంటులో వేయండి.... మాకూ సుఖం, మీకూ సుఖం" వినపడీ వినపడనట్లు అన్నాడు ముఖేష్.

"ఏమిటీ?"

"ఏమీ లేదు బాస్, మీ యిష్టమే మా ఇష్టం అన్నాడు. అంతే" ముఖేష్ తొడ గిల్లుతూ ఎమెండ్ చేశాడు షాడో.

"ఆల్‌రైట్. ఇక మిమ్మల్ని పిలిచిన కారణం....." అంటూ ఎడమచేతి సమీపంలో వున్న గ్రీన్ బటన్ నొక్కారు కులకర్ణిగారు.

ఒక గోడకు అనుకొని వున్న ఇనుప బీరువా పక్కకు తొలిగి పోయింది దాని స్థానంలో చిన్న స్క్రీన్ ప్రత్యక్షమయింది. గదిలో వున్న లైట్లు ఆరిపోయాయి. స్క్రీన్ మీద పిక్చర్స్‌ని ప్రొజెక్టు చేయసాగిందొక ప్రొజెక్టరు. బొమ్మలతో పాటుగా ఒక మృదువైన ఫిమేల్ వాయిస్ కామెంటరీ చెప్పసాగింది.

"ఇతను మిస్టర్ క్లీ అని గ్రీన్‌లాండ్‌లో వున్న ఆల్మోరా పర్వతాల వద్ద నివసిస్తూ వుంటాడు. గ్రీన్‌లాండ్‌లో వున్న ఆల్కహాల్ ఫాక్టరీలన్నిలోనూ, ఇతని "క్లీ బ్రీవరీస్" పాక్టరీ చాలా పెద్దది.

"చిన్నతనంలో చాలా చెడ్డ సాహవాసాలు చేశాడీ క్లీ....... అతని సంపాదనలో సగభాగం అన్యాయార్జితమే అని అందరికి అనుమానం! రీసెంట్‌గా ఒక రకమైన డ్రింక్ తయారు చేశాడని పుకార్లు మొదలైనాయి. అది ఎటు వంటిదో.

ఎలా వుంటుందో ఎవరికీ తెలియదు. తెలియనీయలేదు మిష్టర్ క్లీ. చాలా రహస్యంగా వుంచాడా వివరాలన్నిటినీ."

తెర మీద క్లీ బొమ్మ అతని యిల్లు ఫాక్టరీ అన్నీ చూపించబడ్డాయి. వెంటనే మరొక ముఖం ప్రత్యక్షమయింది. దాన్ని చూడగానే చిన్న విజిల్ వేశాడు షాడో.

"డాక్టర్ వెల్బీ. వీడు ఎందుకు సార్? వీడు రెండు......" చెయ్యెత్తి అతన్ని నిశ్శబ్దంగా వుండమని సైగచేశారు కులకర్ణిగారు. కామెంటేటర్ కంటిన్యూ చేసుకుంటూ పోయింది.

"డాక్టర్ వెల్బీ..... బయో కెమిస్ట్రీలో చాలా విజ్ఞానాన్ని సంపాదించాడు. అయితే, ఇతని విజ్ఞానం ప్రజలను దోచుకోవటానికే వుపయోగపడింది. రెండు సంవత్సరాల క్రితం న్యూయార్క్‌లో ఒక బాంక్ దోపిడీ చెయ్యటానికి ప్రయత్నించి పట్టుబడ్డాడు.

"ఇంటరాగేషన్ కోసం లాకప్‌లో వుంచబడ్డాడు. తెల్లవారేసరికి దారుణంగా హత్య చేయబడి వున్నట్లు ప్రకటించింది న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్. యాక్చువల్‌గా వెల్బీ మరణించలేదనీ. కిల్లర్స్ గాంగ్ వారు అతన్ని రక్షించి, అతని స్థానంలో గుర్తు తెలియని శవాన్ని వుంచారనీ కనిపెట్ట గలిగింది. మన వరల్డు ఎస్పినేజ్ కౌంటర్.

"రెండు సంవత్సరాల నుంచీ అజ్ఞాతంగా వుంటున్న వెల్బీ, నాలుగు రోజుల క్రితం గ్రీన్‌లాండ్‌లో కనిపించాడని తెలిసింది."

వెంటనే మరి రెండు ముఖాలు ప్రత్యక్షమయ్యాయి తెర మీద. ముగ్గురు ఏజెంట్లూ కుర్చీలలో నిటారుగా కూర్చున్నారు.

"మిస్ జెన్నీ అండ్ మిస్ ఎమిలీ. వీరిద్దరూ మిష్టర్ క్లీ మేనకోడళ్ళు. అతని దగ్గరే వుంటున్నారు. జెన్నీ బయో కెమిస్ట్రీలో మాస్టర్ డిగ్రీ తీసుకుంది. ఎమిలీ అంత చదువులేక పోయినా క్లీ ఆంతరంగిక సలహాదారు" అని ఆగింది కామెంటరీ యిస్తున్న యువతి.

"ఒ......... కే....... ఇటీజ్ ఎనఫ్ ఫర్ నౌ!" అంటూ టేబిల్ మీద వున్న ఎల్లో బటన్ నొక్కారు కులకర్ణి.

ఐరన్ సేఫ్ యధాస్థానానికి చేరింది. లైట్లు వెలిగి ప్రకాశవంతమయింది గదంతా.

"ఇక యిక్కడినుంచీ నేను చెప్పేది జాగ్రత్తగా వినండి" అంటూ గొంతు సవరించుకున్నారాయన "మిష్టర్ క్లీ – అన్యాయార్జితమైన సొమ్ముతో సంఘంలో మంచి పలుకుబడి సంపాదించాడు. ఆల్మోరా పర్వత ప్రాంతాల్లో అతని మాటకు ఎదురు లేదు. బాగా డబ్బూ పలుకుబడీ రాగానే తన ప్రవర్తనను మార్చుకుని నిజాయితీగా జీవిస్తున్నందున అతని జోలికి పోలేదు వరల్డు ఎస్పినేజ్ కౌంటర్.

"రీసెంట్‌గా ఒక రకమైన డ్రింక్ కనిపెట్టి, దాన్ని డెవలప్ చేస్తున్నాడని మనకు తెలియ వచ్చింది. మామూలు ఆల్కహాలిక్ డ్రింకేనని మనం వుపేక్షించాం. కాని నాలుగు రోజుల క్రితం ఆల్మోరా సిటీలో కిల్లర్స్ గాంగ్ మనుషులు కనపడటంతో మన అనుమానాలు ఇంకొక మెట్టు పైకక్కాయి. డాక్టర్ వెల్బీ – గఫూర్ అనే అనుచరుడితో ఆల్మోరాలో తిరుగుతున్నాడు.

"డాక్టర్ వెల్బీ పైంటిస్టు...... అతను అజ్ఞాతవాసంలో వుంటున్నా, కిల్లర్స్ గాంగ్ మెంబరేనని మనకు నిశ్చయంగా తెలిపింది. అతన్ని గ్రీన్‌లాండ్ పంపించి,

క్లీ వున్న పరిసరాలలో తిప్పటంలో కిల్లర్స్ గాంగ్ వుద్దేశ్యం మనకు అంతు బట్టటం లేదు."

"ఆ ఫార్ములాలను చేజిక్కించుకోవాలనేమో సార్?" అన్నాడు ముఖేష్.

"యస్. అదే మన మొదటి అనుమానం! కాని క్లీ వారిని మించిన గుంటనక్క. వాడి భవనం..... అనుచరులూ ఆ పటాటోపాన్ని చూశారుగా! అంత తేలికగా వారి వలలో చిక్కడు. ఈ విషయంలో మనకు తెలియకూడని ఇంకొక యాంగిల్ వుంది."

"అంటే, మీ ఉద్దేశ్యం క్లీ ఆ ఫార్ములాలను...."

"ఎగ్జాక్ట్‌లీ రాజు..... కలెక్టు క్లీ ఆ ఫార్ములాలను క్రైమ్ వరల్డులో అమ్మ చూపుతున్నాడు. అందుకే కిల్లర్స్ గాంగ్ అక్కడ చేరి. తమకు కాంపిటీషన్ రాకుండా జాగ్రత్తపడుతోంది. సో – ఆ ఫార్ములాలు ప్రజావళికి మంచి చేసేవి గాదని విదితమైనట్లే గదా! అందుకే మనం ముందుకుపోయి వారి మధ్య నిలబడాలి."

"నేను పోతాను సార్!" ముగ్గురు ఏజెంట్లూ ఒకేసారి అన్నారు.

చిరునవ్వు పెదవుల చివర మెరుస్తుండగా వారిని పరికించారు కులకర్ణి వారు అంత యిష్టం ప్రకటిస్తున్నందుకుగల కారణం ఆయనకు తెలియంది కాదు.

"కిల్లర్స్ గాంగ్‌తో చెలగాటం చాలా ప్రమాదకరమైన విషయం. అందువల్ల పిచ్చివేషాలు వేయకుండా పోయిన పనిని పూర్తిచేయటం చాలా మంచిది. ముఖేష్..... యీ సాయంత్రం యింటర్నేషనల్ ప్లేన్‌లో నీ ప్రయాణానికి అన్ని

ఏర్పాట్లూ పూర్తి కానించబడ్డాయి. నీకు కావలసిన వస్తువులన్నీ తీసుకుని రెడీగా వుండు. బీ కేర్‌ఫుల్!" అన్నారు.

"సార్! పాపం. ముఖేష్ ఒక్కడే వారితో తలపడలేడు సార్! నేను కూడా వెంటపోతాను" బ్రతిమిలాడాడు షాడో.

"రాక రాక నాకొక మంచి ఛాన్సువస్తే మధ్యలో నీ గొడవ ఏమిటి?" విసుక్కున్నాడు ముఖేష్.

"నో, నో, రాజూ! నువ్వు పోవటానికి వీలులేదు! నీకు వేరే పని వుంది" యింకొక ఫైలు ఓపెన్ చేస్తూ అన్నారు కులకర్ణి.

"ఏమిటి సార్ అది?" నీరసంగా అడిగాడు షాడో. "యింకో రెండు రోజుల్లో వరల్డు సైంటిస్టు్స కాన్ఫరెన్స్ లండన్‌లో జరగబోతున్నది. దేశ దేశాలనుండి సైంటిస్టు లందరూ అక్కడికి వచ్చి తను పరిశోదనలను వివరిస్తారు మన మిష్టర్ క్లీ కూడా తన పరిశోదన గురించి లెక్చర్ యివ్వబోతున్నాట్ట. అతని రిప్రజెంటేటివ్‌గా మిస్ జెన్నీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనబోతోంది. సో.... నువ్వు డాక్టర్ షాడోగా కాన్ఫరెన్స్‌లో పాల్గొని...... ఆమెతో పరిచయం చేసుకుని......."

"– అన్ని విషయాలు తెలుసుకోవాలి. అంతేగదూ?"

"కరెక్ట్. అంతేగాదు.... కిల్లర్స్ గాంగ్ ఆమె నోరు మూయించి ఆ వివరాలు బయటికి రానీయకుండా చేయటానికి ప్రయత్నించవచ్చు. అది జరగకుండా చూచుకో. జాగ్రత్త సుమా" హెచ్చరించారాయన.

"మరి నేను సార్?" స్నేహితులిద్దరూ తనను వదిలి వెళ్ళిపోతున్నారన్న జెలసీతో బిక్క ముఖం వేసి అడిగాడు శ్రీకర్.

"యూ బీ హియర్ బాయ్! యిది పెద్ద వాళ్ళు చేయవలసిన పని. యిందులో పిల్లలకు స్థానం లేదు." మందలించాడు ముఖేష్.

"నాన్సెన్స్ ...... ఎందుకుండదు? బాస్......" అంటూ ప్లీడ్ చేశాడతను.

"లేదు శ్రీకర్! నువ్వు ఫ్రీగా వుండాలి. అవసరమైతే వారిద్దరి మధ్య కంటాక్టింగ్ బేస్‌గా వర్క్ చేయాల్సి వస్తుంది. అందుకని హెడ్ క్వార్టర్స్ వదిలి ఎక్కడికి పోవద్దు" హెచ్చరించి సీనియర్ ఏజెంట్ల వైపు తిరిగారు కులకర్ణిగారు.

"ఫార్ములాలు కిల్లర్స్ గాంగ్ చేతికి చిక్కినా పరవాలేదు కాని. అందులో వున్న విషయాలు మనకు తెలియాలి. కీపిట్ ఇన్ యువర్ మైండ్..... డూ యువర్ డ్యూటీ. ఎప్పటికప్పుడు అన్ని విషయాలు నాకు తెలియచేస్తూ వుండండి. గుడ్ బై.... విష్ యూ బెస్టాఫ్ లక్"

★ ★ ★

స్మార్టుగా డ్రస్ చేసుకుని, స్టయిల్‌గా కాన్ఫరెన్స్ హాల్లోకి అడుగు పెట్టాడు షాడో. ఇంకో పావుగంటలో మిస్ జెన్నీ లెక్చర్ మొదలు కాబోతున్నది. గుంపులు గుంపులుగా చేరి, అతనికి అర్థం కాని సైంటిఫికల్ సబ్జక్ట్సు మాట్లాడుకుంటున్నా రక్కడి వారందరూ.

లండన్ పోయే ప్లేన్ ఎక్కబోతూ తన సందేహాన్ని కులకర్ణిగారికి తెలియచేసే వచ్చాడు షాడో – అతనికి వున్న సైంఫికల్ నాలెడ్జి చాలా పరిమితమైంది. కాజువల్‌గా తన మిషన్ కంప్లీట్ చేసుకునే పరిజ్ఞానం వుందిగాని..... ఇటువంటి కాన్ఫరెన్సులలో, ఇంతమంది స్పెషలిస్టుల మధ్య

సైంటిస్టుగా నటించటం చాలా కష్టం. ఎవరైనా ఏదైనా ప్రశ్న వేస్తే తన పని గోవిందా ?

"రాజూ! యూ డోంట్ వర్రీ ఎబౌట్ యిట్. మనకు కావాల్సింది ఆ ఫార్మ్యులా వివరాలు. అవి సేకరించి పంపించు. మన సైంటిస్టులు వాటి అర్థం క్రోడీకరించి నీకు తెలియచేస్తారు! ఆ నాలెడ్జ్‌తో జెన్నీ దగ్గిర మరికొన్ని విషయాలు రాబట్టటానికి ప్రయత్నించు" ధైర్యం చెప్పి పంపించారు కులకర్ణిగారు.

టై సవరించుకుంటూ ఒక మూల వున్న ప్రోగ్రాం బుల్లెటిన్ దగ్గిరికి పోయారు. బ్లాక్ బౌర్డుమీద ఆ రోజు జరిగే ప్రోగ్రాంస్ వివరాలన్నీ వరుసగా టైప్ చేసి అతి కిందబడి వుందొక కాగితం.

మధ్యలో వున్న జెన్నీ పేరు మీద బ్లూ కలర్ పెన్సిల్ గీత వుంది. దాని పక్కనే 'కాన్సిల్డ్' అని వ్రాయబడి వున్నది.

షాడో మెడమీది వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. ప్లేన్ దిగగానే, తనకు ఎలాట్ చేసిన ఎపార్టుమెంట్ లోకి పోకుండా జెన్నీ వచ్చిందో, రాలేదో అని ఎంక్వయిరీ చేసి, వచ్చిందని తెలిసిన తర్వాతనే తన రూమ్‌కు పోయాడు. మరి ఉన్నట్లుండి ఆమె ప్రోగ్రాం కాన్సిల్ అవటంలో అర్థం ఏమిటో?

అటూ ఇటూ చూసి ఒక వాలంటీర్ దగ్గిరికి పోయి ప్రశ్నించాడు.

"ఓ! యు వాన్ట్ మిస్ జెన్నీ? వెరీ ప్రెట్టీ గర్ దట్ జెన్నీ.... పాపం, ఐదు నిముషాల క్రితమే అనుకోకుండా గొంతు చెడిపోయింది. వెరీ అన్‌హేపీ ఇన్‌సిడెంట్."

కను చివరల నుంచి సుపరిచితులైన ముఖాలను చూసి తడబడి పక్కకు తిరిగాడు షాడో. కులకర్ణిగారు అన్నట్లే జరిగింది. కిల్లర్స్ గాంగ్ కాన్ఫరెన్స్‌లో అడుగు పెట్టింది.

"ఆమె లెక్చర్ విందామని యెంతో యింట్రస్టుగా వచ్చాను. ఫలితం లేకపోయింది" అన్నాడు ముఖం అదోలా పెట్టి.

"డోంట్ వర్రీ మిస్టర్..... ఐ మీన్ డాక్టర్ షాడో! ఆమె యివ్వబోయే లెక్చర్ కాపీలు తీయించాం. ఐ విల్ గివ్ యూ వన్" అంటూ తన బ్రీఫ్‌కేస్ ఓపెన్ చేసి అందులో నుంచి రెండు సైక్లోస్టయ్‌ల్డు పేపర్లు తీసి షాడో చేతిలో పెట్టాడో వాలంటీర్.

"మిస్ జెన్నీ...." అంటూ ఆకాగితాలను జేబులో పెట్టుకున్నాడు షాడో.

"షీ యీజ్ ఇన్ ది బార్. పాపం, చాలా బాధ పడుతున్నది." సమాధానం యిచ్చి వెళ్ళిపోయాడు కాన్ఫరెన్స్ వాలంటీర్.

అంతకు ముందు తను చూసిన వ్యక్తులు తననే గమనిస్తూ ఉండటం చూసి చక చకా అడుగులు వేస్తూ అక్కడి మంచి నిష్క్రమించాడు షాడో.

'కిల్లర్స్ గాంగ్ మొటమొదటి ఎత్తు వేసింది. దానికి ఎదురెత్తు ఎంత త్వరగా వేస్తే అంత మంచిది' అనుకుంటూ ఆ బిల్డింగ్ టాప్ ఫ్లోర్‌లో వున్న బార్ అండ్ రెస్టారెంట్ సెక్షన్ లోకి పోయాడు.

ఒకరిని అడగవలసిన అవసరం లేకుండానే జెన్నీని గుర్తు పట్టగలిగాడు ఫోటోలోకన్నా అందంగా వుందామె. ఒక చివర కూర్చుని బీర్ గ్లాసులోకి పోస్తూ ఏదో ఆలోచిస్తున్నది.

"క్షమించాలి. మీకు అభ్యంతరం లేకపోతే......" ఎదురుగా నిలబడి అన్నాడు.

"యస్. నాకు అభ్యంతరం వుంది. దయచేసి నన్ను ఒంటరిగా వుండనీయండి!" చిరాకుగా అన్నది జెన్నీ.

అయినా చెక్కు చెదరకుండా, ఆ మాటలు విననట్లే చిరునవ్వులు చిందిస్తూ స్మార్ట్ గా వంగి విష్ చేశాడు షాడో.

"మిస్ జెన్నీ – మీ బాధను నేను అర్థం చేసుకోగలను. అసలు నేను రావటంలో వున్న కారణం గూడా అదే. మీ అందాన్ని చూసి మీతో పరిచయం చేసుకోవాలని వచ్చానంటే బాగుంటుందా? లేక మీతో కొన్ని నగ్న సత్యాలను గూర్చి మాట్లాడాలని వచ్చానంటే బాగుంటుందా? మీరే చెప్పండి" ఎదురుగా కూర్చుని చిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

అంత చిరాకుగా వున్నా, షాడో మాటలు జెన్నీలో కుతూహలాన్ని రేకెత్తించాయి.

"మీరు అంటున్నది నాకు అర్థం కావడంలేదు. నగ్నసత్యాలంటే ఏమిటి?" ప్రశ్నించింది. తను ముందుకు పోవటానికి దారి దొరికినందుకు సంతోషించాడు షాడో. అంత తేలికగా మాట్లాడటానికి జెన్నీ అంగీకరిస్తుందని ఉహించలేదతను.

"అర్థం కాకపోవటానికి ఏముంది. వెరీ పింపుల్ మీరు అంకుల్ క్లీ తమారుచేసిన ఫార్ములా గురించి లెక్చర్ యివ్వటానికి వచ్చారు. సరిగ్గా నిక్ ఆఫ్ ది మూమెంట్‌లో చాలా ఇన్‌కన్వీనియంట్‌గా గొంతు పోగొట్టుకున్నారు. మీ

ముఖం చూస్తూంటే..... మీ మాటలు వింటూంటే యీ పని మీకు తెలియకుండా చేయడిందని తెలిసిపోతోంది. అంటే

....... ఎవరో కావాలని..... మిమ్మల్ని లెక్చర్ ఇవ్వనీయ కుండా డోప్ చేసి నోరు మూయించారు ఏమంటారు మిస్ జెన్నీ, ఏమై కరెక్టు!ఆర్ నాట్?"

ఒక్క క్షణం ఆలోచనలో పడింది జెన్నీ. ఏదో జ్ఞాపకానికి వచ్చినట్లు గుండ్రటి కళ్ళను వెడల్పు చేసి అతని వంక చూసింది.

"యువ్వార్ కరెక్టు మిస్టర్......"

"డాక్టర్ షాడో..... అది నా ప్రోపెషనల్ నేమ్. మీరు రాజు అనవచ్చు."

"యస్ రాజూ! మీరు అన్న తర్వాత గుర్తు వస్తోంది. ఒక సన్నటి వ్యక్తి డ్రింక్ ఆఫర్ చేశాడు. సభ్యతకోసం అంగీకరించాను. వెంటనే గొంతు పోయింది!" గొంతు సవరించుకుంటూ అన్నది జెన్నీ.

"డోన్ద్ వర్రీ! ఇటువంటి మెడిసిన్స్ అన్నీ చాలా కొద్ది సేపు మాత్రమే పనిచేస్తాయి. త్వరలోనే మీ కంఠం యధాప్రకారం వచ్చేస్తుంది. ఎనీవే ఇంకా త్వరగా రావటానికి నాకొక ముందు తెలుసు..." అంటూ బార్ కౌంటర్ దగ్గిరికి పోయి ఒక రమ్ బాటిల్ తీసుకు వచ్చాడు షాడో.

జెన్నీ అసహ్యంగా చూపిందా బాటిల్ వంక. అయినా మర్యాద కోసం మవునంగా వుండిపోయింది.

"వెల్ మిస్ జెన్నీ... మీ రూమ్‌కు పోదామా? నా గదికి పోదామా?" అడిగాడు షాడో.

తోకతొక్కిన తాచులాగా తల ఎత్తింది జెన్నీ. కోపంగా నిప్పులు కక్కాయామె కళ్ళు. "దయచేసి నా మాటలను అపార్థం చేసుకోకండి. నేను చెప్పబోయే విధానానికి కొంత ఏకంతం అవసరం." చిరునవ్వు చెరగకుండా జవాబిచ్చాడు షాడో.

మరొకసారి పజిల్ అయిందామె. "ఆల్‌రైట్!... అదేదో నా గదిలోనే చూపించండి!" అంటూ నిలబడి తన చేతిని అతనికి అందించింది. ఇంగ్లీషు సాంప్రదాయ ప్రకారం ఆమె చేతిని అందుకొని ముందుకు నడిచాడు షాడో.

ఎదురు వచ్చిన వారందరూ ఆ జంటను చూసి మెచ్చుకోలుగా తలలు వూపారు. రెండు జతల కళ్ళు మాత్రం ఇంకో భావంతో తల వూపి వెనుతిరిగాయి.

★ ★ ★

"ఇక ప్రారంభించండి" అంటూ వాష్ బేసిన్ స్టాండ్ మీద రమ్ బాటిల్‌ని వుంచాడు షాడో. అతని అభిప్రాయాన్ని వెంటనే గ్రహించింది జెన్నీ. సైంటిస్టు అయ్యిగూడా అది మాత్రం వూహ చేయలేనందుకు సిగ్గుపడుతూ, బాటిల్ ఓపెన్ చేసి రెండు గుక్కలు తాగింది. ఘటైన ఆ ద్రావకం కడుపులోకి పోగానే ఒక్కసారి రియాక్టు అయిందామే కడుపు. వెంటనే వామిట్ చెయ్యటం ప్రారంభించింది.

బాత్‌రూమ్‌లో నుంచి బయటకు వచ్చి సిగిరెట్ వెలిగించుకున్నాడు షాడో. పొగ గుండెలలో పీల్చుకొని ముక్కులలో నుంచి వదులుతూ గదినంతా కలయచూశాడు. జెన్నీ హేండ్‌బాగ్ మంచంమీద వుంది. దానివైపు రెండు అడుగులు వేశాడు.

బాత్ రూంలో శబ్దం ఆగిపోయింది.

"థేంక్స్ రాజూ! అప్పుడే సగం ఎఫెక్టు తగ్గిపోయింది ఇందాక అలా చిరాకుపడినందుకు క్షమిస్తావ్ కదూ!" బాత్ రూంలో నుంచి అన్నది జెన్నీ.

"ఇట్స్ ఆల్ రైట్ బేబీ.... నన్ను అందరూ అపార్థం చేసుకుంటూనే వుంటారు. అందుకు నేను బాధపడటం మావి చాలా కాలమయింది. నాకు కావల్సిందల్లా నీ దగ్గిర వున్న ఒరిజినల్ పార్ములా కాగితాలు." సందు చూసి మెల్లిగా మాట వదిలాడు షాడో.

"అవి ఎందుకు పనికివస్తాయో నాకు తెలియదు. దాని కాపీలు అందరికి పంచిపెట్టారు కదా? అదుగో నా బాగ్ లో వున్నాయి చూడు." మరొక వామిట్ చేసుకుంటూ అన్నది జెన్నీ.

వెంటనే బాగ్ అందుకొని అందులో వున్న కాగితాలను బయటికి లాగాడు షాడో. సిగిరెట్ లైటర్ తీసి వాటి ఎదుటపెట్టి మూడు సార్లు స్క్రూ తిప్పాడు. నిశ్శబ్దంగా ఫోటో ఫిలిం మీద శాశ్వతంగా ముద్ర పడిపోయాయి ఆ కాగితాలలోని అంశాలు.

వాటిని తిరిగి బాగ్‌లో పెట్టి, బాత్ రూం దగ్గరికి పోయాడు షాడో.

"వెల్ జెన్నీ..... ఇక నీ ప్రోగ్రాం ఏమిటి?" అని అడిగాడు తలుపునానుకొని నిలబడుతూ.

"ఏముంది లెక్చరు యివ్వటానికి వచ్చి చాలా పెద్ద ఘనకార్యం చేశానుగా! ఇక రేపు ఇంటికి వెళ్ళిపోతాను." జవాబిచ్చింది జెన్నీ.

"బాక్ టూ ఆల్మోరా" అన్నాడు షాడో.

సడన్‌గా వాష్ బేసిన్ దగ్గిర నుంచి పక్కకు తిరిగిందామె భ్రుకుటి ముడిచి షాడో వంక చూసింది. "వెల్ రాజూ!నా గురించి నీకు చాలా తెలుసే?" అన్నది ఆశ్చర్యంగా.

"ఇంకా చాలా తెలుసుకోవాలని వుంది." అన్నాడు షాడో.

అతని మాటలు ఇంకో విధంగా అర్థం చేసుకుని సిగ్గుతో మొగ్గ అయిపోయింది జెన్నీ.

"హౌ ఎబౌట్ ఎ డాన్స్ జెన్నీ. సాయంత్రం డాన్స్ ప్రోగ్రాం వుందిగా – దానికి పోదామా?" అదను చూసి అడిగాడు షాడో.

మౌనంగా తల వూపింది జెన్నీ.... మెరుస్తున్న కళ్ళతో. స్కోర్ వన్ – లాస్ వన్ అనుకుంటూ గదికి తిరిగి వచ్చాడు షాడో. తలుపులు బంధించి జేబులో నుంచి ఫౌంటన్ పెన్ తీసి, దాని కేప్ మీద వున్న బుడిపెను పట్టుకొని పైకి లాగాడు. మూడు అడుగుల ఎత్తున సన్నటి ఇనుప వైరు బయటకు వచ్చింది. వెంటనే 'బీప్.... బీప్' మంటూ పని చేయసాగింది అందులోని ట్రాన్స్ మీటరు.

రెండు క్షణాలలో అవతలి వైపు నుంచి సమారానం వచ్చింది.

"ఈగిల్ టు డ్రాగన్... వాటీజ్ ది న్యూస్ ?" ఖంగుమన్నది కులకర్ణి గారి గొంతు.

"డ్రాగన్ టు యీగిల్. గుడ్ ఆఫ్టర్‌నూన్ బాస్! పని సగం అయింది. మన మిత్రులు నాకన్నాముందే ఇక్కడకు చేరుకున్నారు. మీరు అన్నంతపనీ చేశారు. ఎనీవే – ఆ కాగితాలు నా దగ్గిర వున్నాయి" అంటూ జరిగినదంతా రిపోర్టు చేశాడు.

"బాస్! సాయంత్రం డాన్స్ ప్రోగ్రాం వేశాను. కాని ఆ కాగితాలలో ఏముందో తెలియకుండా నేను ఆమెతో మాట్లాడటం ఎలాగో అర్థం కావటం లేదు" అన్నాడు.

"రాజూ! అందుకే మన స్పెషల్ ఎఫెక్ట్సు సైంటిస్టు లందరూ లండన్ బయలుదేరారు. వారితోపాటు శ్రీకర్‌ని గూడా పంపుతూ వున్నాను. సో.... ఆ కాగితాలు నీ గదిలో వుంచు. ఇక సాయంత్రం ఆమెతో సంభాషించటానికి నీ ఇమాజినేషన్ ఉపయోగించక తప్పదు జాగ్రత్త! ఆమెకు ఎటువంటి అపాయం కలుగకుండా చూడు. ఓవర్ అండ్ అవుట్!" అంటూ డిస్కనెక్టు చేశారు కులకర్ణిగారు.

గట్టిగా నిట్టూరుస్తూ ఏరియల్‌ని మడిచి యధా ప్రకారం పెన్ జేబులో పెట్టుకున్నాడు షాడో. ఒకసారి ఆమెనోరు మూయించారు శత్రువులు. ఇప్పుడు తనతో తిరగటం చూస్తే శాశ్వతంగా నోరు మూయించే ప్రయత్నాలు జరగవచ్చు. అందుకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సంచరించాలి. అనుకున్నాడు కలకర్ణిగారి ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం కాగితాలను, పోటోఫిలింనీ ఒక సంకేత స్థానంలో వుంచి మంచం మీద వాలాడు.

★ ★ ★

"రియల్లీ జెన్నీ. మీ సైంటిస్టులలో యింత అందమైన లేడీస్ వుంటారని అనుకోలేదు సుమా" అని వెంటనే నాలుక కొరుకున్నాడు షాడో. కాని జరగవలసిన డామేజీ జరిగిపోయింది. కనుబొమలెత్తి వింతగా చూసింది జెన్నీ. మవునంగా చేయి అందించి అతనితో బయలుదేరింది.

మళ్ళీ సైంటిస్టుల ప్రసంగం రాకుండా మిగిలిన విషయాలను గూర్చి మాట్లాడసాగాడు షాడో. అప్పుడప్పుడూ కను చివరలనుంచి జెన్నీ తనను పరీక్షగా చూస్తూండడం గమనించకపోలేదు.

వారిద్దరూ డాన్స్ హాల్ చేరేసరికి పుల్‌గా పాక్ అయివుంది ఆ ప్రదేశం. రెండు నిముషాలు వెయిట్ చేసి అవకాశం రాగానే తాము గూడా డాన్స్‌లో పాల్గొన్నారిద్దరూ. కుడిచేతితో జెన్నీ ఎడమచేయి పట్టుకొని, ఎడమ చేతిని – ఆమె నడుంచుట్టూ చుట్టి స్టైయిల్‌గా డాన్సింగ్ ఫ్లోర్ మీద గ్లయిడ్ చేయ్యసాగాడు షాడో.

"రాజూ! ఒక ప్రశ్న అడుగుతాను! ఏమనుకోకుండా ఫ్రాంక్‌గా సమాధానమిస్తావా?" అడిగింది జెన్నీ.

"ష్యూ బేబీ.... ఏమిటి?" వచ్చే ప్రశ్నను ముందే వూహించి జాగ్రత్తపడ్డాడు షాడో.

"నువ్వు సైంటిస్టువి కాదు.నీ పేరు ప్రొఫెషనల్ రిజిస్టర్ లో లేదు. జస్టు వాటార్ యూ మిస్టర్ షాడో?"

"అయితే నన్ను గురించి ఆరాలు తీశావన్న మాట!"

"పరిచయం లేని వ్యక్తి వచ్చి అంత చనువుగా మాట్లాడుతుంటే అనుమానం రావడం సహజం"

"ఓకే దెన్, ఇక దాచి ప్రయోజనంలేదు నేనొక సీక్రెట్ ఏజెంట్‌ని. నీ ప్రొఫెషనల్ సీక్రెట్‌ని అపహరించటానికి వచ్చాను."

పకపకా నవ్వింది జెన్నీ. "యువ్వార్ వేస్టింగ్ యువర్ టైమ్ రాజూ! నా దగ్గిర అటువంటి రహస్యాలేమీ లేవు. ఉన్నవన్నీ మా అంకుల్ దగ్గిరే వున్నాయి. జస్టు...... ఆయన్ను రిప్రజెంట్ చేయడమే నా పని."

"అయితే..... నీ గొంతు బాగుండి నువ్వు లెక్చర్ ఇస్తున్నావనుకో.... నేను ప్రేక్షకులలో కూర్చుని వింటూ ఉంటానని ఊహించు. నాకొక బ్రహ్మాండమయిన సందేహం వస్తుంది. అదేమిటో చెప్పగలవా!"

రెండు క్షణాలు తటపటాయించింది జెన్నీ. "ఇది చాలా గుడ్డు సమస్య రాజూ! యాక్చువల్‌గా నేను చదవ వలసిన పేపర్లలో రెండు విషయాలున్నాయి. ఒకటి ఆల్కహాలిక్ డ్రింక్ ఫార్ములా. రెండవది అదేమాదిరి మరొక రకమైన కెమికల్ కాటన్‌ని గురించిన ఫార్ములా. ఈ రెంటిని గురించి కొద్ది కొద్ది వివరాలు యివ్వబడ్డాయి. వాటి పూర్తి వివరాలు అంకుల్ క్లీ దగ్గిరే వున్నాయ. ఎటుతిరిగీ ప్రశ్నలు వేస్తే నేను నాకు తెలిసిన విషయాలు చెప్పాలి. అలా చెప్పవద్దని అంకుల్ ఆదేశం. అందువల్ల నీ సందేహం ఎటు వంటిదైనా నేను యివ్వగల సమాధానం కాదు" అన్నది.

మెరుపు మెరిసినట్లు జెన్నీ గొంతు పాడిపోవటంలోని పరమార్థాన్ని గ్రహించాడు షాడో. కాగితాలలోని విషయాలు విని సైంటిస్టులందరూ రక రకాల ప్రశ్నలు వేయక మానరు. ఆ గడబిడిలో జెన్నీ పొరపాటున తనకు తెలిసిన వివరాలను బయట పెడ్తూందేమోనని భయపడింది కిల్లర్స్ కాంగ్. అందుకే నోరు మూయించటం జరిగింది.

డాన్స్ చేస్తూ తమ ఇద్దరివంకా ఓ మధ్యవయస్కుడు చూస్తూ వుండటం గమనించాడు షాడో. తన వైపు చూడగానే చేయి ఎత్తి సైగ చేశాడా వ్యక్తి . ఆ సైగ తనకో జెన్నీకో అర్ధం కాక ఆమెను మెల్లిగా డాన్సింగ్ ఫ్లోర్ చివరకు గైడ్ చేశాడు షాడో.

అంతకు ముందు కాన్ఫరెన్స్ హాల్లో చూసిన కిల్లర్స్ గాంగ్ మెంబర్లు మరొకసారి దర్శనమిచ్చారు. వెంటనే ఒక డెసిషన్‌కి వచ్చి జెన్నీని సమీపంలో వున్న కుర్చీలో కూర్చోపెట్టాడు.

"జెన్నీ..... ఒక్క నిముషంలో వచ్చేస్తాను. చాలా అర్జంటు పని వుంది" అంటూ బాత్ రూమ్స్ వైపు కదిలాడు . అప్పుడే తమను చూసి సైగచేసిన మధ్య వయస్కుడు జెన్నీని సమీపించటం గమనించి , ఒక స్థంభం చాటున నిలబడ్డాడు.

"మిస్ జెన్నీ..... నా పేరు స్టీఫెన్స్..... విలియం స్టీఫెన్స్. నువ్వు సర్క్యులేట్ చేయించిన కాగితం చూశాను! అందులో వున్న విషయాలను ఎనలైజ్ చేస్తే వచ్చే నాన్సెన్స్ ఏమిటో మీకు తెలుసా? వాటిమీద ప్రయోగాలు చేశారా?" గద్దించి అడగసాగాడు మధ్య వయస్కుడు.

ఇక ఒక్క క్షణంకూడా అక్కడ నిలబడకుండా బాత్‌రూంలోకి పరుగుతీశాడు షాడో జేబులోనుంచి పెన్ తీసి కులకర్ణిగారిని కంటాక్టు చేశాడు.

వెంటనే కనెక్షన్ వచ్చింది. అది ఇండియా నుంచి కాదు, లండన్ నుంచే. "హల్లో కాంప్ బీ టు డ్రాగన్. గురూ.... శ్రీకర్‌ని మాట్లాడుకున్నాను. మాకంటే ముందే నీ గది చెక్ చేయబడింది. అదృష్టవశాత్తు ఆ పేపర్లు ఫిలిం మాత్రం మాకు

దొరికాయి." లండన్ చేరుకున్న శ్రీకర్ సరాసరి షాడో గదికిపోయి ఆ వస్తువుల్ని స్వాధీనపరుచుకున్నాడు.

"మరేం ఫరవాలేదు. అందులో వాల్యుబుల్స్ ఏమీ లేవుకాని..... ఆ కాగితాలలో ఏముందో తెలిసిందా? ఇక్కడ నా పీకల మీదికి వచ్చింది." ఆత్రంగా అడిగాడు షాడో.

"ఇంకా వాటితో కుస్తీ పడుతూనే వున్నారు గురూ.... ఆ రెండవ ఫార్ములా వుంది చూశావ్.... అది కొంచెం గడబిడగా వుంది అంటున్నారు!" అన్నాడు శ్రీకర్.

"అదే వచ్చిన గొడవ. అదే మాట. ఒక ముసలాడు జెన్నీని అందరిలోనూ నిలదీసి అడుగుతున్నాడు. అయితే, వుంటాను" అంటూ డిస్కనెక్టు చేసి మళ్ళీ డాన్స్ హాల్లోకి పరుగుతీశాడు షాడో.

జెన్నీ, స్టీఫెన్స్ యిద్దరూ చాలా హాట్‌గా వాదించుకుంటున్నారు. క్రమక్రమంగా స్టీఫెన్స్ గొంతుపైకి లేస్తోంది. అందరూ వారివంక చూడటం మొదలుపెట్టారు.

స్టీఫెన్స్ చేస్తున్న గొడవవల్ల జెన్నీ ట్రబుల్‌లో పడబోతోందని గ్రహించాడు షాడో అతని ప్రశ్నలకు సమాదానాలు యిస్తే ఒక గొడవ..... యివ్వకపోతే మరొక గొడవ. తను కల్పించుకొని సమాధాన పరుద్దామని ముందుకు అడుగు వేశాడు.

పక్క నుంచి "టప్" మంటూ చిన్న శబ్దం వినిపించింది. వేడిగాలి అతని చెవిపక్కగా దూసుకుపోయింది.

జెన్నీ ఎదుట నిలబడి అరుస్తున్న స్టీఫెన్స్ వున్నట్లుండి చిన్న జర్కు యిచ్చి వెల్లకిలా పడిపోయాడు.

కింద గుండుసూది పడినా వినిపించేటంత నిశ్శబ్దమై పోయింది డాన్స్ హాల్. ఎవరికి వారు బోమ్మలా బిగుసుకుని నిలబడిపోయారు.

ఒక్క గంతులో పోయి స్టీఫెన్స్ చేయి పట్టుకొని నాడి చూశాడు షాడో. అప్పటికే అతని ప్రాణవాయువులు గాలిలో కలిసిపోయాయి.

"ఎవరైనా పోయి డాక్టర్‌ని పిలవండి...... పోలీసులకు ఫోన్ చేయండి." బొమ్మలలాగా నిలబడిపోయిన వారివంక చూస్తూ కమాండ్ చేశాడు షాడో.

అక్కడ వున్నవారిలో నాలుగువంతులు డాక్టర్లే. వారందరూ ఒక్కసారి ముందుకు వచ్చారు. అందరూ మొదటి చూపుతోనే షాడో అభిప్రాయాన్ని కన్‌ఫరమ్ చేశారు.

మరో ఐదు నిముషాలలో సైరన్ మోగించుకుంటూ వచ్చింది పోలీస్ వాన్. స్కాట్ లాండ్ యార్డు ఆఫీసర్, అతనితో పాటు పదిమంది కానిస్టేబుల్స్ బూట్లు టక – టక లాడించుకోంటూ లోనికి వచ్చారు.

ఎవరినీ కదలవద్దని హెచ్చరించి తమ ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు. వెంటనే, తెల్లగా పాలిపోయిన జెన్నీకి ధైర్యం చెపుతూ ఒక పక్కన నిలబడ్డాడు షాడో. కిల్లర్స్ గాంగ్ స్టీఫెన్స్‌ని చంపటంలో వున్న అర్థం అతనికి అంతుబట్టలేదు.

"ఎందుకిలా చేశారు? కారణం లేకుడా హత్య చెయ్యటము....." అనుకుంటూ జరుగుతున్న ఇన్వెస్టిగేషన్ మీదికి దృష్టి మరలించాడు.

వచ్చిన స్కాట్‌లాండ్ యార్డు ఆఫీసర్ చాలా ఎఫిషియంట్ హేండ్. ఐదు నిముషాలలో అందర్నీ ప్రశ్నించటం పూర్తిచేశాడు. స్టీఫెన్స్ పడిపోయినప్పుడు

ఎవరెవరు ఎక్కడెక్కడ వున్నారు? సౌండ్ ఎటు వైపు వచ్చింది? ఎలా వినిపించింది? వసరగా అడిగాడు.

జెన్నీ వంతు వచ్చింది. తన కళ్ళ ముందే హత్య జరగటంవల్ల తడబడిపోయినా, ఆ ప్రశ్నలకు సరిగానే సమాధానా లివ్వగలిగింది జెన్నీ. మరికొందరు ఆమె సమాధానాలను బలపరిచారు.

నెమ్మదిగా పోలీసుల ఇన్వెస్టిగేషన్ ఒక దారికివచ్చింది. వీపులో దిగబడింది రివాల్వర్ బుల్లెట్. అంటే షాట్ బాత్‌రూంల వైపు నుంచి వచ్చింది. ఆ ప్రదేశంలో ఉన్న దెవరు?

ఒకరి తరువాత ఒకరుగా అందరూ షాడో వైపు చూపించసాగారు, అదీగాక, స్టీఫెన్స్ పడిపోగానే అందరిలా ఆశ్చర్యంతో నిలబడిపోక వెంటనే అతడ్ని సమీపించింది కూడా అతనొక్కడే అని తేలింది. ఆ విషయం జెన్నీ కూడా ఒప్పుకున్నది.

"మీరు పొరబడుతున్నారు సార్! నా దగ్గిర ఆయుధం ఏమీ లేదు" అన్నాడు షాడో – ఆఫీసర్ తనవంక సీరియస్‌గా చూస్తూండటం గమనించి.

అతని మాటలు వినిపించుకోకుండా తన కానిస్టేబుల్స్‌కి సైగ చేశాడు ఆఫీసర్. బాత్‌రూం సమీపంలో వున్న ల కుండీలోనుంచి సైలన్సర్ అమర్చబడిన .44 కాలిబర్ రివాల్వర్ బయటపడింది.

దాన్ని చూడగానే స్టన్ అయిపోయాడు షాడో. అంతకు ముందు తన రూంలో ఎవరో ప్రవేశించారన్న శ్రీకర్ మాటకు అర్థం తెలిసింది కిల్లర్స్ గాంగ్ స్టీఫెన్స్‌ని చంపటానికి కారణం బోధపడింది.

తన రివాల్వర్‌తో హత్యచేసి, నేర్పుగా తననే ఇరికించారా కేసులో. "ఇక ముసుగులో గుద్దులాట దేనికి సార్! అది నా రివాల్వరే!" అంటూ చేతులు ముందుకు చాచాడు.

★ ★ ★

తనను వుంచిన సెల్ కంఫర్టబుల్‌గా లేకపోయినా క్లీన్‌గా వున్నందుకు సంతోషిస్తూ బంక్ మీద పడుకున్నాడు షాడో. సెంట్రీలు సమీపంలో లేరని నిర్ధారించుకుని జేబులో నుండి పెన్ తీశాడు. ఇంకా ఇంటరాగేషన్ మొదలు కాలేదు. అందువల్ల అతని వస్తువులు అతని దగ్గిరే ఉంచారు పోలీసులు. అందుకు వారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ కేప్‌లో కొన్ని ఎడ్జస్టుమెంట్స్ చేశాడు. సరాసరి సి.ఐ.బి. హెడ్ క్వార్టర్స్‌కి కనెక్టు చేసిందా ట్రాన్స్‌మీటర్.

"హల్లో రాజూ! వాటీజ్ ది న్యూస్?" నవ్వుతూ అడిగారు కులకర్ణిగారు.

"ఏం సార్, నవ్వుతున్నారు? నా పోజిషన్ అప్పుడే మీకు తెలిసిపోయిందా?" అనుమానంగా అడిగాడు షాడో.

"తెలియక ఏముంది? మన ఏర్పాట్లన్నీ స్కాట్‌లాండ్ యార్డు కో–ఆపరేషన్ తోనే జరిగాయి. నిన్ను అరెస్టు చెయ్యగానే నాకు తెలియజేశారు. మరేం ఖంగారుపడకు – రేపు తెల్లవారగానే వదిలేస్తారులే!"

"గొప్ప పని చేస్తారు. ఇంతకూ ఆ ఫార్ములాలు....." "యస్ రాజూ! దే ఆర్ అండర్ వే. ఒరిజినల్ సేవర్లలో కొన్ని కొట్టివేతలు, తుడుపులూ వున్నాయట. అవి కంప్యూటర్ మీద కాలిక్యులేట్ చేయడానికి ఢిల్లీ వచ్చేస్తున్నారు మనవాళ్ళు. ఆ విషయం పూర్తిగా తెలియగానే, వివరాలన్నీ నీకు అందచేసే ఏర్పాట్లు చేస్తాను.

"ఆల్ రైట్ సార్! శ్రీకర్‌ని నా రూంలోనే వుండమనండి! అతనితో కొంచెం పని వుంది." అప్పటికప్పుడు ఒక ఆలోచన వచ్చి అన్నాడు షాడో.

"ఓకే ఎనీమోర్?"

"నో. థేంక్యూ!" అని డిస్కనెక్టు చేశాడు షాడో. మొత్తానికి తను ఎవరో – ఎందుకు వచ్చాడో తెలిసి కూడా తీసుకొచ్చి సెల్‌లో కూర్చోపెట్టారన్నమాట! ఆల్‌రైట్..... వీళ్ళకి కాస్త షాడో దెబ్బ రుచి చూపించాలి......అనుకుంటూ లేచి తలుపు దగ్గర నిలబడ్డాడు.

పది నిముషాల తరవాత నైట్ డ్యూటీ సెంట్రీ గదులన్నిటినీ చెక్ చేసుకొంటూ వచ్చాడు. షాడో వున్న సెల్ దగ్గిరికి వచ్చి అతన్ని చూచి నవ్వాడు.

"హల్లో మిస్టర్ షాడో! రేపు ఉదయందాకా నీకీ బాధతప్పదు. ఓపిక పట్టు!" అన్నాడు. అతని మాటలకు చిరునవ్వు నవ్వి.... వినిపించీ వినిపించనట్లు గొణిగాడు షాడో. అప్రయత్నంగా రెండు అడుగులు ముందుకువేసి దగ్గిరిగా వచ్చాడు సెంట్రీ.

మెరుపులా, చేతులు వూచల సందుల్లో నుంచి ముందుకు పోనిచ్చాడు షాడో. అతని తలని ఒడిసి పట్టుకొని బలంగా ముందుకు గుంజాడు. వూచలకు కొట్టుకొని ఖంగుమన్నది సెంట్రీ తల. అరవటానికి నోరు తెరిచి. అలాగే కిందికి జారిపడ్డాడు.

అతని బెల్టుకు వేలాడుతున్న మాస్టర్ కీని అందుకొని తలుపు తెరిచాడు షాడో. తన బంకుమీద సెంట్రీని పడుకోపెట్టి, చెదిరిపోయిన టై సవరించుకొంటూ బయటికి వచ్చాడు.

ఇంటరాగేషన్ కాంపౌండ్ కావటంవల్ల పెద్ద కాపలా లేదక్కడ. ద్వారం దగ్గర వున్న సెంట్రీ షాడో ధైర్యంగా పక్కలకు చూడకుండా అడుగులు వేయటం గమనించి శాల్యూట్ చేశాడు.

అతని శాల్యూట్ రిసీవ్ చేసుకుంటూ రోడ్ మీదకు అడుగు పెట్టాడు.

★ ★ ★

సరిగ్గా ఇరవై నిముషాల తరువాత మంచి నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేచింది జెన్నీ. శబ్దం లేకుండా అడ్డపడి నోటిని గట్టిగా అదిమి పట్టిందొక చెయ్యి.

"నోరు మూయటంలో యిదొక పద్ధతి జెన్నీ! చెయ్యితీస్తే అరిచి గొడవ చేయవ్ కదా?" బెడ్ లైట్ కాంతిలో మంచం. చివరగా కూర్చున్న షాడోను గుర్తుపట్టింది జెన్నీ వెంటనే చేయి తీసేశాడు షాడో.

"ఇ..... ఇక్కడికి..... ఎలా... వచ్చావ్?" భయంగా అడిగిందామె.

"ఆ విషయాలు తర్వాత మాట్లాడుకుందాం గాని స్టీఫెన్స్ నీతో ఏం మాట్లాడాడు?"

"ఆ కాగితంలో వున్న డ్రాయింగులన్నీ తప్పులంటాడు. అది నాకేం తెలుసు? అని నేను గీసినవి కాదాయె?"

"కరెక్టు. అందుకే నీకు తెలియకుండానే. కాపీలు తీయించబోయే ముందు ఆల్టర్ చేయబడ్డాయా డ్రాయింగులు. వాటిని గురించి నువ్వు అనేక రకాలైన ప్రశ్నలు ఎదుర్కోవలసి వస్తుందనే నీ నోరు మూయించటం జరిగింది. జెన్నీ! ఆ ఫార్ములాలు ఎందుకో నీకు తెలియదా?"

"లేదు రాజూ! నాకు తెలిసిందల్లా వాటిని తయారుచేసే పద్ధతి మాత్రమే. అవి ఎందుకు ఉపయోగిస్తారో నాకు చెప్పలేదు ఆంకుల్. ఇంతకూ అసలు విషయం ఏమిటి ?"

"ఏముంది? నీ దగ్గిర భయంకరమైన ఇన్‌ఫర్‌మేషన్ వుంది. అది తన ఆర్గ్యుమెంట్స్‌తో బయటకు తేబోయిన స్టీఫెన్స్ చచ్చి స్వర్గంలో వున్నాడు. ఆ పని చేసినవారు మరొక్కసారి నిన్ను మౌనంగా వుంచే ప్రయత్నం చేయవచ్చు. అది పర్మినెంట్‌గా కాకుండా చేయాలనే నా తపన" అన్నాడు షాడో.

"నన్ను కారణం లేకుండా భయపెడ్తున్నావ్?"

"సరేలే, నీకు కారణాకారణాలు చూపించటానికి టైం లేదు గాని, రేపు విమానం ఎక్కేదాకా కాస్త జాగ్రత్తగా వ్యవరించు. నేను సమీపంలోనే వుంటాననుకో ఎందుకైనా మంచిది. మెలకువగా వుండండి?"

"నాతోపాటు నువ్వుకూడా గ్రీన్‌లాండ్ వస్తున్నావా?"

"మరేమనుకున్నావ్? నీ లాంటి అందగత్తెను చూడటమంటూ జరగకూడదు. చూసిన తర్వాతా వదిలిపెడ్తాననేనా నీ ఉద్దేశం?"

★ ★ ★

షాడో ఇంటరాగేషన్ కాంపౌండ్ నుంచి తప్పించుకున్నట్లు స్కాట్‌లాండ్ యార్డు బయట పెట్టకపోయినా కొంతమందికి తెలిసిపోయిందా విషయం. వెంటనే రెండు కార్లు సైంటిస్టులకు కేటాయిచబడిన భవనంముందు కాపువేశాయి. లోపలి నుంచి వచ్చేవారిని పరీక్షగా చూడటం ప్రారంభించారు అందులోని వ్యక్తులు.

సరిగ్గా ఏడు గంటలు అయ్యేసరికి చిన్న బ్రీఫ్ కేస్ పట్టుకొని ఠీవిగా అడుగులు వేస్తూ బయటికి వచ్చాడొక సిక్కు.

అటూ ఇటూ చూసి ఒక టాక్సీలో ఎయిర్ పోర్టుకు బయలుదేరాడు.

అతని వెనుకే ఆ రెండు కార్లు కదిలాయి. రేడియో ట్రాన్స్‌మీటర్లు బిజీగా పనిచేశాయి. క్రీట్ ఆర్డర్లు రిసీవ్ చేసుకొబడ్డాయి. గ్రీన్‌లాండ్ పోయే ప్లేనుకోసం కస్టమ్స్ క్యూలో నలబడ్డ పిక్కు యువకుని చుట్టూ నలుగురు వ్యక్తులు మూగారు. వారి తోపులాటలో క్యూ చెదిరి పోయింది. అందరూ అసహనంగా చూడసాగారు.

వారందరికీ దూరంగా నిలబడి చుట్టూ చూడసాగింది జెన్నీ. ఆమె కళ్ళు వెతుకుతున్న ఆకారం ఎక్కడాకన్పించక పోయేసరికి నిరాశగా వాలిపోయాయ్. కౌంటర్ ముందు జరుగుతున్న గొడవ ఆమెను ఆకర్షించింది.

ఆ సిక్కు యువకుడు కస్టమ్స్ ఆఫీసర్స్‌తో గట్టిగా పోట్లాడుతున్నాడు. క్యూలో నిలబడిన తన్ను, ఎవరో నొక్కి వేశారనీ తన బ్రీఫ్‌కేసును కిందపడగొట్టి ఓపెన్ చేశారనీ కంప్లయింట్ చేస్తున్నాడు.

కిందికి చూసిన కస్టమ్స్ ఆఫీసర్ అదిరిపడ్డాడు. బ్రీఫ్ కేసులో వాచీలు, బంగారు బిస్కట్లు మొదలైన రకరకాల స్మగుల్డు గూడ్స్ అన్నీ వన్నాయి. వెంటనే అతన్ని ఆఫీసులోకి తీసుకుపోవటానికి ప్రయత్నించాడతను.

మరు క్షణం తన పోట్లాట ట్యూన్ మార్చాడు ఆ పిక్కు యువకుడు.

"చూడండి సార్, నేను యిందాకటినుంచి గ్లోవ్స్ ధరించే వున్నాను ఆ వస్తువులను ఎవరో కావాలని నా బ్రీఫ్ కేసులో ప్లాంట్ చేశారు. నేను చూపించిన వారి ఫింగర్ ప్రింట్లు తీసి..... వాటి మీద ముద్రలతో పరీక్షించండి – స్మగ్లర్స్

ఎవరో తెలిసిపోతుంది" ఆ మాటలు వినగానే క్యూలో నుంచి కొంతమంది వెళ్ళిపోవటానికి ప్రయత్నించారు. కాని వారందర్ని నిలబెట్టి చెక్ చేయసాగారు, కష్టమ్స్ ఆఫీసర్లు.

షాడో వస్తానని చెప్పి రాకపోవటం జెన్నీకి బాధ కలిగించింది ఇక అతనితో మాట్లాడగూడదని నిర్ణయించుకుని పక్కకు తిరిగింది.

"మిస్... మీరలా ఆలోచిస్తూ వుంటే ప్లేన్ వెళ్ళిపోతుంది." అంటూ ఆమె సూట్‌కేస్ అందుకున్నాడొక మధ్య వయస్కుడు. అతని మాటలకు ఉలిక్కిపడి తిరిగి యీ ప్రపంచంలోకి అడుగు పెట్టింది జెన్నీ.

"థాంక్యూ వెరీమచ్. ఒక ఫ్రెండ్ కోసం వెయిట్ చేస్తున్నాను. వస్తానని చెప్పి మోసం చేశాడు" అన్నది అతనితోపాటు అడుగులువేస్తూ.

"అంతే మేడం... ఈ ప్రపంచమంతా మోసగాళ్ళతో నిండివుంది. సరిగ్గా చూస్తేగాని గుర్తుపట్టలేం" అన్నాడు ఆ వ్యక్తి.

వారు ఎక్కిన ఐదునిముషాలకు డన్ వే మీద పడితీయసాగింది ప్లేన్. ఆఖరి నిముషం దాకా షాడో వస్తాడు అనుకున్నది జెన్నీ.... దీర్ఘంగా నిట్టూరుస్తూ తన పక్కకూర్చున్న మధ్యవయస్కుడి వంక తిరిగింది.

"క్షమించాలి, మీ పేరు అడగనేలేదు!" అని ప్రశ్నించింది.

విమానం గాలిలోకి వచ్చిన తరువాత ఆ ప్రశ్నకి సమాధాన మిచ్చాడా వ్యక్తి. నెత్తిమీదవున్న హేట్ పక్కన పడవేశాడు. ముఖానికి తగిలించుకొన్న రబ్బర్ కవర్‌ని వూడదీశాడు.

"నిన్ను అంత తేలికగా వదుల్తానని అనుకున్నావా?" నవ్వుతూ అన్నాడు.

"రాజూ ఏమిటీ గొడవంతా?" ఆశ్చర్యం, ఆనందం కలిసిన స్వరంతో అడిగిది జెన్నీ.

"మామూలే డియర్! వాళ్ళు ఒకరికోసం ఎదురుచూస్తున్నారు. అందుకే ఆ ఒకడుగా మా శ్రీకర్ వారికి కనిపించాడు. ఆ సందడిలో నేను తప్పించుకొని వచ్చేశాను. "

"అతను కస్టమ్స్ దగ్గిర ఎన్ని బాధలు పడుతున్నాడో"

"డోన్ట్ వర్రీ! శ్రీకర్‌కి ఏం చేయాలో బాగా తెలుసు. అతను మోసుకువస్తున్న స్మగులు గూడ్స్ మీద తమ ఫింగర్ ప్రింట్స్ ఎలా వచ్చాయో ఎక్స్‌ప్లెయిన్ చేయలేక అవస్థలుపడుతూ వుంటారా కిల్లర్స్ గాంగ్ మెంబర్లు. వారి ఆరోగ్యానికి అది చాలా మంచిది" అని చుట్టూ కలియ చూశాడు షాడో. రెండు వరుసల ముందున్న సీట్లలో కూర్చున్నవారిని చూడగానే కొంచెం షాక్ తిన్నాడు.

"వెధనలు. చాలు తెలివైనవాళ్ళు. జెన్నీ.... ఎందుకైనా మంచిదని ప్లేసులో కూడా యిద్దర్ని పెట్టాడు డోన్ట్ వర్రీ.... వాళ్ళు నిన్నేం చేయరు. వారికి కావల్సింది నేను. నా కోసమే యిన్ని బాధలు పడుతున్నారు" అన్నాడు.

అర్థం కానట్లు ముఖంపెట్టి అతనికి దగ్గిరిగా జరిగి కూర్చుంది జెన్నీ.

★ ★ ★

ఆల్మోరా పర్వతలోయలు ఎంతో ఆహ్లాదకరంగా వుంటాయి. ఆల్మోరా సిటీ కూడా చాలా అందంగా వుంటుంది. అందుకే టూరిస్టులందరూ ఆ పరిసరాలలో తిరుగుతూ వుంటారు.

పర్వతపాదాల నుంచి ప్రవహిస్తున్న సెలయేళ్ళ దగ్గిర కూర్చుని ఫిషింగ్ రాడ్స్‌తో చేపలుపడుతూ... టేప్ రికార్డర్లూ, ట్రాన్సిష్టర్లలో వినిపిస్తున్న సంగీతాన్ని వింటూ టైం పాస్ చేస్తూ వుంటారు.

అదే మాదిరి ఒక టూరిస్టు మిస్టర్ క్లీ భవంతి సమీపంలో వున్న సెలయేటి వద్ద కూర్చుని చేపలు పట్టుకుంటున్నాడు. పక్కనేవున్న మినీ ట్రాన్సిష్టర్ లోనుంచి సంగీతం వినిపిస్తోంది.

మిస్టర్ క్లీ భవనం చుట్టూ పెద్ద తోట వుంది. అందులో ఇద్దరు స్త్రీ పురుషులు పచార్లు చేస్తూ మాట్లాడుకుంటున్నారు

సెలయేరు ఒడ్డున వున్న యువకుడు ఫిషింగ్ రాడ్ మీద వున్న చిన్న బటన్ నొక్కాడు. నీటిలో తేలుతున్న జీలు బెండు... నీటివాలున కొట్టుకుపోయి ఆ స్త్రీ పురుషులకు వందగజాల దూరంలో నీటిమీద నిలబడింది.

ట్రాన్సిష్టర్‌లో వస్తున్న మ్యూజిక్ ఆగిపోయింది చిన్నగా.... క్లియర్‌గా వినిపించసాగాయి రెండు కంఠాలు.

"..... నో నో... మిస్టర్ వెల్బీ! అంకుల్ క్లీ కిల్లర్ గాంగ్ రిప్రజెంటేటివ్స్‌తో తప్ప మాట్లాడడు. మీరు కిల్లర్స్ గాంగ్ నుంచే వచ్చారని వప్పుకోండి. ఈ క్షణంలో అంకుల్ దగ్గరికి తీసుకుపోతాను."

"అలా అంటే ఎలా కుదురుతుంది మిస్ ఎమిలీ! అంకుల్ తయారుచేసిన ఫార్ములాలు పనిచేస్తాయో – చేయవో తెలియకుండా నేను చెప్పేదేమీ లేదు. ముందు వాటిని చూచి.... ఆ తర్వాత..... మన బార్గెయిన్ విషయం మాట్లాడుకుందాం."

"అంకుల్ సంగతి నాకు బాగా తెలుసు. అసలు యీ ఫార్ములాలు ఎందుకు కనిపెట్టారో ఇంకా బాగా తెలుసు. కిల్లర్స్ గాంగ్ సుప్రీం కమాండ్‌లో స్థానం యిస్తే..... రెండు ఫార్ములాలు కిల్లర్స్ గాంగ్‌కు డోనేట్ చేస్తారు. ఆ విషయం తప్ప నువ్వు కొన్ని లక్షల డాలర్లు ఇచ్చిన ఒప్పుకోవటం సంభవించదు."

రెండు నిముషాలపాటు గంభీరమైన నిశ్శబ్దం ఆవరించిందా ప్రదేశాన్ని. ఫిషింగ్ రాడ్ బటన్ పక్కనే వున్న చిన్న చక్రాన్ని రెండుసార్లు తిప్పాడా యువకుడు. ట్రాన్సిస్టర్ వాల్యూమ్ హెచ్చింది.

మరో పది సెకండ్ల తరువాత వెల్బీ గొంతు పెద్దగా వినిపించింది. వెంటనే వాల్యూమ్ తగ్గించి ఎవరైనా వింటున్నారేమో అని చుట్టూ చూశాడతను. కనుచూపు మేరలో ఎవరూ కనిపించలేదు. మరొక్కసారి ఆ మాటలు వినటంలో నిమగ్నుడై పోయాడు.

"ఆల్‌రైట్ ఎమిలీ! నీతో వాదించడం చాలా కష్టం సరే... నువ్వు అంటున్నట్లు నేను కిల్లర్స్ గాంగ్ తరపునే వచ్చాననుకో – కాని సుప్రీం కమాండ్‌లో స్థానం కావాలంటే.... అది నావల్ల అయ్యేపని కాదుగదా!"

"కరెక్ట్. నీవల్ల కాదని నాకూ తెలుసు నువ్వు పోయి అంకుల్ కండిషన్ మీ కంమాండర్‌తో చెప్పి సమాధానం తీసుకురావచ్చు. నువ్వు కిల్లర్స్ గాంగ్ తరపున వచ్చినట్లు ఒప్పుకున్నావ్ గనుక, అంకుల్ దగ్గిరికి తీసుకుపోవటానికి నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు" చిన్నగా నవ్వుతూ అన్నది స్త్రీ కంఠం.

ఆమె చాతుర్యానికి మెచ్చుకుంటూ తల పక్కకు తిప్పాడా యువకుడు. మరుక్షణం పిషింగ్ లైన్ నీటిలో నుంచి లాగి, రెండు క్షణాలలో చుట్ట చుట్టి రాడ్‌కి

తగిలించాడు. ట్రాన్సిస్టర్‌ని చిన్న సంచిలో వేసుకుని వీపుకు వేలాడు తీసుకున్నాడు. ఒకసారి వెనుతిరిగి చూచి పొదలకు అడ్డంపడి పరుగుతీయటం ప్రారంభించాడు.

రివ్వుమంటూ అతని తల మీది నుంచి దూసుకుపోయింది బేస్ బాల్ సైజులో వున్న పలుకురాయి! దాని వెనుకే మరొకటి వచ్చి అతని వీపుకు బలంగా తగిలింది.

ఆ దెబ్బకు బొక్క బోర్లా పడిపోయాడు యువకుడు. వెనుకనుంచి కేకలు వినిపించసాగాయి. తనను గమనించిన వారు సహాయం వెంట తెచ్చుకున్నారని గ్రహించి ఓపిక తెచ్చుకొని లేచి నిబడ్డాడు యువకుడు. రాయి తలిగిన చోట కండ వాచిపోయి కదిలితే విపరీతమైన పోటుపెట్టటం ప్రారంభించింది.

అయినా లెక్క చేయకుండా ముందుకు పరుగు తీశాడు. వెనుక వస్తున్న అరుపులనుబట్టి వారు తనని సమీపిస్తున్నారని గ్రహించి మరింత వేగం హెచ్చించాడు.

ఎదురుగా చిన్న రాళ్ళగుట్ట ప్రత్యక్షమయింది. అక్కడి నుంచి పక్కలకు పోవటానికి వీలులేదు. వెనుతిరగటానికి అంతకంటే అవకాశంలేదు. రాళ్ళగుట్ట ఎక్కి అవలివైపు తొంగి చూచాడు. నిట్టనిలువుగా ఇరవై అడుగుల లోతున వున్నది నేల నల్లగా పచ్చగా.... మురికింపు కొడుతున్న బురదగుంట రూపంలో వున్నది.

మరొక్కసారి వెనుతిరిగి చూశాడతను. అనుసరిస్తున్న వ్యక్తులు.... అంత తేలికగా వదిలేటట్లు నింపించలేదు. అతను ఆగటం చూసి, మరింత వేగంగా వస్తున్నారు.

విధిలేక గాలిలోకి ఎగిరి పల్టీకొట్టాడు. గుండ్రంగా తిరుగుతూ పోయి 'ధనేల్' మంటూ బురదలో పడిపోయాడు వెంటనే కదలకుండా కాళ్ళు చేతులను లూజ్ గా వుంచి అలాగే పరుండి పోయాడు.

మురికి వాసనలను వెదజల్లుతూ అతన్ని తన లోపలికి లాగుకోసాగింది బురదగుంటలాగా కన్పిస్తున్న 'ఊబి'.

★ ★ ★

"గఫూర్! నువ్వు అటునుంచి పోయి, వాడి అంతుచూడు" అరిచాడు వెల్బీ.

"అవసరం లేదు మిస్టర్ వెల్బీ.... అతను ప్రాణాలతో బయటపడటమంటూ జరగదు. నాకు తెలిసినంతవరకూ యీ ఊబిలోనుంచి తప్పించుకున్నా వారెవరూ లేరు" కామ్‌గా అన్నది ఎమిలీ.

అందుకు చిన్నగా గొణిగాడు వెల్బీ. గఫూర్ వంక చూచి సొమ్మని సైగ చేశాడు. "గఫూర్! నీ చేతిలో వున్న రాయి అందులోకి విసిరిచూడు. ఏమౌతుందో తెలుస్తుంది" వారి సందేహాన్ని గమనించి అన్నది ఎమిలీ.

చేతిలో వున్న రాతిని బలంగా ఊబిలోకి విసిరాడు గఫూర్. అది పోయి కింద వున్న యువకుడి ముఖానికి రెండు అంగుళాల దూరంలో పడింది దాని అదటుకు బురద లేచి యువకుడి ముఖంనిండా పడింది.

వారు చూస్తూ వుండగానే నెమ్మదిగా లోపలికి దిగి మాయమైపోంది రాయి. "చూశారా? యిక మనం అనవసరమైన శ్రమ పడటం ఎందుకు? వాడు ఎవడో కాని తన ప్రాణాలు తనే తీసుకున్నాడు."

ఎమిలీ మాటలకు అంగీకార సూచకంగా తలవూపాడు వెల్బీ. అతను తమ మాటలు విన్నందుకు మంచి శిక్షే అనుభవిస్తున్నాడు! యింకా అతనిలాంటివారు ఎవరైనా వున్నారేమో చూడమని గఫూర్‌ని పంపించి ఎమిలీతో భవంతి వైపు బయలుదేరాడు.

★ ★ ★

గఫూర్ విసిరిన రాయి తలమీద పడకుండా, ఆఖరిక్షణంలో తల కొంచెం పక్కకు జరిపి ప్రాణాపాయకరమైన దెబ్బనుంచి తప్పించుకున్నాడా యువకుడు — ముఖేష్. వెల్బీ ఎమిలీల మధ్య జరుగుతున్న సంభాషణ అతనికి స్పష్టంగా విన్పిస్తూనే వున్నది. వారికి తనముఖం కన్పించకుండా బురదలో ముంచి జాగ్రత్తపడ్డాడు. అంతకుముందు కొంతకాలం క్రింద డాక్టర్ వెల్బీతోనూ అతని అనుచరుడు గఫూర్‌తోనూ ముఖాముఖిన పోరాటం[1] జరిగి వుండటమే అందుకు కారణం. తన్ను సి.ఐ.బి. ఏజెంట్ అని గుర్తుపట్టిన మరుక్షణం కిందికి వచ్చి, చంపి, ప్రాణాలు పోయాయని నిశ్చయంగా తెలిస్తేగాని ఆ ప్రదేశం వదలని తెలిసి ఆ పని చేశాడు.

ఊబి తనపని తాను చేసుకుపోతూనే వున్నది. ఉండిచుట్టుకుని ఒకేచోట పడివున్నట్లయితే వెంటనే లోపలికి వెళ్ళిపోయివుండేవాడు. అలా కాకుండా ఫ్లాట్‌గా కాళ్ళూ చేతులూ బారచాపి పడటంవల్ల నెమ్మదిగా కిందికి దిగిపోసాగాడు.

---

[1] ముఖేష్, షాడో, బిందు, శ్రీకర్, వాసు, పాల్గొన్న ఎడ్వెంచర్ 'గ్రైనేడ్ గ్రూప్' చదవండి.

వెల్బీ, ఎమిలీలు వెళ్ళిపోగానే తలఎత్తి చుట్టూచూశాడు ఎటుచూసినా పది పన్నెండు అడుగుల దూరంలో వున్నది నేల.

ముక్కుల్లోకి పోయిన బురదను గట్టిగా చీది బయటకు తోస్తూ మరొక్కసారి పరిసరాలను పరికించాడు ముఖేష్. అంత దూరం ప్రయాణించ వీలౌతుందా? ఏ మాత్రం కదిలినా వేగంగా లోపలికి లాగుకుంటుంది ఊబి. కుడి వైపున ఆరడుగుల దూరంలో పది అడుగుల ఎత్తున్న కొండరాయి నిలబడివుంది. దానిచుట్టూ ఊబి పరుచుకొని వుంది ఎక్కడానికి వీలులేకుండా, నున్నగా, నిటూరుగా వున్నదది!

ఆ రాతిని చేరుకోవటం తప్ప మరొక మార్గంతరం లేదని గ్రహించి పళ్ళ బిగువున ముందుకు జరగసాగాడు. కదిలిన మరుక్షణం నడుము సగంవరకూ ఊబిలోకి దిగబడి పోయింది.

ఇక ఆలసించి లాభంలేదని చేతిలో బిగించి పట్టుకొని వున్న ఫిషింగ్ రాడ్‌ని పైకి ఎత్తి విదిలించాడు. చుట్టలు చుట్టలుగా దానికి చుట్టిన ఫిషింగ్ లైన్ వదులై కిందికి జారింది. పళ్ళు బిగించి, వంట్లో వున్న శక్తి నంతా చేతిలో కేంద్రీకరించి ఫిషింగ్ రాడ్‌ని గాలిలో విదిలించాడు. ఆ వేగానికి పోయి రాతిచుట్టూ పడి చిక్కుపడింది ఫిషింగ్ లైన్. సన్నటి నైలాన్ దారంతో పేనబడింది కావటంవల్ల ఎంత బరువైనా మోయగల శక్తి కలిగి వుందది.

వెంటనే రాడ్‌ని వదిలి ఫిషింగ్ లైన్‌ని చేరుకోవటం ప్రారంభించాడు ముఖేష్. రాతికి చుట్టుకున్న దారం బిగుసుకునేసరికి గడ్డంవరకూ లోపలికి దిగజారిపోయాడు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా దారాన్ని పట్టుకొని ముందుకి జరగసాగాడు. దారం కత్తిలాగా అతని వేళ్ళను గాట్లు పెట్టసాగింది.

తనలోనికి ప్రవేశించిన అవయవాలను వదిలిపెట్టడానికి నిరాకరిస్తూ బిగించి పట్టుకోసాగింది ఊబి.

క్షణ క్షణానికి బలహీనుడై పోసాగాడు. ఆగి విశ్రాంతి తీసుకొని ముందుకు పోవటమనేది కుదరని పని. ఆగిన మరుక్షణం పూర్తిగా లోపలికి దిగిపోతాడు. అతని కదలికతో బురద అంతా కదిలి– వామిటింగ్ వచ్చేటంత దుర్వాసన వేయసాగింది.

అలాగే ఓపిక పట్టి తంటాలుపడ సాగాడు. ఆరు అడుగుల దూరం ఆరుమైళ్ళు అనిపించింది. షుమారు అరగంటపాటు విపరీతమైన ప్రయత్నంచేసి – రాతిని చేరుకో గలిగాడు.

అక్కడి నుంచి మరొకసమస్య ఎదురైంది. రాతిమీదికి ఎక్కితే తప్ప అక్కడినుంచి బయటపడే మార్గం లేదు. రాతికి నేలకూ మరో ఆరడుగుల దూరం వుంది.

చెమటలు పట్టిన ముఖాన్ని బుజానికి రుద్దుకున్నాడు. మరింత బురద ముఖం మీదికి ఎక్కింది. పిడచ కట్టుకు పోయిన నాలుకను అలాగే నోటితోనే కదిలించుకుంటూ రాతిని అధిరోహించే ప్రయత్నం చేయసాగాడు. బురదతో తడి అపటంవల్ల ఫిషింగ్ లైన్ కూడా చేతిలోనుంచి జారి పోవటం ప్రారంభించింది. అందుకని దాన్ని చేతికి మెలికలు చుట్టుకొని మౌంటెన్స్ ఎక్కే పద్ధతిలో బలమంతా 'లైన్' మీద మోపి రాతిమీద అడుగులు వేయసాగాడు. పదునైన కత్తితో కోసినట్లు చేతులు కోసుకుపోయాయి. వెచ్చటిరక్తం ముంజేతులమీది నుంచి కారి షర్టుమీదికి

రాసాగింది. అయినా లెక్కచేయకుండా కళ్ళు మూసుకొని పైకి పోయాడు. ఆఖరి అడుగువేసి రాతిమీద బోర్లా పడిపోయాడు.

అలసిపోయిన ముఖేష్ శరీరం అలాగే సొమ్మసిల్లి పోయింది.

★ ★ ★

"ఊబిలో పడ్డావా? అసలు అటువంటి ప్రదేశాలకు పోవద్దని ఎన్నిసార్లు చెప్పాను? యింకా నయం బ్రతికి బయటపడ్డావ్. ఆ బట్టలు విప్పి అవతల పడవేయి. బాత్‌రూమ్‌లో హాట్ వాటర్ వుంది. ఆ బురద వదుల్చుకొనిగాని మళ్ళీ లోపలికి రాకు"

ముఖేష్ అవతారం చూసి చిన్న సైజు డాన్స్ చేసింది అతను వుంటున్న ఎపార్ట్‌మెంట్ యజమానురాలు.

ఆమెకు హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలిపి బాత్‌రూమ్‌లో దూరాడు ముఖేష్. బేతింగ్ టబ్‌లో పడుకోని, చేతికి వున్న వాచీని ఊడదీసి కీరాడ్ పక్కకు లాగాడు వెంటనే 'బీప్ బీప్' మని శబ్దం వచ్చింది. రెండు క్షణాల తరువాత మృదువైన స్వర మొకటి పలికింది.

"హల్లో! ఆల్మోరా స్పెషల్ ఫోర్స్ హియర్. వాట్ కెన్ వుయ్ డూ ఫర్ యూ?" ప్రయత్నంగా వీపుమీద తగిలిన దెబ్బ గుర్తువచ్చి చిన్నగా నిట్టూర్చాడు ముఖేష్ దేశం కాని దేశంలో సేవలు చేసేవారు ఏవరున్నారు గనుక?

"హల్లో స్వీట్ డ్రాగన్ నెంబర్ టూ హియర్. వళ్ళంతా విరగగొట్టించుకొని యిప్పుడే గూటికి చేరాను. ఐ వాంట్ ఒన్ ఆర్ టూ థింగ్. మాటలతో వాళ్ళు మారేటట్లు కనిపించటం లేదు" అన్నాడు.

"యస్ మిస్టర్ ముఖేష్! మీరు ఏం కావాలన్నా సప్లయ్ చేయమని ఆర్డర్లు వచ్చాయి. ఇక మీరు అడగటమే ఆలస్యం"

"ఏమడిగినా సప్లయ్ చేస్తారా?"

"అడిగి చూడరాదూ – తెలుస్తుంది"

"ఆల్‌రైట్, ఆల్‌రైట్ ....... నేనే ఓడిపోయాను" అంటూ తనకు కావల్సిన వస్తువుల లిస్టు చెప్పాడు ముఖేష్.

"ఇవన్నీ ఎంత త్వరగా పంపగలిగితే అంత మంచిది. మావాళ్ళ దగ్గిరనుంచి మెస్సేజెస్ ఏమయినా వచ్చాయా?" అన్నాడు.

"యస్ మిస్టర్ ముఖేష్. ఇందాకా యీగెల్ దగ్గిర నుంచి ఒక రిపోర్టు వచ్చింది. డ్రాగన్ నెంబర్ వన్ గ్రీన్‌లాండ్ బయలుదేరిందిట. మీ వాళ్ళు కాగితాలను ఎనలైజ్ చేస్తున్నారు. యిట్ సీమ్స్ దేరీజ్ ఎ లాటాఫ్ ఇంప్రూవ్‌మెంట్" సమాధాన మిచ్చిందా మృదుమధుర స్వరం.

"ఆఁ ఆఁ వాళ్ళు వాటితో కుస్తీ పడుతూనే వుంటాడు. వారికన్నా ముందు మా మిషన్ కంప్లీట్ చేసుకొని వెళ్ళిపోతాం చూస్తూండు. థేంక్యూ వెరీమచ్ బేబీ.... అంతా అయిపోయిన తర్వాత ఏదైనా డాన్స్ ప్రోగ్రాంకు పోదాం వస్తావా ?"

"అడిగి చూడరాదూ? వస్తానో రానో తెలుస్తుంది"

'మైగాడ్..... యిదేదో భద్రకాళిలా వుందే?' అనుకుంటూ సర్క్యూట్ క్లోజ్ చేశాడు ముఖేష్.

★ ★ ★

గ్రీన్ కలర్ టాప్ వున్న టాక్సీలోనుంచి ముగ్గురు వ్యక్తులు మిస్టర్ క్లీ భవంతి ముందు దిగి నిలబడ్డారు.

"మా భవనం ఎలా వుంది మిస్టర్ వెల్బీ?" అతని ఆలోచనలను పసికట్టడానికి ప్రయత్నిస్తూ అడిగింది ఎమిలీ.

"ఇది భవంతి అనటంకంటే చిన్న ఫోర్టు... కోటలా వున్నదంటే బాగుంటుంది" ఫ్రాంక్‌గా సమాధానమిచ్చాడు వెల్బీ.

వారి ముందున్న ఐరన్ గేట్ తెరుచుకుంది. తెల్లటి బట్టలు వేసుకున్న సేవకుడు ఎదురువచ్చి వారికి దారి చూపిస్తూ లోపలికి తీసుకుపోయాడు.

"ఈ ప్రాంతంలో మకుటంలేని మహారాజు మా అంకుల్. మరి ఆ అంతస్థుకు తగినట్లే భవంతి వుండాలని యీ పాత భవనాన్ని కొని రీ–మోడల్ చేయించారు" విశాలమైన హాలులోకి అడుగుపెడుతూ అన్నది ఎమిలీ.

ఖరీదైన ఫర్నీచర్‌తో అందగా అలకరించబడి వుందా హాలు. గోడమీద క్లీ పూర్వీకుల వర్ణచిత్రాలు వరుసగా తగిలించి వున్నాయి. హాలుమధ్యగా నల్లటి టేక్‌వుడ్‌తో చేయబడిన పెద్ద టేబిల్ వుంది. దాని చుట్టూ నగిషీలు చెక్కబడిన కుర్చీలు వేయబడి వున్నాయి.

టేబిల్ చివర పెద్ద చైర్లో కూర్చుని వున్నాడు క్లీ. తెల్లగా నెరిపిన తల, మీసాలు ఠీవిగా. మహారాజులాగానే వున్నాడు. అతని పక్కకు పోయి నిలబడింది ఎమిలీ.

"అంకుల్ నీతో చెప్పాను చూడు – డాక్టర్ వెల్బీ..... అతనే....." అంటూ పరిచయం చేసింది

ఖంగుమంటున్న గొంతుతో అతిధులను ఆహ్వానించాడు క్లీ.

"మిస్టర్ వెల్బీ! యస్ నిన్ను గురించి చాలా విన్నాను. సంవత్సరం క్రితం న్యూయార్క్‌లో చంపబడిన వాడివి ప్రాణలతో ఎలా రాగలిగావ్?" అని అడిగాడు.

అందుకు తగిన సమాధానం కోసం తడుముకోసాగాడు వెల్బీ.

"అనవసరంగా శ్రమపడకు వెల్బీ! నిన్ను కిల్లర్స్ రక్షించిందని నాకు తెలుసు. నువ్వు వారి తరుపున ఇక్కడకు వచ్చావని కూడా తెలుసు."

"అని నేను అనలేదు. కిల్లర్స్ గాంగ్‌కి – నాకూ సంబంధం లేదు" ప్రోటెస్ట్ చేశాడు వెల్బీ.

"అలా అంటే లాభంలేదు. మైడియర్ వెల్బీ. డాక్టర్ వెల్బీ కిల్లర్స్ గాంగ్ మెంబర్. అది వప్పుకోకపోతే ఆ వేషంలో వచ్చిన మోసగాడి వన్నమాట. ఏమంటావ్" కనుబొమ్మల మధ్యనుంచి చూశాడు క్లీ.

మెరుపులా కోటునుంచి రివాల్వర్ తీసి అతనికి పెట్టాడు వెల్బీ. గఫూర్ కూడా మరొక రివాల్వర్ ఎమిలివైపు చూపించాడు.

"నీకు చేరిన ఇన్‌ఫర్‌మేషన్ కరెక్ట్ మిస్టర్ క్లీ. నా సంగతి తెలిసినంత మాత్రాన నన్ను బెదిరిద్దామనుకోవటం వెర్రితనం" అన్నాడు వెల్బీ.

"ఇందులో బెదిరింపుల ప్రసక్తే లేదు వెల్బీ! ఫాక్ట్స్ చెప్పాను అంతే! యిక నీ రివాల్వర్ చూపించి నన్ను అదరగొట్టాలని ప్రయత్నించక. ఇటువంటి పనులు జరగకుండా నా పూర్వీకులు నన్ను జాగ్రత్తగా చూస్తూ వుంటారు. కావాలంటే చూడు" నవ్వుతూ అన్నాడు క్లీ.

కను చివరలనుంచి తైలవర్ణ చిత్రపటాలవంక చూసి అదిరిపడ్డాడు వెల్బీ. గోడలమీద పటాలు వుండవలసిన స్థానంలో పెద్ద పెద్ద రంధ్రాలు ఉన్నాయి. వాటిలోనుంచి బయటకు వచ్చి అతని వైపే చూస్తున్నాయి మిషన్ గన్స్.

"ఈ ప్రాంతాల్లో రాజులాంటి వాడిని. అందుకు తగిన హంగులన్నీ నాకున్నాయి. నీ గురించి అన్ని వివరాలు తెలుసుకున్నాను. ఆయామ్ శాటిస్ఫైడ్. ఆ రివాల్వర్లను అవతల పడేస్తే, మీరు వచ్చిన విషయాలు మాట్లాడుకోవచ్చు!" అన్నాడు క్లీ.

మిషన్ గన్స్ వంకే చూస్తూ భుజాలు ఎగురవేశాడు వెల్బీ. తనను మించినవాడు క్లీ అని తెలిసిపోయింది. ఇక అతన్ని ఎదిరించి ప్రయోజనం లేదనుకుంటూ రివాల్వర్‌ని కోటులో దాచుకున్నాడు. మాస్టర్ని అనుసరించాడు గఫూర్.

"నౌ జంటిల్మన్! యీ శుభ సందర్భంలో డ్రింక్స్ పుచ్చుకొని మన బిజినెస్ మొదలుపెడదాం" అంటూ పక్కనేవున్న టీపాయ్ మీద వున్న బ్రాందీబాటిల్ అందుకున్నాడు క్లీ. ఎమిలీ గ్లాసులు అమర్చింది. ఒక సర్వెంట్ వచ్చి బాటిల్ లోవున్న బ్రాందీని ఆ గ్లాసులోకి వంపసాగాడు.

ఏదో జ్ఞాపకం వచ్చినట్లు జేబులు తడుముకుని ఒక విజిటింగ్ కార్డ్ బయటకు తీశాడు క్లీ.

"టేక్ దిస్ మైడియర్ వెల్బీ! ఇటువంటి కార్డులు క్లోజ్ ఆస్సోసియేట్స్ దగ్గిరే వుంటాయి. ఐయామ్ గివింగ్ యూ దట్ ఆనర్" అన్నాడు

అదేమిటో అర్థం కాకపోయినా, చేయి చాచి అందుకోని జేబులో పెట్టుకున్నాడు వెల్బీ.

గోడమీద గడియారం ఒకటొకటిగా ఆరు గంటలు కొట్టింది.

"జెన్నీ యీపాటికి రావాల్సింది, ఎందుకని రాలేదో" అన్నది ఎమిలీ, క్లాక్ వంక చూస్తూ. "మరేం ఫరవాలేదు జెన్నీకి ఆన్నీ తెలుసు. షీ యీజ్ ఎ రిలయబుల్ గర్ల్" గ్లాసులోని బ్రాందీని సిప్ చేస్తూ అన్నాడు క్లీ.

వెంటనే మాట కలిపాడు వెల్బీ.

"ఏమయినా మీరు కాన్ఫరెన్స్‌లో ఆ ఫార్ములాలు చూపించటం ఏం బాగులేదు మిస్టర్ క్లీ! వాటి సంగతి అందరికీ తెలిసిపోతే చాలా గడ్డు సమస్యలను ఎదురుర్కోవాల్సి వస్తుంది" అన్నాడు.

"మిస్టర్ వెల్బీ! ఇంతవరకూ మీకు కొంచెం తెలివితేటలున్నాయనుకున్నాను. కాని ఇంత డల్ హెడ్ అనుకోలేదు." అని గొంతు సవరించుకున్నాడు క్లీ.

"ఫార్ములాలు తయారు చేశానని ఆ కాగితాలు తెలియచేస్తాయి గాని.......... ఆ ఫార్ములాలు ఎందుకోసమో, ఎలా తయారుచేయటమో ఎవరికీ తెలియదు. జస్ట్..... నా ప్రతిచూపింది అందరినీ సస్పెన్స్‌లో పెట్టటానికి అలా చేశాను."

"మైడియర్ వెల్బీ! ఒక్కమాట గుర్తుంచుకో. కిల్లర్స్ గాంగ్‌తో చేరినా చేరకపోయినా నేను చేసిన పనులను గూర్చి ప్రశ్నించే అధికారం ఎవరికీలేదు. నా ఫార్ములాతో యీ ప్రపంచాన్నే సర్వనాశనం చేయగల శక్తి సంపాదించాను. ఆ

పని చేయటంలో కిల్లర్స్ గ్యాంగ్ నాకు తోడుగా వుంటే బాగుంటుందని, నీకు ఇంటర్వ్యూ ఇచ్చాను. మీతో చేరకపోయినా నా స్వశక్తితో ఒంటరిగా అనుకున్న పథకాలను ఆచరణలో పెట్టగల సామర్థ్యం నాకుంది. ఈ మాట మీ సుప్రీమ్ కమాండ్‌కు చేరవేయి.

నాకు సుప్రీమ్ కమాండ్‌లో స్థానం యిస్తే సరేసరి. లేకపోతే ఈ ప్రపంచంతోపాటు మిమ్మల్ని కూడా సర్వనాశనం చేస్తాను."

పిడికిళ్ళు బిగించి బల్ల గుద్దాడు క్లీ. అతని ఆవేశంచూచి అదిరిపోయారు వెల్బీ, గఫూర్‌లు.

అదే సమయంలో గేటు దగ్గిర వున్న వాచ్‌మన్ లోపలికి వచ్చి వినయంగా నమస్కరించి నిలబడ్డాడు.

"సర్... ఎయిర్‌పోర్టు వేన్‌లో జెన్నీ వస్తున్నది. ఆమె పక్క మరొక యువకుడు ఉన్నాడు" అని రిపోర్టు చేశాడు.

ఆ మాటలు వినగానే క్లీ ముఖంలోని ఆవేశచ్ఛాయలు మాయమైపోయాయి. వాటి స్థానంలో చిరునవ్వు ప్రత్యక్షమయింది.

"అందమైన ఆడపిల్లలు ఇంట్లో వుంటే వచ్చే బాధ యిదే మిస్టర్ వెల్బీ! ఇరవై నాలుగు గంటలూ ఎవరో ఒకరు వారిచుట్టూ తిరుగుతూనే వుంటారు. లండన్ నుంచి ఎవరినో వెంటపెట్టుకుని వస్తున్నట్లుంది జెన్నీ ఇట్స్ ఆల్‌రైట్. మంచిపని చేసింది. అతనివల్ల మంచిపని ఒకటి జరుగబోతోంది. సమయానికి వచ్చాడు" అని వారిని సాదరంగా లోనికి పంపించమని ఆజ్ఞలు జారీ చేశాడు. అతని సైగ అందుకొని బేస్‌మెంట్‌లో వున్న లేబొరేటరీ లోంచి ఒక బ్రాందీ బాటిల్

పట్టుకొని వచ్చింది ఎమిలీ. దాన్ని టేబిల్ మీద వుంచే జెన్నీ రాకకోసం ఎదురు చూసాగాడు మిస్టర్ క్లీ.

★ ★ ★

"తనకోసం ఎవరొచ్చినా ఫ్యాక్టరీలోనే కలుసుకోవటం అంకుల్ అలవాటు రాజూ! నిన్ను యిలా ఇంటికే తీసుకుపోతున్నాను. ఏమంటాడో తెలియదు నువ్వు చెపుతున్న విషయాలు వింటే ఇంకేయింటాడో అంతకన్నా తెలియదు. " భవనాన్ని సమీపిస్తున్న కొద్దీ తను చేసిన పనులను క్లీ ఏమంటాడో భయపడసాగింది జెన్నీ.

మౌనంగా ఆ మాటలు వింటూ తనలో తను నవ్వుకున్నాడు షాడో. అంత జరిగినా తనమీద కిల్లర్స్ గాంగ్ దౌర్జన్యం చేసిందని నమ్మటానికి వెనుకాడుతున్నది జెన్నీ. విమానంలో వారితోపాటు ప్రయాణించిన ఏజెంట్లు తనమీద కానీ, షాడో మీద కాని ఎటువంటి దౌర్జన్యం చేయకపోవడంతో ఆ అపనమ్మకం మరింత బలపడింది. ఎటు తిరిగీ డాక్టర్ స్టీఫెన్స్ తన కళ్ళ ముందే హత్య చేయబడి ఒక్కటే షాడో మాటలను నమ్మేటట్లు చేస్తున్నది.

విమానంలో తమతోపాటు ప్రయాణించిన ఏజెంట్లు తనమీద దురపచారమూ జరపక పోవటానికి గల కారణాన్ని ఆమెకు చెప్పలేదు షాడో. అవసరం లేకపోయినా ముందు జాగ్రత్త కోసం ఆ పని చేయక తప్పింది కాదు.

షాడో గజదొంగగా[2] తిరిగే రోజుల్లో ఎటవంటి తాళాన్నయినా క్షణంలో ఓపెన్ చేయటంలో సిద్ధహస్తుడైనాడు. అదే విద్య ప్లేన్స్‌లో వుండే సీట్ బెల్ట్స్ మీద ప్రయోగించటం జరిగింది.

---

[2] షాడో జీవిత చరిత్ర మధుబాబు రచన "వాన్‌టెడ్ డెడ్ ఆర్ ఎలైవ్" లో వివరించబడింది.

విమానం గాలిలోకి లేచే సమయంలోనూ, గ్రౌండ్స్ మీదికి వాలే సమయంలోనూ ప్రయాణికులు ఆ బెల్టులను వాడతారు. ఆ మధ్యలో వాటి అవసరమే వుండదు. తన శతృవులు సీట్లో లేని సమయం చూసి ఆ బెల్టులకున్న లాక్‌లలో చిన్న ఎడ్జస్ట్‌మెంట్ చేశాడు షాడో. ఫలితంగా విమానంలోని ప్రయాణికులందరూ దిగిపోయినా తమ సీట్ బెల్టులు వూడిరాక అలాగే కూర్చుండిపోయారా ఏజెంట్లు యిద్దరూ.

షాడో జెన్నీలు ఎటువంటి ఆటంకాలు లేకుండా బయలుదేరటానికి అది ఎంతగానో వుపయోగించింది. కాని కిల్లర్స్ గాంగ్ వారు దుష్టులు అన్న నమ్మకాన్ని జెన్నీ మనసులో నుంచి తుడిచివేయడానికి కూడా సహకరించింది.

ఎయిర్‌పోర్టు వేన్ గేట్‌ని సమీపించగానే గేటు తెరచి వారిని పలికి ఆహ్వానించాడు వాచ్‌మెన్. వెంటపెట్టుకొని హాల్లోకి తీసుకుపోయాడు.

"అంకుల్ ! దిసీజ్ షాడో..... డాక్టర్ షాడో, రాజూ హీ ఈజ్ మై అంకుల్ క్లీ!" అంటూ పరిచయం చేసింది జెన్నీ.

కను చివరలనుండి టేబిల్ ముందు కూర్చున్న వెల్బీని చూస్తూ క్లీతో కరచాలనం చేశాడు షాడో.

"మిమ్మల్ని కలుసుకోవటం చాలా ఆనందదాయకమైన విషయం మిస్టర్ క్లీ. మీ గురించి మీ బ్రీవరీస్ గురించీ చాలా విన్నాను" చిరునవ్వుతో అన్నాడు.

"టేక్ యువర్ సీట్ మైడియర్ యంగ్ మాన్! జెన్నీ నిన్ను లైక్ చేసిందంటే నీలో ఏదో విశేషమున్నట్లే లెక్క. నాతో ఏమైనా పని వుందా?" అడిగాడు క్లీ.

"అంకుల్! ఇతను కాన్ఫరెన్స్‌లో కలిశాడు. ఫార్ములా మీద చాలా యింట్రస్టు చూపించాడు. అదీగాక అదేదో గాంగ్‌ట. దాన్ని గురించి....." అని మాట మధ్యలో ఠక్కున ఆపేసింది జెన్నీ.

హాలులో వున్న ఎట్మాస్ఫియర్ ఒక్కసారిగా చూసిపోయింది. క్లీ పిడికిళ్ళు బిగించి నిటారుగా కూర్చున్నాడు కుర్చీలో. డాక్టర్ వెల్బీ, గఫూర్ బొమ్మల్లా బిగుసుకుపోయారు. టైట్‌గా చుట్టబడిన వాచ్ స్ప్రింగ్‌లా నిలబడ్డాడు షాడో.

ఒక్క రాంగ్ మూవ్..... రాంగ్ కదలిక! ఆ హాలువంకా హెల్ కింద మార్చివేస్తుంది! అటువంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని వూహించలేదు షాడో. వెల్బీని అలా ముఖాముఖిన కలుసుకుంటానని కూడా తలంచలేదు వారందర్నీ చూసి, వారి చేతలు అర్థంగాక మౌనంగా నిలబడిపోయింది జెన్నీ. రెండు నిముషాల తర్వాత తనను తాను కంట్రోల్ చేసుకున్నాడు క్లీ.

"టేక్ యువర్ సీట్ మిస్టర్ షాడో! నీ పేరు చాలా గమ్మత్తుగా వుంది. ఎక్కడో విన్నట్లే వుంది. ఎనీవే నా యింటికి వచ్చినందుకు తగిన మర్యాదలు చేయటం నా విధ్యుక్త ధర్మం. ఇదిగో టేబిల్ మీద క్లీ బ్రాండ్ బ్రాందీ – స్పెషల్ క్వాలిటీ బాటిల్ వుంది. హేవ్ ఎ డ్రింక్ " అంటూ ఆఫర్ చేశాడు.

చిరునవ్వుతో బాటిల్ ఓపెన్ చేసి ఒక గ్లాసునిండా నింపుకొని రెండు గుటకలు వేశాడు షాడో. అంతకుముందు అతను టేస్టు చేసిన బ్రాందీలన్నిటికన్నా టేస్టుగా వున్నదా బ్రాందీ. రియల్లీ వండర్‌ఫుల్ డ్రింక్ ! అదే మాట క్లీతో కూడా అన్నాడు.

"ఐ యామ్ గ్లాడ్ యూ లైకిట్" అంటూ అక్కడ వున్న వారందర్నీ పరిచయం చేశాడు క్లీ. "మిస్టర్ షాడో! ఈమె ఎమిలీ, దిసీజ్ డాక్టర్ వెల్బీ అతను గఫూర్ అని వెల్బీ ఫ్రండ్" అని జేబులోంచి తన విజిటింగ్ కార్డు తీసి అతనికి ఇస్తూ, అంతకు ముందు వెల్బీతో అన్న మాటలనే రిపీట్ చేశాడు.

షాడోలో ఒక వింత అనుభూతి మొదలైంది. ప్రపంచంలో తనకన్నా బలవంతులు లేరన్న భావం క్రమంగా అతడి మెదడును ఆక్రరమించసాగింది. మొదట వెల్బీని చూసి కంగారు పడినందుకు సిగ్గుపడ్డాడు. ఆఫ్టరాల్ వెల్బీ ఎంత వాడి బ్రతుకెంత, వాడేమిటి కిల్లర్స్ గాంగ్ అంతా కట్ట కట్టుకు వచ్చినా మట్టు పెట్టగల దమ్ము నాకుంది అనుకోసాగాడు.

"మిస్టర్ షాడో! ఆర్ యు ఎ బ్రేవ్ మాన్" ఉన్నట్లుండి అన్నాడు క్లీ. అతని మాటలకు పకపకా నవ్వుదామన్ని కోరికను బలవంతంగా అణుచుకొని పెదవి విరిచాడు షాడో. లోపలు క్లీని పట్టుకొని నేలకేసి బాదుదామన్నంత కోపంతో మండిపోతున్నాడు."ఈ గదిలో వున్నవారందరూ నీపై రివాల్వర్లు గరిపెట్టి నిలబడితే ఏం చేస్తావు షాడో?" రెట్టించి అడిగాడు క్లీ.

ఇక తన భావాలను దాచుకోలేకపోయాడు షాడో. గది అదిరిపోయేటట్లు వికటంగా నవ్వాడు – "క్లీ.... నన్ను భయపెట్టాలని చూడకు. మీరే కాదు. మీలాంటి వాళ్ళు వెయ్యిమంది వచ్చినా యీ షాడో నిలబడిన చోటును కూడా స్పృశించలేరు" అన్నాడు.

వెల్బీ, గఫూర్ యిద్దరూ తమ రివాల్వర్ల మీద చేతులు వేశారు. మరుక్షణం వారిమీదికి దూకటానికి సిద్ధపడ్డాడు షాడో.

అతని మెదడులో ఎక్కడో ఒక మూలనుంచి"జాగ్రత్త జాగ్రత్త" అని హెచ్చరించసాగింది వివేకం. అయినా ఆ వార్నింగ్ వినిపించుకునే స్థితిలో లేడతను. ప్రపంచమంతా కట్ట కట్టుకు వచ్చినా వట్టిచేతులతోనే ఎదిరించగల సామర్థ్యం తనకు వుందని అనుకుంటున్నాడు.

అతనిలో మార్పు గమనించి నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయింది జెన్నీ! ఆమెను చూసి చిరునవ్వులు చిందించాడు షాడో.

"జెన్నీ డియర్! నువ్వేం ఖంగారుపడకు. ఇటువంటి సిట్యుయేషన్స్ కన్నా ఇంకా భయంకరమైన చిక్కుల్లో నుంచే యీజీగా బయటపడిన రోజులున్నాయి. జస్ట్ అక్కడ కూర్చున్న పందికొక్కులను కొంచెం కదలమని చెప్పి........... ఏం జరుగుతుందో చూడు. ఒక్కొక్కళ్ళనూ ఊచకోత కోస్తాను. యస్... మిస్టర్ క్లీ... యిటువంటివారిని దగ్గరికి చేం నీయటం మంచిదికాదు. ఈ కిల్లర్స్ గాంగ్ నీ సహాయం పోంది నీ నెత్తిమీదే చేతులు పెడ్తుంది. డోంట్ వర్రీ..... యీ షాడో నీకు అండగా వున్నంత కాలం నీకేం భయంలేదు...... చిటికెన వేలితో వీరందర్నీ సమూలంగా నాశనం చేస్తాను. కమాన్ వెల్బీ... మనం కలిసి చాలా కాలమయింది కదూ? నా దెబ్బ మరికాస్త రుచి చూద్దువుగాని.... కమాన్..... కమాన్" అని అరవసాగాడు.

అతని మాటలు వినిపించుకోనట్లు వెల్బీవైపు తిరిగాడు క్లీ "డాక్టర్ వెల్బీ! నా మొదటి ఫార్ములా ప్రభావం చూశావా? రెండు గుక్కలు తాగగానే ఎక్కడలేని ధైర్యం వస్తుంది. జాగ్రత్త! మంచీ, చెడుల విచక్షణాజ్ఞానం పూర్తిగా నశిస్తుంది.

ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోగలననే పిచ్చి నమ్మకం ప్రబలిపోతుంది" అన్నాడు.

షాడో సంగతి పూర్తిగా తెలిసిన వెల్బీ అతనితో పూర్తిగా ఏకీభవించాడు. అవసరమైతే క్లీ తయారుచేసిన డ్రింక్ లేకుండానే అంత పిచ్చిగా ఎదురుతిరగగల మొండిసాహసం షాడోకుంది. ఇక ఆ డ్రింక్ ప్రభావం ఏముంది? మెల్లిగా తన అనుమానాన్ని వెల్లడించాడు. అందుకు సమాధానంగా ఎమిలీ వంక చూశాడు క్లీ.

టేబిల్స్ కున్న డ్రాయర్ లోనుంచి చిన్నపిస్టల్ తీసిషాడో కేసి గురిపెట్టింది ఎమిలీ గోడల మీద తైలవర్ణ చిత్రాలు ప్రక్కకు జరిగి మిషన్ గన్స్ బయటకి వచ్చాయి. వాటిని చూసి వికటంగా నవ్వాడు షాడో.

తనలాంటి ధీశాలి మీద ఈ అఘాయిత్యం తలపెడ్తారా తన సంగతి వీరికి తెలియదు అనుకున్నాడు మెరుపు మెరిసినట్లు కనుమూసి తెరిచేలోగా ముందుకు దూకాడు. ఎమిలీ చేతిలోని పిస్టల్ని ఎగరగొట్టి తన రివాల్వర్ తో అందరివైపు కవర్ చేయాలని అతని ఉద్దేశం.

మామూలు పరిస్థితుల్లో ఆ పని అనుకున్న దానికంటే ఒక్కక్షణం ముందుగానే అయిపోయి వుండేది. కాని క్లీ తయారుచేసిన డ్రింక్ ప్రభావం అక్కడనుంచే కొట్టవచ్చినట్లు కనుపించసాగిది.

మెదడు ఆలోచించినంత వేగంగా రియాక్టు కాలేకపోయాయి షాడో అవయవాలు. చేతులు ఇనుపముద్దల్లా బరువుగా లేచాయి. కాళ్ళు చేతులు నేలకు అతుక్కుపోయినట్లు అడుగు కదలటం లేదు.

అదే సమయమంలో క్లీ సైగను అందుకొని గఫూర్ షాడో మీదకి లంఘించాడు. తన అవయవాలు పని చేయటంలేదని గ్రహించిన షాడో ధైర్యం సడలలేదు. పెద్దగా అరుస్తూ గఫూర్ మీద కలియంబడటానికి ప్రయత్నించాడు.

ఫలితంగా అతని పిడికిటి పోట్లకు గురైనాడు. అంతవరకూ షాడో మీద దాచుకున్న కక్షనంతా ఆ పది క్షణాల లోనూ తీర్చుకున్నాడు గఫూర్. చిత్తుచిత్తుగా కొట్టి వదిలి పెట్టాడు.

"అంకుల్! అంకుల్!" అంటూ అడ్డుపడబోయిన జెస్నీని ఎమిలీ పక్కకు లాగి నిలబెట్టింది. రెండు నిముషాల తరువాత గఫూర్‌ని ఆగమన్నాడు క్లీ.

"చూశావా వెల్బీ! అదే నా ఫార్ములాలోని కిటుకు. తాగిన వెంటనే విపరీతమైన ధైర్యం వస్తుంది. అంత ధైర్యానికి కావాల్సిన పిజికల్ ఎబిలిటీ వుండదు. ఫలితం ఆలోచించుకో! యిలాగే వుంటుంది" అన్నాడు.

గఫూర్ దెబ్బలకు గింగుర్లు ఎత్తుతున్న తలను స్వాదీనపరచుకోవటానికి ప్రయత్నిస్తూ గోడకు అనుకుని నిలబడ్డాడు షాడో. క్రమంగా అతన్ని ఆవరిచిన డ్రింక్ ప్రభావం దిగజారి పోసాగింది.

"మిస్టర్ క్లీ! అతను షాడో అనే ఇండియన్ సి.ఐ.బి ఏజెంట్! వెరీ డేంజరస్ బగ్గర్! మనం వీడిని చంపి ఆవతల పారేయటం వుత్తమం. వాడికి తెలివి వచ్చిందంటే నీ డ్రింక్ అవసరం లేకుడానే మనల్ని సర్వనాశనం చేయగల సాహసం వస్తుంది" అంటున్నాడు వెల్బీ.

"వెల్బీ.... యిండియన్ సి.ఐ.బి.ని గురించి నేనూ విన్నాను. షాడో ఎటువంటి వాడో పూర్తిగా తెలియపోయినా కొంత తెలుసుకున్నాను. అయినా

యిది నా యిల్లు. నా దేశం. యిక్కడ రాజాధిరాజును నేను. ఎవరిని ఏం చేయాలో ఒకరు చెప్పవలసిన అవసరం లేదు. షాడో ఎంతటి వాడైనా మా బేస్‌మెంట్‌లో వున్న గదులలో బంధిస్తే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేడు... సో"

"అంకుల్..... అంకుల్ క్లీ... యిది అన్యాయం, రాజు అన్నట్లు వీళ్ళందరూ దుర్మార్గులే. వీళ్ళ మాటలు నమ్మి అతన్ని బంధించటం దారుణం..... " అంటూ క్లీ మాటలు ఆడ్డుపడింది జెన్నీ.

"వెల్బీ.... ఏమనుకోకుండా జెన్నీని తీసుకురాగలవా? యీమె పని అయిపోయింది. ఇక మన దారికి అడ్డంగా నిలవటం తప్ప..... యింకేమీ చేయలేదు..... కమాన్....." అని హాలు చివర వున్న ద్వారం వైపు దారితీశాడు క్లీ...

గఫూర్ చేతుల్లో నిస్సహాయుడై మత్తుగా తూలుతూ ముందుకు నడిచాడు షాడో. హాల్లో నుంచి అవతలకు రాగానే నేలమీద వున్న ట్రాప్‌డోర్ తెరచి బేస్‌మెంట్ లోనికి దారితీసాడు క్లీ.

అండర్‌గ్రౌండ్‌లో వరుసగా నాలుగు గదులు కట్టబడి వున్నాయి. వాటిముందు కాలిదారిలాగా సన్నపాటి దోవవుంది. అందులో నడిచి చివరి గదిముందు ఆగారు. ఓరగా తెరచివున్న తలుపులను కాలితో బార్లా తెరిచి వెల్బీ వైపు చూశాడు.

జెన్నీని అందులోకి నెట్టాడు వెల్బీ. షాడోను బలంగా గఫూర్ లోపలికి తోసి తలుపు మూశాడు.

★ ★ ★

గోడకు గుద్దుకోవటంతో తల దిమ్ము సగం వదిలి నేలమీద చతికిలబడ్డాడు షాడో. తలుపు తాళం వేసి అందరూ పైకి వెళ్ళి పోతున్నట్లు అలికిడి వినిపించి లేచి నిలబడ్డాడు. ఇంకా క్లీ బ్రాండ్ బ్రాందీ కొంచెం అతని మెదడును పట్టుకునే వున్నది. మూసి వున్న తలుపుల్ని విరగతన్ని, పోయి శత్రువులమ చీల్చి చెండాడమని హుషారు చేస్తున్నది మెదడులో ఒక భాగం. మరొక భాగం తెలివి తెచ్చుకోమని హెచ్చరిస్తోంది.

తల రెండు చేతులతోనూ నొక్కి పట్టుకొని గట్టిగా నిశ్వసించాడు షాడో. క్రమంగా జరిగినదంతా అతని కళ్ళ ముందు తిరగసాగింది.

క్లీ బ్రాండ్ స్పెషల్ బ్రాందీచేసిన ఘనకార్యంఇదంతా. అది తాగితే... మంచీ చెడ్డా విచక్షణ తెలియకుండా గుడ్డి ఎద్దు చేలో పడినట్లు అడ్డంపడి పోవటంతప్ప మరేమీ వుండదు.

సప్పోజ్ – ఏ పైలటో, డ్రయివరో రోడ్డుమీద నడుస్తున్న సాధారణ వ్యక్తో యిది తాగితే ఏమౌతుంది?

క్లీ బ్రాండ్ బ్రాందీ చాలా ప్రచారంలో వున్న డ్రింక్. దాదాపు అన్ని దేశాలకూ ఎగుమతి అవుతుంది. అంటే అందరూ ఒకేసారి ఈ స్పెషల్ బ్రాందీ తాగటానికి అవకాశం వుంది.

కిల్లర్స్ గాంగ్ సహాయం లేకుండానే ప్రపంచాన్నంతా అల్లకల్లోలం చెయ్యగల శక్తి క్లీ చేతుల్లో వున్నది.

ఒక మూల కూర్చుని నిశ్శబ్దంగా విలపిస్తున్న జెన్నీని చూడగానే షాడో ఆలోచనలు ఆగిపోయాయి. ఆమె దగ్గిరికిపోయి తలమీద చెయ్యివేసి నిమిరాడు.

"జెన్నీ డార్లింగ్! ఈ డ్రింక్ గురించి నీకు ఎంతవరకూ తెలుసు?" అనడిగాడు మృదువుగా?

"రాజూ! గాడ్ ప్రామిస్, నాకేం తెలియదు. మీ ముందే చెప్పాను కదా! ఇవి తయారు చేయటం మాత్రమే నాకు తెలుసు. వీటి ఎఫెక్ట్సు ఇప్పుడే చూశాను!" దీనంగా అన్నది జెన్నీ.

పెదవులు బిగించి పచార్లు చేయటం ప్రారంభించాడు షాడో. రెండు నిముషాలు నిశ్శబ్దం రాజ్యం చసిన వారిద్దరి మధ్య.

"జెన్నీ.... ఈ క్లీ బ్రాండ్ స్పెషల్ బ్రాందీ ఎంతవరకు తయారుచేయబడింది?" ప్రశ్నించాడు షాడో నిశ్శబ్దాన్ని చేదిస్తూ.

"నేను వుండగా త్రీ థౌజండ్ కార్టన్స్ తయాదేశాం. అంటే – మూడు లారీలకు సరిపోయే బరువు" జవాబు ఇచ్చింది జెన్నీ.

"ఆ తర్వాత?"

"ఆ తర్వాత టెంపరవరీగా ప్రొడక్షన్ నిలిపేయటం జరిగింది. మొదట ఇంగ్లాండ్‌లో వాటి ఎఫెక్టు చూసుకుని మార్కెట్ పరిస్థితులనుబట్టి తయారు చేయవచ్చన్నాడు అంకుల్."

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో మనసులోనే లెక్కలు కట్టుకున్నాడు షాడో. కార్టన్ అంటే రెండు డజన్‌ల బాటిల్స్... త్రీ థౌజండ్ కార్టన్స్.... ఆరు డజన్ల బ్రాందీ బాటిల్స్.

"జెన్నీ! ఈ విషయం కరెక్టుగా తెలుసా?" అడిగాడు "ఓ యస్. అవన్నీ నేను స్వయంగా హేండ్ చేశాను. మొదటి కన్‌సైన్‌మెంట్ లండన్ పోతుంది."

"పోతుంది.... అంటున్నావ్! ఇంకా పోలేదా?"

"లేదు. బహుశా రెండు మూడు రోజుల్లో పంపవచ్చు."

"ఓ గాడ్!" అంటూ మళ్ళీ పచార్లు చేయటం ప్రారంభించాడు షాడో. అన్నీ పకడ్బందీగా చేస్తున్నాడు క్లీ. మొదట తన ఫార్ములాలను అటూ యిటూ తిప్పి అందరికి యింట్రస్టు కలిగించాడు. తర్వాత తన దగ్గిరికి వచ్చినవారికి ఒక బాటిల్ ఒక మనిషి మీద ఎటువంటి ప్రభావం చూపిస్తుందో డిమాన్‌స్ట్రేట్ చేసి చూపించాడు. తర్వాత లార్జ్ స్కేల్‌లో డిమాన్‌స్ట్రేషన్.

ఇక కిల్లర్స్ గాంగ్ తల్ల క్రిందులుగా కావటానికి అడ్డేముంది? ఈ కొరివి ఆ కోతి చేతికి చిక్కితే యిక వారికి ఎదురేముంది?"

"జెన్నీ.... మనం ఎలాగైనా ఆ బ్రాందీ బయటకు పోకుండా ఆపాలి?" అన్నాడు వున్నట్లుండి.

అప్పటికి పూర్తిగా తేరుకున్నది జెన్నీ. "అందుకు ముందు మనం ఇక్కడ నుంచి బయటపడాలి కదా!" పాయింట్ అవుట్ చేసింది.

"ఆఫ్ కోర్స్..... యూ గాట్ ఎ పాయింట్ దేర్!" అంటూ తల సవరించుకున్నాడు షాడో. పురాతన కాలంలో కట్టిన బిల్డింగ్ కావటంవల్ల బేస్‌మెంట్ పైకప్పుకు ఇనుప కమ్మీలు అడ్డం పరిచివున్నాయి. ఒక కమ్మీ మీది సున్నం రాలిపోయి, చేయి పట్టేంత స్థలం వుంది. దాన్ని చూశాడు. ఒక మూలగా గోడకు అనించివున్న బ్రాందీ సీసాలు పెట్టే కొయ్య పెట్టెలను చూశాడు.

ఆ రెంటినీ కలిసి ఆలోచించగా ఒక చిన్న ఐడియా ఫారం అయింది అతని హృదయంలో. అది జెన్నీ కారు వేసుకున్న పొడుగాటి నైలాన్ స్టాకింగ్స్ చూడగానే బలపడి.... పూర్తి రూపాన్ని ధరించింది.

★ ★ ★

తన చిన్న సైజు పికప్ ట్రక్కును పొదల మధ్య ఆపి స్టీరింగ్ ముందు బొమ్మలాగా కూర్చున్నాడు ముఖేష్. పక్కనే సీటు మీద మిస్టర్ క్లీ వుంటున్న బిల్డింగ్ ప్లాన్ కాగితాలు పడివున్నాయి. అట్టడుగునవున్న డ్రయినేజ్ గొట్టాలతో సహా మార్కు చేయబడి వున్నాయా కాగితాలలో.

అస్తమిస్తున్న సూర్యుని కాంతిలో ఆ కాగితాలు మరొకసారి చూసుకొని మడిచి డాష్ బోర్డులో కుక్కాడు కాళ్ళ క్రింద వున్న బ్రీఫ్‌కేస్ తెరిచి అందులో వున్న రబ్బర్ డైవింగ్ సూట్ వేసుకున్నాడు. ముఖమంతా కవర్ చేసుకుని గ్లాస్ టోపీని ధరించాడు... చిన్న ఎయిర్‌బాగ్ భుజానికి తగిలించుకొని.... చీకటి పడగానే పొదల చాటుగా క్లీ భవనాన్ని సమీపించాడు.

అంతకు ముందు తను చేపలు పట్టిన సెలయేటి సమీపంలో భవనం యొక్క డ్రైనేజి పైపు బయటికి కనిపిస్తూ వుంది. అండర్‌గ్రౌండ్‌లో లేబరేటరీ వుండటం వలన కెమికల్స్ నిరపాయకరంగా గాలిలో కరిగి పోవటానికి వీలుగా నాలుగు అడుగుల వ్యాసంలో కట్టించాడా డ్రైనేజ్ దారిని మిస్టర్ క్లీ. అది తనకు ఉపయోగకరం కావటం అతనికి ధన్యవాదాలు తెలుపుకుంటూ అందులో ప్రవేశించాడు ముఖేష్.

చేతికి తగిలించి వున్న పెన్సిల్ ఫ్లాష్ లైట్‌ని ఆన్ చేసి ఆ వెలుగులో ముందుకు సాగాడు. అప్పుడప్పుడూ వాటర్ తెరలు తెరలుగావచ్చి అతని నడుందాకా తడిపిపోతున్నది. అరగంటపాటు అలాగే అంగుళం అంగుళం చొప్పున ముందుకు జరిగాడు.

మరి కొంచెం ముందుగా పోయేసరికి పైన చిన్న చిన్న వాటర్ పైపులు కనిపించాయి. అతనా ప్రదేశాన్ని చేరగానే ఒక పైపులోంచి సుగంధం పరిమళాలను వెదజల్లుతున్న నీరు అతని ముఖం మీదపడి అభిషేకించింది. పైన వున్న బాత్‌రూమ్‌లో ఎవరో స్నానం చేస్తున్నట్లు గ్రహించి ఎయిర్ బాగ్‌లో నుంచి చిన్న కాంట్రాక్ట్ మైక్రోఫోన్ తీసి పట్టుకున్నాడు.

దానితో డ్రైనేజి టాపును పరీక్షిస్తూ ముందుకు జరిగాడు. మరో పది అడుగుల పోయేసరికి అడుగుల చప్పుడు వినవచ్చింది. వెంటనే మైక్రోఫోన్‌కు తగిలించి వున్న ఇయర్ పీస్‌ని చెవికి తగిలించుకుని ఊపిరి బిగబట్టి వినసాగాడు.

అతను వూహించినట్లుగానే అడుగుల శబ్దం అతని నెత్తిమీద అగింది. ఆ భవనం యొక్క ప్లాన్ ముఖేష్ కళ్ళముందు గిర్రున తిరిగింది. లెక్క ప్రకారం తను బేస్‌మెంట్ మీద లేబరేటరీ క్రింద వుండి వుండాలి అనుకుంటుండగా ఇయర్ పీస్‌లో నుంచి మాటలు వినిపించసాయి.

"ఇది ప్లాంట్ నమూనా మాత్రమే! యాక్చువల్ ఎక్విప్‌మెంట్ ఫాక్టరీలో వుంది. అన్నీ రేపు చూపిస్తాను."

"వెరీ గుడ్ మిష్టర్ క్లీ. అన్నీ బ్రహ్మాండంగా ఉన్నాయి. ఈ ఫార్ములాకి సంబంధించిన వివరాలు ఎవరెవరికి తెలుసు?"

"నోబడీ...... డియర్ వెల్బీ.... నోబడీ.... అందరికీ కొద్ది వివరాలు తెలుసు. అన్నీ కలిపి నాకు ఒక్కడికే తెలుసు. ఎలా వుంది నా పథకం? అవసరం వున్నంత కాలం వారిని ఉపయోగించుకోడం, అవసరం తీరిన వెంటనే అడ్డుతొలగించుకోవటం.. అంతే .... ఓకే ఇక రోజుకు మన డిస్కషన్స్ అపుదాం. పోయి సప్పర్ చేసి రెస్ట్ తీసుకుందాం."

క్రమంగా దూరంగా వెళ్ళిపోయాయా కంఠాలు. వెంటనే ఎయిర్ బాగ్ లోంచి మరొక వస్తువును బయటికి తీశారు ముఖేష్. రెండు జానల పొడుగున్న వుక్కు ముక్కకు డైమండ్ తాపడం చేసి వుంది.

మైక్రోఫోన్, ఇయర్ పీస్ బాగ్‌లో పెట్టి ఆ వస్తువుతో పైనున్న కప్పును గీకటం ప్రారంభించాడు. రాళ్ళు, సున్నం, మట్టి వర్షంలా అతని చుట్టూ పడసాగాయి. ఓపికగా రెండు అడుగుల చదరంలో అంగుళాల లోతున కప్పుని తొలిచేశాడు. డైమండ్ టిప్‌డ్ టూల్‌ని బాగ్‌లో పెట్టి కుడికాలిని కప్పు కానించి బలంగా నొక్కాడు. మట్టి గుట్టలు గుట్టలుగా అతని మీద పడింది.

డ్రయినేజి పైపు పై భాగంలో మనిషి పట్టేటంత ఏర్పడింది. మెల్లిగా అందులోనుంచి పైకివచ్చి ... లేబొరేటరీలో అడుగు పెట్టాడు. చేతికి వున్న ఫ్లాష్ లైట్ వెలుగులో ఆ గదిని తీక్షణంగా పరిశీలించాడు రకరకాల సైంటిఫికల్ ఎక్విప్‌మెంట్స్‌తో నిండి వుందా లేబరేటరీ. ఒక్కొక్క వస్తువునే వివరంగా చూస్తూ ఒక చివర గోడకు ఆనించివున్న స్టీల్ కాబినెట్ల దగ్గరికి వచ్చాడు.

ఒక్క కాబినెట్ తప్ప అన్నీ తలుపులు తెరిచే ఉన్నాయి. ఒకటి మాత్రం లాక్ చేయబడి వుంది. అటూ ఇటూ చూసి బాగ్‌లో చేయిపెట్టాడు ముఖేష్. పెద్ద తాళం

చేతులగుత్తిని బయటకు లాగాడు. రెండు నిముషాలపాటు తంటాలు పడిన తరువాత కాబినెట్ తెరుచుకున్నది.

లోపల కొన్ని ఫైళ్ళు. కెమికల్స్.... చిన్న డబ్బాలు పేర్చబడి వున్నాయి. అన్నిటికంటే పైభాగంలో ఒక ఎర్రటి నోట్ బుక్ వున్నది. దాన్ని అందుకొని ఫ్లాష్ లైట్ వెలుగులో పేజీలు తిప్పి చూసాడు.

మొదటి నాలుగు పేజీలలోను క్లీ బ్రాండ్ స్పెషల్ బ్రాందీ డయాగ్రమ్స్ వున్నాయి. చకచకా రెండు పేజీలు చదివి.... మరికొన్ని పేజీలు తిరగేశాడు. ఏదో కెమికల్ కాటన్ గురించిన ఫార్ములా వున్నదందులో.

తనకు కావల్సిన బుక్ అదేనని గ్రహించి బాగ్‌లో పెట్టుకున్నాడు. కాబినెట్ తలుపు మూస్తుండగా అడుగుల చప్పుడు వినవచ్చింది.

మరుక్షణం లైటు ఆఫ్ చేసి బొడ్లో వున్న రివాల్వర్ అందుకున్నాడు. పిల్లిలా అడుగులు వేస్తూ తలుపు దగ్గరికి పోయి నిలబడ్డాడు.

ఆ అడుగుల చప్పుడు దగ్గరకు వచ్చింది. డోర్ హేండిల్ మేద చెయ్యి వేసి రెడీగా నిలబడ్డాడు ముఖేష్. కానీ, అక్కడ అగకుండా మరికొంత ముందుకు పోయాయి ఆ అడుగలు. తలుపు కొద్దిగా తెరచి ఆ సందులో నుంచి బయటకు తొంగి చూసాడు ముఖేష్. ఒక ట్రే నిండా ఆహారం నింపుకొని కారిడార్ చివరికి పోతున్న గపూర్‌ని చూసి పజిల్ ఆయ్యాడు.

కారిడార్‌లో గోడలకు అమర్చివున్న ఎలక్ట్రిక్ బల్బుల కాంతిలో అంతా క్లియర్‌గా కనిపిస్తున్నది.

ఒక గది ముందు ఆగి ట్రే కిందపెట్టి దూరంగా జరిగి నిలబడ్డాడు గఫూర్. "మిస్టర్ షాడో..... మీకు ఆహారం తెచ్చాను. మర్యాదగా, గొడవ చెయ్యకుండా తీసుకోండి" అని అరచి, తలుపుకున్న తాళం తీసి.... తలుపును బలంగా లోపలికి తోశాడు.

రెండు క్షణాలు ఎటువంటి సంఘటనా జరగకుండానే గడిచిపోయాయి. పాంటు జేబిలోనుంచి రివాల్వర్ తీసి రెండు అడుగులు ముందుకువేసి గదిలోకి తొంగి చూశాడు మరుక్షణం ఆశ్చర్యంతో కూడిన కేక పెట్టి లోపలికి గెంతాడు. వెంటనే ఏదో బరువైన వస్తువు కింద పడిన శబ్దం వినవచ్చింది. దానితోపాటు గఫూర్ మూలుగులు గూడా వినిపించాయి.

వెంటనే కారిడార్ లోకి పరుగుతీశాడు ముఖేష్. అదే సమయంలో గదిలో నుంచి వెనక్కు నడుచుకుంటూ వచ్చి గోడకు గుద్దుకుని కిందికి జారిపోయాడు గఫూర్. అతనితో పాటు కారిడార్ లోకి వచ్చిన షాడోను చూసి వున్న చోటనే ఆగిపోయాడు ముఖేష్.

కింద పడిన గఫూర్‌ని జుట్టు పట్టుకొని పైకి లేవతీస్తూ ముఖేష్‌ని చూసి చిరునవ్వుతో అతనివైపు తిరిగాడు షాడో.

"హల్లో ముఖేష్! ఏమిటి ఇలా వచ్చావ్?" అని అడిగాడు కాజువల్‌గా.

"నీ సాహసచర్యలు చూసి పోదామని వచ్చాను."

"మంచిపని చేశావ్. ఒక రెండు గంటలు ముందు రావల్సింది..... ఇంకా బాగా చూసేవాడిని" అంటూ గఫూర్ ముక్కు మీద బలంగా గుద్ది కిందికి

వదిలేశాడు షాడో. షాడోను సమీపించి, గదిలోకి తొంగి చూసి వులిక్కిపడ్డాడు ముఖేష్.

"రాజూ! నువ్వంటే లేడీస్ పడిచస్తారన్నమాట నిజమే! కానీ.... మరీ యింత దారుణంగా చచ్చిపోతారని అనుకోలేదు సుమా!" నిర్లిప్తంగా అన్నాడు.

లోపల పైన వున్న ఇనుప కమ్మీకి వ్రేలాడుతున్నది జెన్నీ. కాళ్ళకు వేసుకున్న నైలాన్ సాక్సింగ్‌లతో వురిపోసుకున్నది.

మెల్లిగా..... భయంకరంగా .... అటూ ఇటూ వూగుతున్న దామె శరీరం. ముఖేష్ వదనంలోని భావాలు గమనించి పకపకా నవ్వాడు షాడో.

"ఏం చేయమంటావ్ ముఖేష్? వేరే మార్గం లేక పోయింది" అన్నాడు.

"ఆల్‌రైట్.... ఇక్కడి నుంచి వెళ్ళిపోవటం చాలా మంచిది..... పద" అంటూ వెనుదిరిగాడు ముఖేష్. షాడో అలాంటి పని చేశాడంటే అతని హృదయం నమ్మలేకపోయింది. ఏదో కారణం లేకుడా అలా ఎన్నటికీ చేయడని సమాధానం పరుచుకోసాగాడు.

ముఖేష్ ముఖం చూసి మరింతగా నవ్వాడు షాడో.

"జెన్నీ డియర్! ఇక నీ యాక్టింగ్ చాలు.... కిందికి దిగుతావా?" అన్నాడు లోపలికి పోయి.

ముఖానికి అడ్డుపడిన జుట్టును వెనక్కు విసరి వ్రేలాడుతున్న చేతులను పైకెత్తింది జెన్నీ. షోల్డర్స్ కింది నుంచి మెలిక పెట్టి నైలాన్ సాక్సులకు ఎటాచ్ చేయబడిన బెల్టు వూడదీసుకొని కిందికి దూకింది.

"మా దగ్గిర చీపురుపుల్ల లాంటి వస్తువు కూడా వుండకుండా అన్నీ లాక్కున్నారు ముఖేష్! ఆహారం తీయటంవచ్చిన వారు యిలాంటి దృశ్యాన్ని చూస్తే అన్‌బాలన్స్ అవుతారని వూహించి యీ పన్నాగం పన్నాను. పాపం నిజంగానే వురి పోసుకున్నదని తలచి దెబ్బ తిన్నాడు గఫూర్" ఎక్స్‌ప్లెయిన్ చేశాడు షాడో.

"ఇటువంటి నాటకం ఆడుతున్నానని నేనే గ్రహించలేకపోయాను. ఇక యీ డల్ హెడ్ ఏం గమనిస్తాడు. యిక పోదామా?" అన్నాడు ముఖేష్.

"జెన్నీ డియర్.... ఇతను నా సైడ్ కిక్ ముఖేష్ అంటూ వారిని పరిచయం చేశాడు షాడో.

ఆమెకూ, ఎమిలీకి వున్న భేదాన్ని గమనించి ఆశ్చర్యపోతూ ముందుకు దారి తీసాడు ముఖేష్. డ్రయినేజ్ ద్వారం దగ్గరికి రాగానే వారిని ముందు పొమ్మని చెప్పి, వంటరిగా లేబరేటరీ అంతా కలయతిరిగాడు.

షాడో – జెన్నీలు దూరంగా పోయారని నిశ్చయించుకొని ఎయిర్ బాగ్ లోని సామాను బయటికి తీశాడు. అందులోని ప్లాస్టిక్ బాంబులను లేబరేటరీ నాలుగు మూలలా ఎటాచ్ చేసి వాటినన్నిటినీ కలిపి ఒక టైమింగ్ మిషన్‌కి కనెక్టు చేశాడు. ఎయిర్ బాగ్ మూయబోతూ, దగ్గిరలో వున్న క్లీ బ్రాండ్ స్పెషల్ బ్రాందీ బాటిల్ ఒకటి అందుకొని అందులో వేసుకొని సొరంగంలోకి దిగాడు.

అరగంట తరువాత చల్లటి గాలిలోకి అడుగుపెట్టి తేలికగా వూపిరి వదులుతూ పచ్చిగడి మీద వాలిపోయాడు.

"ఇక్కడి నుంచి ఎటు పోవాలి గురూ?" అడిగాడు షాడో.

"చెప్తాను. ఒక్క నిముషం" అంటూ చేతికున్న వాచ్ వంక చూశాడు ముఖేష్. మరు నిముషంలో బ్రహ్మాండమైన ప్రేలుడు శబ్దం సొరంగంలో నుంచి వచ్చి వారి చెవులను చేరింది.

"బిల్డింగ్‌ని దెబ్బ తీయకపోయినా లేబొరేటరీ అంతా సర్వనాశనం అయివుంటుంది. మన దెబ్బ కాస్త రుచి చూడటంకోసం ఏర్పాటుచేసి వచ్చాను" అంటూ ఎయిర్ బాగ్‌లో నుంచి బ్రాందీ బాటిల్ బయటికి తీశాడు ముఖేష్.

"ఇక్కడికి ఫర్లాంగు దూరంలో నేను వచ్చిన పికప్ ట్రక్కు వుంది. సో! మనం హాయిగా ఆడుతూ పాడుతూ యింటికి చేరుకోవచ్చు ఫస్ట్ లెటజ్ ఎంజాయ్ దిస్ డ్రింక్" అని మూత తీసి గొంతులోకి వంపుకోబోయాడు.

ఒక్క దెబ్బతో ఆ బాటిల్‌ని ముఖేష్ చేతిలో నుంచి ఎగరకొట్టాడు షాడో. దూరంగా పోయి ఒక రాతి మీద పడి ముక్కలై పోయింది బాటిల్. బ్రాందీ అంతా నేల పాలయింది.

"పొరపాటునగూడా ఆ బ్రాందీ రుచిచూడకు ముఖేష్" సీరియస్‌గా అన్నాడు షాడో.

"ఏమిటి గురో! ఉన్నట్లుండి నీకు మంచి బుద్ధులు అలవడుతున్నాయ్!" ఆశ్చర్యంగా అడిగాడు ముఖేష్.

"అది తర్వాత చెప్తానుగాని, యిక్కడినుంచి క్లీ బ్రీవరీస్ ఫ్యాక్టరీకి దారి తెలుసా?" ప్రశ్నించాడు షాడో.

ఎందుకో అర్థం కాకపోయినా తెలుసు అన్నట్లు తలవూపాడు ముఖేష్.

"ముఖేష్! త్రీ థౌజండ్ కార్టన్స్ స్పెషల్ బ్రాందీ ఎక్స్‌పోర్ట్ అవబోతోంది అక్కడి నుంచి. అది బయటికి పోకుండా మనం ఆపాలి. అది బ్రాందీ కాదు... బ్రహ్మరాక్షసి!" అంటూ తన ఎక్స్‌పీరియన్స్ కోట్ చేశాడు షాడో.

"రాజూ! నిజమేనంటావా? ఆ బ్రాందీ తాగి మైకంలో ప్రవర్తించావేమో!" సందేహం వెలిబుచ్చాడు ముఖేష్ .

"ఆఫ్టరాల్ ఒక్క బ్రాందీ బాటిల్ తాగి నేను మైకంలో మునిగిపోవటం నువ్వెప్పుడైనా చూశావా? అది గొంతులోకి దిగిన మరుక్షణం వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లు ఫీలయ్యాను. ఒంటిచేత్తో కిల్లర్స్ గాంగ్ నంతా మట్టుపెట్టాలని అనుకున్నాను. తీరా కదలబోయేసరికి ఇనుపముద్దలా వున్న చోటనే నిలబడిపోయాను."

ట్రక్కును సమీపించి ఎక్కి కూర్చున్నారు ముగ్గురూ. స్టీరింగ్ ముందు కూర్చుని స్టార్ చేశాడు ముఖేష్.

పొదలలోనుంచి బయటకు వచ్చి రోడ్డు వైపు బయలు దేరింది ట్రక్కు.

"రాజూ! ఈ క్లీ బ్రాందీని తయారు చేసి అందరినీ హడలకొట్టాలని చూస్తున్నాడు. బాగానే వుంది. కాని ఇటువంటి యిన్సిడెంట్స్ ఒకటి రెండు జరగగానే ఎంక్వైరీలు స్టార్ట్ అవుతాయి. అన్నేచురల్‌గా ప్రవర్తించిన వారందరూ క్లీ బ్రాండ్ బ్రాందీ తాగిన తర్వాతే అలా చేశారని తెలియకపోదు. అప్పుడు అందరూ కట్టకట్టుకుని క్లీ మీదికే వస్తారు గదా! పిచ్చివాడు అది ఆలోచించకుండా....."

"లేదు ముఖేష్! .....యీ బ్రాందీ స్పెషల్ సిరప్స్‌తో తయారుచేయబడింది. శరీరంలోకి ప్రవేశించగానే పూర్తిగా బ్లడ్‌లో కలిసిపోతుంది. మెడికల్

ఎగ్జామినేషన్‌లో అసలు తాగినట్లే తెలియదు." అతని మాటలకు అడ్డువచ్చి తెలియచేసింది జెన్నీ.

"డామ్ క్లవర్ బగ్గర్.... అన్నీ ఆలోచించే చేశాడన్న మాట" తనలో తను అనుకుంటూ దృష్టినంతా డ్రయివింగ్ మీద కేంద్రీకరించాడు ముఖేష్.

పది నిముషాల్లో ట్రక్కు క్లీ బ్రీవరీస్ కాంపౌండ్ సమీపంలోకి వచ్చింది. విండోలో నుంచి బయటికి చూస్తున్న జెన్నీ వున్నట్లుండి చిన్నగా ఖంగారుగా అరిచింది.

"రాజూ! చూడు. లోడింగ్ గేటుదగ్గిర మూడు లారీలు ఆగి వున్నాయి. అవిగో – ఆ గ్రీన్ బాక్సులు అన్నీ స్పెషల్ బ్రాందీ కార్టన్లే " అన్నది ఆందోళనతో.

కామ్‌గా ముఖేష్ వైపు చూశాడు షాడో. నువ్వే ఏదైనా ఆలోచించాలి – అన్న భావం మిళితమై వుందా చూపులో.

ఐదు నిముషాలు తీవ్రంగా ఆలోచించాడు ముఖేష్. లారీలు లోడింగ్ పూర్తిచేసుకుని బయలుదేరటానికి సిద్దంగా వున్నాయి. తాము ముగ్గురూ ఆ లారీలను అపటం కష్టం. ఆపినా – వాటిలోని బాటిల్స్ బ్రద్దలు కొట్టటం యింకా కష్టతరమైన కార్యం.

లోడింగ్ గేటులోనుంచి బయలుదేరి రోడ్డు మీదికి వచ్చాయి లారీలు. తళుక్కుమని ఒక ఐడియా ముఖేష్ మనసులో మెదిలింది. చేతికి వున్న వాచ్ కీ రాడ్ గట్టిగా లాగాడు.

"హల్లో – ఆల్మోరా స్పెషల్ ఫోర్స్ హియర్! వాచ్ కెన్ వుయ్ డూ ఫర్ యూ?" అతనికి సుపరిచితమైన కంఠం ప్రశ్నించింది.

"డ్రాగన్ నెంబర్ టూ స్పీకింగ్ హియర్.... నాకు అర్జంటుగా కొన్ని సామానులు కావాలి. వెరీ అర్జంట్‌గా" అన్నాడు ముఖేష్ లారీలను గమనిస్తూ.

"జస్ట్ నేమ్ దెమ్..... పది నిముషాలలో పంపిస్తాం" అన్నదా స్వరం. తనకు కావల్సిన స్పెసిఫికేషన్స్ యిచ్చాడు ముఖేష్. జెన్నీ ద్వారా లారీలు ఎటుపోతున్నది తెలుసుకొని ఆ దారిలో తమకు అందించమని డైరెక్టు చేసి ట్రక్కును ముందుకు కదిల్చాడు.

ఆల్మోరా సిటీ మధ్య నుంచి యాభై మైళ్ళ దూరంలో వున్న సముద్రతీరంవైపు పోతున్నాయి ముందున్న లారీలు. అక్కడినుంచి ఓడలో బ్రిటన్ పోతాయి వాటిలో వున్న కార్టన్స్.

ఆల్మోరా క్రాస్ రోడ్డు దగ్గిర స్పెషల్ ఫోర్స్ వాన్ ఒకటి ఆగి వుంది. దాని టాప్ మీద చిన్న పోర్టబుల్ జనరేటర్, దానికి కనెక్టు చేయబడివున్న ఫిరంగిలాంటి మెషిన్స్ ఎటాచ్ చేయబడి వున్నాయి.

పికప్ ట్రక్కును చూడగానే కిందికి దిగి రోడ్డు మధ్యకు వచ్చి చేతులు ఎత్తాడు డ్రయివర్.

"విత్ కాంప్లిమెంట్స్ ఫ్రం స్పెషల్ ఫోర్స్ సర్" అన్నాడు వాన్ వైపు చూపిస్తూ. స్టీరింగ్ వదిలి కిందికి దూకాడు ముఖేష్. వాన్ మీదికి ఎక్కి ఎక్విప్‌మెంట్‌ని చెక్ చేసుకొని చేయి వూపాడు.

వెంటనే కిందికి దిగి వాన్‌లో కూర్చున్నారు షాడో, జెన్నీలు – స్టీరింగ్ అందుకొని, వేగంగా లారీలు పోయిన దిశకు పోనిచ్చాడు షాడో.

సుమారు అరగంటసేపు కొనసాగిందా ప్రయాణం. టాప్ మీద కూర్చుని ఫ్లాష్ లైటు వెలుగులో తను తస్కరించి తెచ్చిన నోట్ బుక్ తెరిచి చూడసాగాడు ముఖేష్. స్పెషల్ బ్రాందీని గురించి తెలిసిపోయినందున ముందున్న నాలుగు పేజీలు చాలా తేలిగ్గా అర్ధం అయ్యాయి. ఆ తరువాయి పేజీలో వున్న కంటెంట్స్ అతన్ని కలవరపరచాయి.

".... ఆరవై ఫారన్ హీట్ డిగ్రీల టెంపరేచర్‌లో యీ సింథటిక్ కాటన్ నీటిని తాకిన మరుక్షణం వ్యాకోచించటం మొదలు పెడ్తుంది. సుమారు ఒక గంటసేపు అలా పెరుగుతూనే వుంటుంది. ఆ తర్వాత ఎనిమిదిగంటలపాటు స్థిరంగా నిలబడిపోతుంది. పది గంటల తరువాత ప్రమాదకరమైన పాయిజన్‌గా మారుతుంది....." నొసలు చిట్లిస్తూ పేజీలు తిప్పాడు. ఆఖరి పేజీలలో రెండు ఎలక్ట్రానిక్ డయాగ్రాంస్ వున్నాయి. వాటిని పరీక్షగా చూశాడు. వైర్‌లెస్ ట్రాన్స్‌మిటింగ్ సెట్ తయారుచేసే డ్రాయింగ్ లవి.

ఉన్నట్లుండి వాన్ వేగం తగ్గింది. విండోలోనుంచి శబ్దం బయటికి పెట్టి హెచ్చరించాడు షాడో.

"ముఖేష్! ఇంకో రెండుఫర్లాంగుల దూరంలో ఎత్తయిన ఘాట్ రోడ్ వున్నదిట. అక్కడ లారీలను ఆపుదాము" అన్నాడు.

"ఓ.కే రాజూ! ఐయామ్ రెడీ!" అంటూ ఎలక్ట్రిక్ జనరేటర్ని ఆన్ చేశాడు ముఖేష్. ఫిరంగిలాగా వున్న మిషన్ మీద కొన్ని స్క్రూలు బిగించి హేండిల్ పట్టుకొని తయారుగా నిలబడ్డాడు.

చీకటిని చీల్చుకుంటూ ముందుకుపోయి బరువుగా కనిపిస్తున్న లారీలను సమీపించిది వాన్. ముందు రెండు లారీలు ఫర్లాంగ్ దూరంలో వున్నాయి మూడవలారీ నిండు గర్భిణీలాగా నెమ్మదిగా రొదచేస్తూ ఎత్తు ఎక్కసాగింది

లారీని సమీపించగానే ఒక బటన్ నొక్కాడు ముఖేష్ వెంటనే ఆ మిషన్‌లో నుంచి ఆల్ట్రాసోనిక్ కిరణాలు ముందుకు పోయి లోడ్ చేసివున్న బ్రాందీ బాటిల్స్ మీద పడ్డాయి.

ఆల్ట్రాసోనిక్ కిరణాలను కెమికిల్స్‌ను కలియబెట్టటానికి ఉపయోగిస్తారు. అవి తగిలిన మరుక్షణం ఆల్కహాలిక్ కంటెంట్స్ వున్న పదార్థాలు పొంగి కళపెళ కాగుతాయి. ఎప్పుడో ఒక సైంటిఫికల్ జర్నల్‌లో చదివిన విషయం గుర్తుకువచ్చి ఆ ఎత్తు ఎత్తాడు ముఖేష్.

ఆల్ట్రాసోనిక్ కిరణాలు తగిలిన మరుక్షణం బ్రాందీ బాటిల్స్‌లో వున్న బ్రాందీ పొంగింది. ఆ వత్తిడికి తట్టుకోలేక టపాకాయలాగా పగిలిపోయాయి బాటిల్స్ అన్నీ. బ్రాందీ పొంగి – తెల్లటి నురుగు గాలిలోకి ఎగరసాగింది.

లోడ్ గేర్‌తో ఎత్తు ఎక్కుతున్నందున లారీ డ్రయివర్ ఇంజన్ రొదలో వెనుక జరుగుతున్న భాగవతాన్ని గమనించలేకపోయాడు. ఉన్నట్లుండి తేలిక అయిపోయినట్లు వేగంగా ముందుకు దూకింది లారీ. అది గమనించి ఆశ్చర్యంతో లారీ ఆపి కిందికి దిగి చూశాడు.

చూడటానికి ఏముంది? ఖాళీ కొయ్యపెట్టెలు లారీలో వున్నాయి. ఒక్క బాటిల్‌ని కూడా మిగల్చకుండా పగలగొట్టాయి ఆల్ట్రాసోనిక్ కిరణాలు.

డ్రయివర్ దిగటం గమనించి వాన్‌ను స్పీడుగా ముందుకు పోనిచ్చాడు షాడో. జరిగింది గ్రహించి డ్రయివర్ కేకలు పెట్టడం ప్రారంభించేసరికి కనుచూపు మేర దాటి వెళ్ళి రెండవ లారీని సమీపించారు.

★ ★ ★

రెండో లారీ గతి కూడా అదే మాదిరి అయిపోయిది, నురుగుగా మారి గాలిలో ఎగర సాగింది బ్రాందీ. ఆ నురుగు తమ శ్వాసనాళాలనుంచి గాని, నోటినుంచి గాని పోకుండా ముఖాలకు హేండ్ కర్చీఫ్‌లు కట్టుకున్నారు షాడో ముఖేష్‌లు. జెన్నీ మాత్రం అటువంటిదేమీ ఉపయోగించటానికి వీలులేక తల వంచుకుని కూర్చొంది.

ఆఖరి బాటిల్ కూడా పగలగొట్టి ముందుకు దూకించాడు వేన్‌ని షాడో. ఫ్రంట్ గ్లాస్ నిండా విరజిమ్మటమే కాకుండా వారిని పూర్తిగా తడిపివేసింది బ్రాందీ నురుగు.

మూడవ లారీ కనుచూపు దూరంలోకి వచ్చేసరికి రోడ్డు ఏటవాలుగా కిందికి దిగసాగిది. ఆ వాలులో మిషన్‌ని ఉపయోగించలేక షాడో సహాయాన్ని కోరాడు ముఖేష్. స్టీరింగ్ వీల్ జెన్నీకి అందించి పైకి చేరాడు షాడో.

మరుక్షణం గాలిలో లేచినట్లు ఎగుడు దిగుళ్ళతో గంతులు వేస్తూ ప్రయాణించసాగింది వాన్.

ఏమరుపాటుగా వున్న ముఖేష్ వెల్లకిలా పడిపోయాడు ఆ వేగానికి. మిషన్ హేండిల్ గట్టిగా పట్టుకొని కిందపడి పోకుండా ప్రాణాలు దక్కించుకున్నాడు షాడో.

"ఇదేమిటి రాజూ?" అంటూ ముందుకు వంగి విండోలో నుంచి లోపలికి చూశాడు ముఖేష్.

వికటంగా నవ్వుతూ స్టీరింగ్ పట్టుకొని యిష్టం వచ్చినట్లు తిప్పుతోంది జెన్నీ కాలితో యాక్సిలేటర్‌ని అదిమిపెట్టి వుంచింది.

"ఆయ్య బాబోయ్! కొంపలు అంటుకున్నాయ్ రాజూ. జెన్నీ ఆ బ్రాందీ నురుగును టేస్టు చేసినట్టుంది. ఇక మన పని గోవిందా.... గోవిందా" అని అరిచాడు ముఖేష్.

"చచ్చాంరా దేముడా! అంటూ కిందికి దిగబోయి వాన్ వైల్డుగా పక్కకి తిరగటంతో బోర్లా పడిపోయాడు షాడో. టాప్ మీద లగేజి పెట్టటానికి అరేంజి చేసిన యినుప వూచలు పట్టుకొని మెల్లిగా కిందికి దిగే ప్రయత్నం చేయ్యబోయారు.

"లాభం లేదు రాజూ! లారీ దగ్గిరికి వచ్చేసింది. దేముడి మీద భారం వేసి నిలబడ్డటం కంటే మనం చేయగలిగింది ఏమీలేదు. మిషన్ పట్టుకో" అని ముఖేష్ హెచ్చరించటంతో ఆగిపోయాడు.

"జెన్నీ డార్లింగ్! లారీ పక్క నుంచి పోనీయి. దానితో సమనంగా నడుపు మా తల్లివి కదూ? బంగారం.... " అంటూ బ్రతిమిలాడాడు ముఖేష్ విడో మీదికి వంగి.

"యాహూ!" అని అరిచి మరింత వేగంగా వేన్‌ని ముందుకు దూకించింది జెన్నీ.

"డౌన్ విత్ కిల్లర్స్ గాంగ్... ఐ విల్ స్మాష్ ఎవ్రీ బడీ" అని నవ్వసాగింది.

"మే గాడ్ హెల్ప్ అజ్. వాళ్ళతో పాటు మమ్మల్ని కూడా స్మాష్ చేసేటట్టుంది యీ పిచ్చిది" ఏం చేయలేక ఆల్ట్రాసోనిక్ మెషీన్‌ని కావలించుకుని నిలబడి తనలో తను గొణుక్కున్నాడు షాడో.

ముందున్న లారీ వంద అడుగుల దూరంలోకి వచ్చింది. ఆల్ట్రాసోనిక్ మిషన్‌ని దానిమీదికి గురిపెట్టాడు ముఖేష్.

వెనుకా ముందూ చూడకుండా డ్రైవ్ చేస్తోంది జెన్నీ. ఆమె నవ్వులు వేన్ ఇంజన్ శబ్దాన్ని మించి వినిపించసాగాయి రోడ్డు కిందికి దింపి వేగంగా లారీ పక్కకు తీసుకుపోయింది వేన్‌ని. 'హైవే' కావటం వల్ల రెండు ట్రక్కులు పక్క పక్కన పోయే దారి వుంది. లారీ పక్కకు చేరుకోగానే మిషన్ ఆన్ చేశాడు పాలో రెండు నిముషాలలో ఖాళీ అయిపోయింది లారీ. బ్రాందీతో తడిసిపోయింది రోడ్డు మొత్తం.

"ముఖేష్! ... యిక యింటికి పోదామని చెప్పు దానికి. వింటుందని నాకు నమ్మకం లేదు" ఆఖరి కార్టన్ పగలగొడ్తూ అన్నాడు షాడో.

మళ్ళీ కోతిలాగ విండోమీదికి వంగాడు ముఖేష్.

"బేబీ! అంతా అయిపోయింది. ఇంటికి పోదాం వెనక్కి తిప్పమ్మా!" అన్నాడు.

"నో... నో.. కిల్లర్స్ గాంగ్‌నంతా సర్వనాశనం చేయందే ఇంటికి పోవటానికి వీలులేదు. డౌన్ విత్ కిల్లర్స్ గాంగ్" అని మరింత వేగం హెచ్చించిందామె.

"డార్లింగ్ జెన్నీ! మా తల్లివి కదూ వాన్ అపమ్మా. కిల్లర్స్ గాంగ్ సంగతి మేం చూసుకుంటాం. బంగారం... వరహాలమూట."

ముఖేష్ ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి. అతను బ్రతిమిలాడినకొద్దీ రెచ్చిపోయి యిష్టం వచ్చినట్లు డ్రయివ్ చేయసాగింది.

మాటలతో లాభంలేదని గహించి, రెండవవైపునుంచి విండోమీదికి దిగాడు షాడో. ఒక కాలు మడ్ గార్డుమీద వేసి డోర్ తెరిచి లోపలకు దూకాడు. జెన్నీ పక్కనుంచి కిందికి దిగి స్టీరింగ్ సమీపంలో వేలాడసాగాడు ముఖేష్.

సీటుమీద కూర్చుని, ఒక చేత్తో జెన్నీని బలంగా పక్కకు గుంజాడు షాడో. ట్రక్కు వైల్డుగా వూగింది. వెంటనే బోర్ తెరిచి ఒంటి చేతితో స్టీరింగ్ అందుకున్నాడు ముఖేష్.

పిండిబొమ్మలా షాడోమీద ఒరిగిపోయింది జెన్నీ ట్రక్కు వేగం తగ్గింది. లోపలికివచ్చి స్టీరిగ్ కంట్రోల్ చేయసాగాడు ముఖేష్.

జెన్ని మీద పనిచేసిన బ్రాందీ ప్రభావం దిగసాగింది. షాడో భుజంమీద ముఖం పెట్టి విలపించసాగింది.

ఆమెకు పూర్తిగా తెలివి వచ్చేదాకా ఆగి చుట్టు దారిన ఆల్మోరావైపు బయలుదేరారు.

"రాజూ! సప్పోజ్ లారీలు ఖాళీ అయ్యాయని గ్రహించి వాళ్ళు ఫ్యాక్టరీకి తెలియజేస్తారనుకో ? ఏమవుతుంది?" వున్నట్లుండి అన్నాడు ముఖేష్.

"పోలీసులకి రిపోర్టు చేస్తారు." సమాధానం ఇచ్చాడు షాడో.

"పోలీసులకి రిపోర్టుచేస్తే పరవాలేదు. మన వాన్ నెంబర్ చూసి నోరు మూసుకుంటారు. నా అనుమానమల్లా మన నెంబర్ లారీ డ్రయివర్లు చూసే వుంటారు. క్లీ యీ విషయం తెలిసి, వాడి అనుచరులను పంపిస్తే –"

అంటూండగానే కొండ కింద రెండు మోటార్ వెహికిల్స్ కనిపించాయి వేగంగా కొండ ఎక్కుతున్నాయని. వాటివంక పరీక్షగా చూశాడు. తన ఎయిర్ బాగ్‌లో పవర్‌ఫుల్ మినీ బైనాక్యులర్ తీసి చూశాడు ముఖేష్.

"వెధవ అనుమానాలూ నేనూ... రాజూ! అవి ఫ్యాక్టరీ లారీలు. ముందు నలుగురు చొప్పున ఎనిమిదిమంది ఉన్నారు రెండు లారీలలోనూ. వెనుక ఎంత మంది ఉన్నారో తెలియదు ఏం చేద్దాం?" అన్నాడు బైనాక్యులర్స్ షాడోకి అందిస్తూ.

"ఇది నీ ఎస్సైన్‌మెంట్. యీ గొడవ మొదలయినది నువ్వు. నువ్వే ఆలోచించు" అంటూ ముందుకు దూసుకు వస్తున్న లారీలను పరీక్షించసాగాడు షాడో.

వారు నాలుగు ఫర్లాంగుల దూరం పోయేసరికి ఎదురువచ్చాయా లారీలు. బైనాక్యులర్స్‌తో వేన్ నెంబరు చూసి రోడ్డుమీద దారిలేకుండా ముందుకు రాసాగారు లారీలు వున్న వ్యక్తులు.

విధిలేక వేన్‌ను రోడ్డు పక్కకు తీసి ఇంజన్ చేశాడు ముఖేష్. తన ఎయిర్ బాగ్ భుజానికి తగిలించుకుని వాన్ దిగి చీకట్లలో కలిసిపోయాడు ముఖేష్.

లారీలు వారిని సమీపించి నిలబడే సరికి స్టీరింగ్ షాడో వున్నాడు. మిషన్ గన్స్ పట్టుకొని పదిమంది వ్యక్తులు వేన్‌ని చుట్టుముట్టారు వారిలో ఒక లావుపాటి వ్యక్తి షాడోని సమీపించి తన గన్ అతని గొంతుకు ఆనించాడు.

"మిస్టర్! ఎటువంటి గొడవచేయకుండా మాతో రావటం మంచిది" అన్నాడు కరుకుగా. అని లోపలికి తోంగి చూశాడు. అంతకుముందే ఆలోచించుకొని వుండటంవల్ల వెంటనే తన పార్టును ఎఫిషియంట్‌గా ప్లే చేసింది జెన్నీ.

అతనికి కనబడకుండా ముఖాన్ని దాచుకోటానికి ప్రయత్నించింది.

"మైగాడ్! మిస్ జెన్నీ! వీళ్ళతో ఏం చేస్తున్నావ్" ఆశ్చర్యంగా అడిగాడు వ్యక్తి.

"ప్లీజ్ డాన్! ఈ విషయం ఆంకుల్‌కి తెలియనివ్వకు. మా మేరేజ్ అయిపోయే దాకా కొంచెం రహస్యంగా వుంచు ప్లీజ్" అని మాటలకు అనుగుణంగా ముఖంలో భావాల్ని ప్రకటితం చేస్తూ రిక్వెస్ట్ చేసింది జెన్నీ.

అయోమయంగా చూశాడు డాన్. "ఏమిటి జెన్నీ? నీ మ్యారేజి విషయం నేనింతవరకూ వినలేదే?" అన్నాడు.

"నేనూ వినలేదు మిస్టర్! నేను కూడా యిప్పుడే వింటున్నాను. జెన్నీ ఇంట్లోనుంచి పారిపోతుంటే పట్టుకొని తీసుకు వస్తున్నాను. నువ్వు సమయానికి వచ్చావ్. ఇందాకటినుంచి నా ప్రాణాలు పోతున్నాయ్" అసలే కన్‌ఫ్యూజ్ అయిన డాన్‌ని మరింత కన్‌ఫ్యూజ్ చేశాడు షాడో.

"అయితే లారీలలోవున్న బ్రాందీబాటిల్స్ పగలకొట్టటం మాటేమిటి? మీ వాన్ మీదవున్న మిషన్స్ ఎమిటి?" ప్రశ్నించాడు డాన్.

తాము వేసుకున్న పథకం ప్రకారం డాన్‌ని యింకా కన్‌ఫ్యూజ్ చేసి నిలబెట్టడానికి వీలులేదని గ్రహించాడు షాడో. ముఖేష్‌కి కావలసిన టైం అయిపోయింది. ఇక అతను కల్పించుకోకపోతే తామిద్దరూ సూప్‌లో పడతారు.

"అదీ... అదీ" అని డాన్ ప్రశ్నకు సమాధానం యివ్వబోయాడు.

ఒక్కసారిగా ఆ నిశ్శబ్ద నిశీధి గన్ మోతలతో దద్దరిల్లి పోయింది రోడ్డుకు రెండు పక్కలనుంచీ గన్ పేలుళ్ళు వినిపించసాగాయి.

వేన్ చుట్టూవున్నవారు ఖంగారుగా పడిపోయారు. డాన్ ఆర్డర్ యివ్వగానే. ఒక్కగంతులో పోయి రోడ్డు పక్కవున్న పొదలచాటున చేరి, మోతలు వినిపిస్తున్న వైపు గన్స్ గురిపెట్టారు.

ఇక తాము బయలుదేరవలసిన క్షణం సమీపించిందని గ్రహించి డాన్ వైపు చూశాడు షాడో. అతను గన్ అలాగే షాడో మీదికి గురిపెట్టివుంచి చుట్టూ చూస్తున్నాడు. నెమ్మదిగా చేతిని డోర్ హేండిల్ దగ్గిరికి పోనిచ్చాడు షాడో. శబ్దం కాకుండా దాన్ని తిప్పి బలంగా డోర్ ఓపెన్ చేసాడు రెండవ చేత్తో మిషన్ గన్ బేరెల్ పట్టుకొని గుంజాడు.

డోర్ వచ్చి కడుపులో పొడుచుకునేసరికి బాధతో మెలికలు తిరుగుతూ కిందపడ్డాడు డాన్. వెంటనే వాన్ స్టార్టయింది. పొదలలోకి పోతున్న వారు వెనుతిరిగి చూసేసరికి ఆ ప్రదేశం వదలి ముందుకు దూసుకుపోయింది.

అక్కడికి అరఫర్లాంగు దూరంలో రోడ్డుమీద వున్నాడు ముఖేష్. వాన్ స్లో కాగానే ఎగిరి ఎక్కి కూర్చున్నాడు.

యాక్సిలేటర్ బలంగా నొక్కాడు షాడో. మార్గం నుంచి గన్స్ పేలుళ్ళు యింకా వినిపిస్తూనే వున్నాయి.

"ముఖేష్ వాళ్ళందరూ ఎవరు? ఎక్కడనుంచి వచ్చారు?" తమకు సహాయం చేస్తున్నవారిని గురించి అడిగింది జెన్నీ.

"వాళ్ళు ఎవరో, కాదు జెన్నీ వీళ్ళు" అంటూ ఎయిర్ బాగ్‌లో నుంచి "ఫైర్ వర్క్స" పాకెట్ తీసి చూపించాక ముఖేష్.

"సీమటపాకాయల్లా అవి ఎక్కడా సంపాదించావ్?" ఆశ్చర్యంగా అడిగాడు షాడో. "విత్ కాంప్లిమెంట్స్ ఫ్రం స్పెషల్ ఫోర్స్ ." చిరునవ్వుతో అన్నాడు ముఖేష్. చీకట్లను పారద్రోలుతూ ముందుకు సాగింది వాన్.

★ ★ ★

మండుతున్న కళ్ళతో రోడ్డు మీద దృష్టిని వుంచటానికి విఫలప్రయత్నం చేస్తున్నాడు షాడో.

ముఖేష్, జెన్నీ – యిద్దరూ ఏదో ఎల్లక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ గురించి మాట్లాడుకుంటున్నారు. ముఖేష్ చేతికి వున్న వాచీని తీసుకొని అందులోవున్న మినీ ట్రాన్స్‌మీటర్‌ని పరీక్షిస్తోంది జెన్నీ.

"మీ సైంటిస్టులు చాలా ఎఫిషియంట్ ఫెలోస్.... వెరీ బ్యూటిఫుల్ అరేంజ్‌మెంట్" అని కామెంట్ చేస్తున్నది.

అప్పుడే వాచ్ లోనుంచి చిన్న శబ్దం వినవచ్చింది. వెంటనే జెన్నీ చేతుల్లోంచి దాన్ని అందుకొని బటన్ సవరించాడు ముఖేష్.

"హల్లో స్పెషల్ ఫోర్స్ టు డ్రాగన్... ఆర్ యూ హియరింగ్ మీ?" అందంగా అడిగింది ఆ మృదు మధురస్వరం.

"యస్ డ్రాగన్ నెంబర్ టూ హియర్. వాటీజ్ ది మాటర్ బేబీ?" అన్నాడు ముఖేష్. "మీ బాస్ దగ్గిర నుంచి మెస్సేజి వచ్చింది. స్టాండ్ బై" అన్నదామె.

మరుక్షణం గుర్రుగుర్రుమని శబ్దం వినవచ్చింది వాచ్ లోనుంచి.... రెండు క్షణాల తరువాత కులకర్ణిగారి గొంతు క్లియర్‌గా వినిపించింది.

"ముఖేష్!"

"యస్ బాస్! ఏమిటి కథ" జవాబిచ్చాడు ముఖేష్

"వెరీ గుడ్... నేను స్పెషల్ ప్లేన్‌లో ఆర్మూరా వస్తున్నాను. స్పెషల్ ఫోర్స్ ఆఫీసులో నన్ను కలుసుకో అర్జెంట్" అని సర్క్యూట్ క్లోజ్ చేశారాయన. పెదవులు బిగించి, షాడో వంక చూశాడు ముఖేష్.

"ఏమిటి ముఖేష్, బ్రాందీని గురించేనా బాస్ ఖంగారు పడుతున్నది?" అడిగాడు షాడో.

"లేదు రాజూ! బ్రాందీని గురించి కాదనుకుంటున్నా. యిది రెండవ ఫార్ములానుంచి వస్తున్న డేంజర్ గురించి కావచ్చు" అంటూ జెన్నీవైపు చూశాడు ముఖేష్.

"జెన్నీని ఏం చేద్దాం? ఇక ఆటపాటలతో పనిచేయటం అయిపోయింది. ఆటో యిటో తేల్చుకోవాల్సిన తరువాత వచ్చింది" అన్నాడు షాడో.

"నన్ను గురించి మీరు బెంగపెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఐయామ్ కమింగ్ విత్ యూ. మా అంకుల్ చేస్తున్న పనులు కాబట్టి వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత నాకు కూడా వుంది. అవునూ! సెకండ్ ఫార్ములా అంటే.... సింథటిక్ కాటన్ గురించేకదూ!" అన్నది జెన్నీ.

"అవును జెన్నీ! అది ఎంత తయారు చేయబడిందో నీకు తెలుసా?"

"దాదాపు హండ్రెడ్ కిలోలు తయారు చేయబడింది స్టార్స్ లాగ తెల్లగా మెత్తగా వుంటుంది. నేను లండన్ బయలుదేరుతున్నప్పుడు... ప్లాస్టిక్ బాగ్స్‌లో పాక్ చేయటం చూశాను."

"ఐ డోన్టు లైక్ వాట్ ఐయామ్ హియరింగ్ " ఆలోచనలో పడ్డాడు ముఖేష్.

★ ★ ★

".... మిస్టర్ క్లీ మస్ట్ బి స్టాప్డ్. ఏమయినా చేయండి. అతన్ని ప్రాణాలతో బంధించినా సరే..... ప్రాణాలు తీసినా సరే.... ఏం చేయాలో మీరే ఆలోచించుకోండి" సిగార్ పోగ వదులుతూ తన ఏజెంట్ల వైపు చూస్తూ అన్నారు కులకర్ణిగారు.

"మన సైంటిస్టులు క్లీ ఫార్ములాను ఎనలైజ్ చేశారు. మొదటి ఫార్ములా మీరు చెప్పిన విషయాలను కన్‌ఫరమ్ చేస్తోంది. ప్రస్తుతం మనం భయపడ వలసినది రెండవఫార్ములా గురించి.

ఇది ఒక రకమైన సింథటిక్ కాటన్. సరైన పేరుతో పిలవాలంటే కిల్లింగ్ కాటన్ అనవచ్చు. ఒక కిలో పౌడర్‌ని సముద్రంలో వేస్తే గంట సేపటి తర్వాత గడ్డ

కట్టుకుపోయి కంప్లీట్‌గా వీటిని బ్లాక్ చేస్తుంది. ఆ తరువాత భయంకరమైన పాయిజన్‌గా ఛేంజ్ అవుతుంది.

"దాని మీదినుంచి వచ్చే గాలి చాలా ప్రమాదకరమైనదని మన సైంటిస్టులు అంటున్నారు. మొత్తం మన సముద్రాలన్నిటినీ పాడుచేయాలంటే - అటువంటి పౌడర్ వంద పౌనులు వుంటే చాలు అని తేలింది వారి పరిశోధనలలో."

"మా అంకుల్ వంద కిలోలు తయారు చేశాడే?"

అప్రయత్నంగా అన్నది జెన్నీ. ఆ గదిలో వున్న వారందరూ మాటరాక బొమ్మల్లా కూర్చుండి పోయారు. వారందరి మనసులలోనూ సముద్రంలో తేలియాడుతున్న కిల్లింగ్ కాటన్ మొదలసాగింది.

"దేర్ ఇటీజ్ రాజూ! మిస్టర్ క్లీ ఎంత త్వరగా బంధింపబడితే అంత మంచిది." అన్నారు కులకర్ణిగారు

"ఓ.కే, సార్! మాకు చేతనయింది చేస్తాం" అంటూ లేచి నిలబడ్డారు ఏజంట్లు యిద్దరూ. వారితోపాటు బయలుదేరింది జెన్నీ.

"ముందీ సంగతి అందరికీ తెలియజేసి .... ఆ బ్రాండ్‌ని ఎవరూ వాడకుండా చూస్తారు. మీకు కావాల్సిన సామానులు మన మిత్రులు సప్లయి చేస్తారు. వెంటనే పని పూర్తి చేయండి. ఐ విల్ బి హియర్ జెన్నీ!" అంటూ వీడ్కోలిచ్చారు కులకర్ణిగారు.

సరిగ్గా పదిహేను నిముషాల తరువాత ముఖేష్ వాడిన పికప్ ట్రక్ శరవేగంతో ఆల్మోరా పర్వత లోయలవైపు దూసుకుపోయింది. దానివెనుక భాగంలో రకరకాల ఆర్నమెంట్స్ పేర్చబడి వున్నాయి.

స్టీరింగ్ ముందు కూర్చుని దృష్టినంతా డ్రయివింగ్ మీదే కేంద్రీకరిస్తున్నది జెన్నీ. షాడో తాము చేయవలసిన ఎత్తులను గురించి ఆలోచిస్తున్నాడు. ట్రక్కు వెనుకభాగంలో కూర్చుండి ఆయుధాలనన్నిటినీ జాగ్రత్తగా చెక్ చేస్తున్నాడు ముఖేష్.

రోడ్డు క్రమంగా పైకి లేవసాగింది. లోడ్ గేర్ వేసి వేగం కల్గించింది జెన్నీ.

"రాజూ! సమీపిస్తున్నాం?" అని హెచ్చరించింది.

నెమ్మదిగా భవనం ముందున్న రోడ్డు మీదికి ప్రవేశించింది ట్రక్కు. ముందున్న ఐరన్ గేట్ తెరచి వుండటం గమనించి మరింత స్లోగా పోనీయసాగింది జెన్నీ.

వందగజాల దూరంలోకి వచ్చింది గేటు... ఎనభై.... ఆరవై ధన్ మంటూ పేలిందో రైఫిల్ బుల్లెట్. ట్రక్కు ఫ్రంట్ గ్లాస్‌ని పగలకొట్టింది. మీదికి విరజిమ్మబడిన అద్దం పెంకులు కళ్ళల్లో పడకుండా తలవంచుకొని నేర్పుగా ట్రక్కుని అడ్డం తిప్పి ఆపింది జెన్నీ.

వెంటనే భవనం పై భాగంలో నుంచి కంటిన్యుయస్ గన్ ఫైరింగ్ మొదలైంది. ట్రక్కు రేకులు కీచు కీచు మంటూ ప్రొటెస్ట్ చేయటం ప్రారంభించాయి.

వెనుక భాగంలో నుంచి కిందికి దూకి ముందుకువచ్చాడు ముఖేష్ "జెన్నీ! భవనంలో నుంచి బయటకు పోవటానికి దారి యిదొక్కటే కదూ?" అని అడిగాడు.

అవునని తలూపింది జెన్నీ.

"ఆల్‌రైట్ రాజూ! మనల్ని తప్పించుకొని వారెవరూ బయటికి పారిపోలేరు. వారిని తప్పించి మనం లోపలికి ప్రవేశించాలి ఆలోచించు" అంటూ ఒక రైఫిల్ అందుకోన్నాడు. దానికి టెలిస్కోప్ అమర్చబడి వుంది.

వెంటనే స్టీరింగ్ వదిలి అతని ప్రక్కనే చేరింది జెన్నీ.

"ముఖేష్ నాకూ షూట్ చేయటం వచ్చు. నన్ను ఏం చేయమంటావ్?" అని అడిగింది.

"ఆల్‌రైట్. కమాన్......" అంటూ అదమ చూపి ఆమెను ట్రక్కు లోపలికి దించాడు ముఖేష్. జేబులోంచి ఒక వైట్ హేండ్ కర్చీప్ తీసియిచ్చాడు.

బుల్లెట్స్ వారిద్దరి చుట్టూ డాన్స్ చేయసాగాయి.

"జెన్నీ! తల మాత్రం బయట పెట్టకు" అని హెచ్చరించి రైఫిల్‌ని బిల్డింగ్ వైపు గురి పెట్టాడు. అతని విజిల్ వినగానే సడన్‌గా కర్చీప్ గాలిలో వూపి వెంటనే ట్రక్కు రేకుచాటున ఒదిగి కూర్చుంది జెన్నీ.

భవనం మీద వున్నవారు ఆ కర్చీఫ్‌ని చూశారు. చూడగానే దానివైపు ఎయిమ్ చేసి గన్స్ పేల్చారు. బుల్లెట్లు ట్రక్కురేకులకు తగిలి రిప్లెక్టు అయ్యి, గీపెడుతూ నలుదిక్కులకూ చెదిరిపోయాయి.

వెంటనే భవనం మీద వెలుగులు కన్పించిన ప్రదేశంలోకి తన బుల్లెట్లను పంప్ చేశాడు ముఖేష్. అందుకు సమాధానంగా బాధతో అరిచిన అరుపు వినిపించింది. అది జెన్నీ చెవులకి సోకగానే "ఫైన్ షాట్ ముఖేష్! వెరీ ఫైన్!" అంటూ చేతిని గాలిలో వూపింది.

మరుక్షణం బిల్డింగ్ మీదినుంచి ఇంకొక గన్ పలికింది. ఆమె చేతిలో వున్న కర్చీఫ్ గాలిలోకి లేచిపోయింది. పళ్ళు కొరుకుతూ రైఫిల్‌ని అటు తిప్పి రెండు సార్లు ట్రిగ్గర్ నొక్కాడు ముఖేష్.

మళ్ళీ ఒక మూలుగు బరువైన బాడీ కిందికి దొర్లి పడిపోయిన శబ్దం విని నవ్వుకున్నాడు.

"జెన్నీ డార్లింగ్! తల కిందికి వంచుకోమని చెప్పానా? నా మాట వినకపోతే నీ బ్యూటీఫుల్ హెడ్ నిండా బుల్లెట్లు దూరుతాయి" అని హెచ్చరించాడు.

"డోంట్ వర్రీ.... బిగ్ మాన్.... ఇద్దరు పడిపోయారుగా!" అంటూ ట్రక్కు లోనే పడిన హేండ్ కర్చీప్ అందుకొని మరొకసారి గాలిలోకి వూపింది జెన్నీ.

అనుకోని ఆమె చర్యకు ఖంగారుపడ్డాడు ముఖేష్.

కిందికి దించిన రైఫిల్‌ని ఎత్తే లోగా భవనం మీదినుంచి వచ్చిన బుల్లెట్లు కందిరీగల్లా ట్రక్కు చుట్టూ ఎగరసాగాయి.

"యూ డెవిల్.....అది యిలా పడేయ్" అంటూ జెన్నీ చేతిలోనుంచి హేండ్ కర్చీప్ లాక్కున్నాడు. వెంటనే భవనం ఫస్ట్ ఫ్లోర్లో వున్న కిటికీలలో నుంచి యింకొక రైఫిల్ ప్రోటెస్టు చేసింది.

మళ్ళీ ముఖేష్ చేతిలో నుంచి లేచి గాలిలోకి పోయిందా హేండ్ కర్చీఫ్.

"కొంతలో కొంత నయం. బిల్డింగ్ మీద రైఫిల్స్ ఏమి లేవు" అని తృప్తి పడ్డాడతను.

ఈ లోపల నిశ్శబ్దంగా ట్రక్కుదిగి నేలమీద పాకుతూ ఐరన్ గేట్ దగ్గిరికి పోయాడు షాడో. వెనుక నుంచి విన వస్తున్న ముఖేష్ జెన్నీల సంభాషణలు వింటూ, గేటు ముందు భాగాన్ని జాగ్రత్తగా పరిశీలించసాగాడు.

తెల్లవారబోతున్నది – తూర్పు దిక్కు వెలుగులను విరజిమ్మటం ప్రారంభించింది. ఆ మసక వెలుగులో భవనపు ముఖద్వారాన్ని చూశాడు. షాడో బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పెద్దగా అపోజిషన్ లేనట్లే కనిపిస్తున్నది. అందరూ పైన చేరినట్లు లోపలనుంచి వినవస్తున్న శబ్దాలు తెలియచేస్తున్నాయి.

అదే ప్రకారం ముందు పైభాగాన్ని క్లియర్ చేసి తర్వాత క్రింది భాగాన్ని పరీక్షించాలని నిర్ణయించుకున్నారు. భుజానికి వ్రేలాడ తీసుకున్న "బజూకా"ను కిందికి దింపి నేలమీద నిలబెట్టాడు.

మూడు అడుగుల పొడవు, నాలుగు అంగుళాల వ్యాసం కలిగివున్న యినుపగొట్టమే బజూకా. అందులో ఒక విధమైన చిన్న చిన్న రాకెట్లను పెట్టి పేలుస్తారు. ఏటవాలుగా గాలిలోకి లేచి టార్గెట్ మీద సూటిగా దిగుతాయా రాకెట్లు

ఒక రాకెట్‌ని బజూకాలో ఇన్‌సర్టు చేసి ట్రిగ్గర్ హేండిల్‌ని గట్టిగా కిందికి నొక్కాడు. చిన్న శబ్దం చేస్తూ ముందుకు వూగింది బజూకా. దానిలో వున్న రాకెట్ పొగను విరచిమ్ముతూ పైకి లేచింది. ఏటవాలుగా బిల్డింగ్ మీదికి పోయి ఫస్టుఫ్లోర్‌లో వున్న ఒక విండోలో దూరింది "ఢన్" మంటూ. పెద్ద ప్రేలుడు వినిపించింది భవనంలో నుంచి. నల్లటి పొగలు కిటికీలలోనుంచి బైటకు రాసాగాయి.

వెంటనే మరొక కిటికీలోనుంచి ఒక మిషన్ గన్ ఫైరింగ్ మొదలు పెట్టింది. షాడో వున్న చోటికి సమీపంలో పడి దుమ్ము తెరలను రేపాయా బుల్లెట్లు. హడావుడిగా వెనక్కు జరిగాడు షాడో.

"రాజూ! మన ఎటాక్‌ని యింటెన్సిఫై చెయ్యకపోతే లాభంలేదు. బజూకా దెబ్బలకు కిటికీలు పగులుతాయి గాని గోడలు పగలవ్. చాలా సాలిడ్‌గా వున్నది భవనం" అంటూ ట్రక్కులో నుంచి చిన్న చెక్క పెట్టెను కిందికి దించాడు ముఖేష్. దానినిండా గ్రైనేడ్స్ పేర్చి వున్నాయి. జెన్నీ భుజం తట్టి చేయవలసిన పని వివరించాడు.

"జెన్నీ డార్లింగ్.... యిదుగో ... యీ పిన్ వుంది చూశావ్? దీన్ని లాగి, చేయి ఎత్తి పట్టుకో, బాబా బ్లాక్ షీప్... హావ్ యూ ఎనీ పూల్, అని దూరంగా విసిరేయ్" అంటూ చేతిలోని గ్రైనేడ్‌ని కాంపౌండ్ వాల్ మీదిగా విసిరాడు.

చెవులు చిల్లులు పడేటంత శబ్దంచేస్తూ పేలిందది. సమాధానంగా కిటికీలోంచి మిషన్ గన్ ఫైరింగ్ వారిచుట్టూ దుమ్ము రేపి వదిలి పెట్టింది.

బజూకా పక్కకు పెట్టి రైఫిల్ అందుకున్నాడు షాడో. గ్రైనేడ్ల వర్షం కురిపించసాగింది జెన్నీ!

భవనం ఏమాత్రం చెక్కు చెదరలేదు.

క్షణక్షణానికి వెలుగు అధికం కాసాగింది. వెలుగుతో పాటు భవనంలోని వారి ఎయిమ్ కూడా యింప్రూవ్ అవసాగింది.

బుల్లెట్లు మరింత సమీపంలోకి రావటం చూసి కలవర పడ్డారు స్నేహితులు యిద్దరూ.

"ఏం చేద్దాం రాజూ? వెధవలు మనమాట వినేటట్లు లేరు" అన్నాడు ముఖేష్.

సమాధానం మివ్వటానికి నోరు తెరిచాడు షాడో.

అంతలో ఆల్మోరా సిటీ దిక్కునుంచి వస్తున్న హెలీకాప్టర్‌ని చూసి ఆగిపోయాడు.

హెలికాప్టర్ బెల్లీ మీద వున్న స్పెషల్ ఫోర్స్ ఎంబ్లమ్ చూసి గంతులు వేసినంత పనిచేశాడు ముఖేష్. "ఫరవాలేదు రాజూ! మన బలగం వస్తోంది" అన్నాడు.

ఎత్తుగా ఎగురుతూ వారిని సమీపించింది హెలీకాప్టర్. కాంపౌండ్ వాల్‌కి పారలల్‌గా నడుస్తూ ట్రక్కు మీదికి రెండు బాంబులను వదిలింది. మొదటిబాంబు ట్రక్కుకు పదహేను అడుగుల దూరంలో పడి చిన్న ప్రళయాన్ని సృషించింది రెండవ బాంబు ట్రక్కుకు రెండడుగుల దూరంలో పడి పేలిపోయింది. ఆ అదటుకు వెనక్కు దొర్లుకుంటూ వచ్చింది ట్రక్కు.

ఎగిరి నేలమీద పడ్డాడు షాడో. రెండు చేతులతోనూ తలను కప్పుకుని దొర్లుకుంటూ ట్రక్కుకు దూరంగా పోయాడు.

తనతోపాటు జెన్నీ నికూడా లాగి, సమీపంలో వున్న చిన్న గుంటలోకి దొర్లాడు ముఖేష్. పేలుళ్ళ శబ్దాలు సర్దుమణగగానే తలఎత్తి పైకి చూశాడు. హెలీకాప్టర్ దూరంగా పోయింది.

ట్రక్కుముందు నాలుగు అడుగుల లోతుగల గోతులు రెండు ఏర్పడ్డాయి.

"ఈ స్పెషల్ ఫోర్స్ ఎక్కడనుంచి వచ్చిందో కాని మన అంతు చూడందే తిరిగిపోనట్లు కనిపిస్తోంది రాజూ" అన్నాడు ముఖం మీద పడిన మట్టిని విదిలించుకుంటూ.

★ ★ ★

రెండు రోజులు కష్టపడి సి.ఐ.బి. ఏజంట్ల జాడలు తీయగలిగారు లాయడ్, కుర్కీలు. ఆ రోజు షాడో వారిద్దరినీ విమానంలో సీట్ బెల్టులతో బంధించి తప్పించుకున్న దగ్గిర నుంచీ అవమానంతో కుమిలిపోతున్న వారికి అనుకోకుండా అద్భుతమైన అవకాశం వచ్చింది. జెన్నీ క్షేమంగా గ్రీన్‌లాండ్ చేరేటట్లు చూసి విమానాశ్రయంలో కాపు వేయమని వారికి ఆర్డర్లు యివ్వబడ్డాయి. వెల్బీ ప్లానుల్లో యితరులు జోక్యం కలుగచేసుకోకుండా చూడడం వారి విధి. అందుకే క్లీ భవనం మీద దాడికి పోయిన ఏజెంట్లుకు సహాయంగా బయల్దేరబోతున్న హెలీకాప్టర్‌ని చూడగానే ఆ ఆవకాశాన్ని సద్వినియోగపరుచుకున్నారు. పైలట్‌ని చంపి, మిగిలినవారు గమనించేలోగా దానితో క్లీ భవనాన్ని సమీపించారు.

గేటు దగ్గిరవున్న ఆకారాలను గుర్తుపట్టి ఎటాక్ చేయటం మొదలుపెట్టారు.

★ ★ ★

మరొక రౌండు కొట్టి ట్రక్కు వైపు వస్తున్న హెలీకాప్టర్‌ని చూడగానే, లేచి ట్రక్కుకు దూరంగా పరుగు తీశాడు షాడో. ట్రక్కులో మందుగుండు సామగ్రి చాలా వున్నది దానిమీద దాంబులు పడితే తమకు ప్రాణహాని సంభవించినా, సంభవించకపోయినా కార్యహాని జరుగుతుంది. అందుకని హెలీకాప్టర్‌ని తనవైపు తిప్పుకున్నాడు.

షాడోను గుర్తుపట్టి, వేగంగా అటువైపు తిప్పాడు లాయిడ్. మిషన్ గన్‌తో నిప్పులవర్షం కురిపించసాగాడు కుర్కీ.

ట్రక్కు రేకుల మీద రైఫిల్‌ని అనించి స్టడీగా పట్టుకుని టెలిస్కోప్ గుండా ఎయిమ్ చేశాడు ముఖేష్. టార్గెట్ క్రాస్‌ని పెట్రోల్ టాంక్ మీద నిలిపి ట్రిగ్గర్ నొక్కాడు.

ఒకసారి గాలిలోకి గెంతింది హెలీకాప్టర్. అద్దం తిరిగి ఏటవాలుగా క్లీ భవనంమీదికి పోసాగింది. టెలిస్కోపులో చూస్తూ రైఫిల్‌తో ఫాలో అయాడు ముఖేష్. హెలీకాప్టర్‌లో వున్న వ్యక్తి ఒకడు పెద్దబాంబును కిందికి వదలటానికి ప్రయత్నిస్తూండటం చూసి, మరొక్కసారి ట్రిగ్గర్ నొక్కాడు. బాంబును కిందికి వదలకుండానే విరుచుకు పడిపోయాడా వ్యక్తి. ఫ్యూజ్ రిలీజ్ చేసిన బాంబు హెలీకాప్టర్‌లోనే పడిపోయింది. నిప్పులు వెదజల్లుతూ పేలిపోయింది.

పది అడుగులు పైకిలేచి, సరాసరి భవనం మీదికి పోయి కూలిపోయింది హెలీకాప్టర్. దాని పేలుడు మోతకు ఆల్మోరా పర్వాతాలు కూడా దద్దరిల్లిపోయాయి.

నల్లటిపొగ సుడులు తిరుగుతూ పైకిలేచింది. పొగతో పాటు భవనం అంటుకొని అగ్ని జ్వాలలు నాలుగు మూలలకు వ్యాపింప సాగాయి.

"హోర్సెస్.... హోర్సెస్.....!" అని పిచ్చిగా అరుస్తూ ట్రక్కు చాటునుంచి బయటికి వచ్చి భవనంలోకి పరుగుతీసింది జెన్నీ.

ఆమెను ఆగమని హెచ్చరించి ప్రయోజనం లేదనుకుంటూ రైఫిల్‌తో కవరింగ్ ఫైర్ ఓపెన్ చేశాడు ముఖేష్. కిటికీల దగ్గిర వున్న వారిని కిందికి చూడనీయకుండా బుల్లెట్ల వర్షం కురిపించసాగాడు.

కిందికి వదిలిన బజూకా అందుకొని ఒకదాని తర్వాత ఒకటిగా రాకెట్లను వదలసాగాడు షాడో. వారి ధాటికి బిల్డింగులోని వ్యక్తులు తట్టుకోలేక పోయారు.

ఉన్నట్లుండి ముఖద్వారం తెరుచుకున్నది. పొడుగాటి కర్రకు కట్టిన వైట్ హేండ్ కర్చీఫ్ గాలిలో వూగుతూ బయటకు కన్పించింది.

గన్ ఫైరింగ్ ఆగిపోయింది.

"ఆల్ రైట్.... చేతులెత్తి బైటికి రండి" అరిచాడు షాడో.

ముఖేష్ రైఫిల్ భుజంమీద వేసుకొని గేటు దగ్గరికి పరుగుతీశాడు. వరుసగా బయటికి రాసాగారు మిస్టర్ క్లీ అనుచరులు అందరూ వారిని హేండిల్ చేయ్యమని షాడోకు సైగచేసి, జెన్నీ పోయినవైపు పరుగు తీశాడు.

పొగలు రేగుతున్న చెక్కలతో రాతి ముక్కలతో భయంకరంగా వున్నది కాంపౌండ్ అంతా. భవనం పక్కనుంచి పరుగుతీసి, వెనకవున్న షెడ్లను చేరుకున్నాడు. అప్పటికే అగ్నిజ్వాలలు వాటిని కబళించటం ప్రారంభించాయి. వాటి లోపలవున్న రేస్ హార్సులు భయంతో – గట్టిగా సకిలిస్తున్నాయి.

ముఖేష్ రైఫిల్ అవతలకు విసిరి చేతులతో ముఖం కప్పుకొని లోపలకు దూకాడు. గుంజలకు కట్టివున్న గుఱ్ఱాలను వదిలించి పక్కకు నిలబడ్డాడు. భయంతో చిందులు వేస్తున్న ఆరు గుర్రాలు వెంటనే బయటకు పరుగుతీశాయి.

"ముఖేష్ యింకొకటి మిగిలిపోయింది..... సిల్వర్! సిల్వర్!" అని అరిచింది జెన్నీ.

ఆమె కంఠం విని యింకా లోపలవున్న పార్టిషన్‌లో నుంచి గట్టిగా సకిలించిందొక గుర్రం.

గుండెలనిండా గాలి నింపుకుని, రేగుతున్న పొగలమధ్య గుండా అటువైపు పోయాడు ముఖేష్. చివరగావున్న స్టాల్‌లో నల్లటి జాతిగుర్రం నిలబడివుంది. ఎవరో దాని మీద జీనుచేసి కళ్ళెం బిగించి వుంచారు. కళ్ళెపు కొనలు పార్టిషన్ గోడలకువున్న యినుపరింగుకు కట్టబడివుండటం వల్ల కదలలేక దీనంగా సకిలిస్తోందా అశ్వం.

తడబడుతున్న చేతులతో కళ్ళెపు ముడిని విప్పాడు ముఖేష్. దాని మేను తట్టి ద్వారం వైపు చేయివూపాడు. కళ్ళెం వదులు కాగానే పరుగు అందుకుంది సిల్వర్ షెడ్‌లో నుంచి బయటపడి గేటువైపు దూసుకుపోయింది.

పొగమూలంగా ఉక్కిబిక్కిరై దగ్గుతూ, దానివెనుకనే పరుగెత్తుకుంటూ వచ్చారు ముఖేష్ జెన్నీ. వారు గేటును సమీపించేసరికి బయటికి వచ్చిన వారందర్నీ బంధించి రెడీగా వున్నాడు షాడో.

షెడ్‌లో నుంచి పారిపోయి వచ్చిన అశ్వాలు అతనికీ ప్రిజనర్స్‌కీ మధ్యగా పరుగులు తీశాయి. ఆ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకున్నాడు గఫూర్. గుర్రపు జూలు పట్టుకొని ఎగిరి ఎక్కి కూర్చున్నాడు. అతని చేతికి ఎమిలీ చేతికి కలిపి హేండ్ కప్స్ వేశాడు షాడో. అందువల్ల పరుగు తీస్తున్న అశ్వంతోపాటు

నాలుగు గజాలు పరుగు తీసింది ఎమిలీ. అతి ప్రయత్నం మీద ఆమెనుకూడ పైకి లాక్కుని అశ్వాన్ని అదిలించి మరింత వేగంగా పరుగు తీయించాడు గఫూర్.

వారినే చూస్తూ నిలబడ్డ షాడో, సిల్వర్ తన పక్కనుంచి పరుగుతీయటంతో అదిరిపడి కిందికి దొర్లాడు. వెనుకే వచ్చిన ముఖేష్ ముందుకు గెంతి సిల్వర్ కళ్ళెంను అందుకొని దాన్ని నిలుపుచేశాడు.

వంటికి అంటుకున్న దుమ్ము దులుపుకుంటూ లేచి సిల్వర్‌ని అధిరోహించాడు షాడో. ముఖేష్ దగ్గిరి రైఫిల్‌ని అందుకొని కాలి మడమలతో సిల్వర్ తొడలమీద పొడిచాడు. పెద్దగా సకిలిస్తూ పరుగు అందుకుందా జాతిగుర్రం.

"రాజూ! ఎమిలీని ప్రాణాలతో పట్టుకో. ఆమెవల్ల చాలా ప్రయోజనం వుంది" అని అరిచాడు ముఖేష్.

షాడో సిల్వర్ పరుగుకు అలవాటు పడటానికి రెండు నిముషాలు తీసుకుంది. దాని కదలికకు అనుగుణంగా కదులుతూ, రైఫిల్ ని బాలెన్స్ చేసి ఎత్తి పట్టుకున్నాడు.

ముందు పరుగుతీస్తున్న అశ్వం పొదల జోలికి పోకుండా పచ్చటి మైదానంలో అడుగుపెట్టింది. తను రైఫిల్ పేల్చినందువల్ల గఫూర్ గాని ఎమిలీగాని మరణిస్తారని వెనుకాడలేదు షాడో – గురితప్పి నోరులేని జంతువుకు తగులుతుందేమో అని తటపటాయించ సాగాడు.

వందగజాలు ముందు బయలుదేరినా ఇద్దర్నీ మోస్తూండటంవల్ల త్వరగానే అలసిపోయిందా అశ్వం. దాన్ని కాలిమడమలతో కొట్టి మరింత పీడించ సాగాడు

గఫూర్. కోపంతో గట్టిగా సకిలించి, ఎదురుగావున్న కొండగుట్టమీదికి పరుగుతీసింది.

వాళ్ళు కొండగుట్ట పైభాగం చేరి ఆగటం గమనించి సిల్వర్‌ని కళ్ళెం బిగించి నిలిపాడు షాడో. కిందికి దిగి రైఫిల్ జీనుకి ఆనించి ఎయిమ్ చూసి ట్రిగ్గర్ నొక్కాడు.

పారిపోయి వచ్చిన ఆశ్వం తలవంచి ఆయాసంతో రొప్పుతూ నిలబడి వుంది. కొండ గుట్టమీదికి చేరగానే ఒక గోతిలోకి దొర్లిపడుతున్న ఎమిలీ, గఫూర్‌లను చూసి గుర్రం దిగి అటు పరుగెత్తాడు షాడో.

కొండగుట్ట 'యబ్రప్ట్' గా ఎండ్ అయిపోయింది. దానికి ఇరవై అడుగుల కింద ఆకుపచ్చటి బురద గుంటవుంది. దానిలో పడిపోయారు గఫూర్, ఎమిలీలు. వెంటనే వేసుకున్న కోటును విప్పి అవతలకు విసిరేసాడు షాడో. షర్టుమీద చుట్టుకున్న నైలాన్ తాటిని వూడతీశాడు. పాంటు జేబులోవున్న ప్లాస్టిక్ గ్లోవ్స్ తొడుక్కుంటూ కిందికి చూశాడు.

గఫూర్ బురదలో దిగబడిపోయాడు. అతనిమీద పడటం వల్ల ఎమిలీ మాత్రం కొద్దిగా పైకి కనిపిస్తోంది అన్ని రకాల పరిస్థితులకూ సిద్ధపడి వారిని అనుసరించాడు షాడో. ఇలా ఊబిలో దిగబడితే ఏం చేయాలో ఆలోచించలేదు.

చుట్టచుట్టిన నైలాన్ తాటిని వదులుచేస్తూ చుట్టూ చూశాడు. దగ్గిరలో చెట్లు కాని, కనీసం తన బరువును అపగల బండరాళ్ళు గాని కన్పించలేదు. సమీపంలో నిలబడి వున్న సిల్వర్ చూడగానే దాని దగ్గిరకుపోయి తాటి కొసను జీనుకు

కట్టాడు. సిల్వర్ వెన్ను తట్టి కొండగుట్ట చివర నిలబెట్టి తాడు పట్టుకొని కిందికి జారాడు.

గఫూర్ పూర్తిగా కనిపించకుండా పోయాడు. ఎమిలీ మాత్రం సర్ఫేస్ మీద కనిపిస్తోంది. తాటిని కుడికాలి చుట్టుకుని బలవంతా దానిమీద మోపి పక్కకు అగాడు షాడో. ఎమిలీ భుజాలు పట్టుకుని పైకి లేచాడు. ఎంతో బరువు అనిపించింది ఎమిలీ.... పైకి రావడంతో వేసుకున్న గౌను చినిగి షాడో చేతిలో మిగిలిపోయింది. బురదలోకి జారిపోతున్న ఎమిలీని మళ్ళీ పట్టుపైకి లేపాడు షాడో. ఈసారి పూర్తిగా పైకి లేచింది శరీరం. కుడిచేతికి వున్న హేండ్ కప్స్ కూడా నుంచి బయటికివచ్చాయి. వాటితోపాటు గఫూర్ కూడా పైకి వచ్చింది.

ఎమిలీని భుజం మీద వేసుకుని జేబులోనుంచి చిన్న సూదిలాంటి ఇన్‌స్ట్రుమెంట్ తీశాడు షాడో. జారిపోతున్న కుడిచెయ్యికి చుట్టచుట్టుకొని, మరోసారి ముందుకు వంగాడు. అర క్షణంలో చైన్ వదులయింది. హేండ్ కప్స్‌ను బిగించివున్న తాళం తెరుచుకుని గఫూర్ చెయ్యి బురదలో పడిపోయింది. షాడో కళ్ళముందే బురదలో కూరుకు అదృశ్యమైపోయింది.

ఎంత శత్రువైనా, ఆలాంటి దుర్గతికి లోనవటం గమనించి బాధపడ్డాడు షాడో. అయినా అతను చేయగలిగింది ఏముంది? చేసిన పాపాలకు తగిన శిక్ష భగవంతుడే చేస్తాడు అన్న వాక్యాలు గుర్తుకు తెచ్చుకొని విషాదంగా నవ్వుకున్నాడు.

ఎమిలీని జారిపోకుండా పట్టుకుని సిల్వర్ వినేటట్లు విజిల్ వేశాడు.

"గో ఆన్ బాయ్... గో గో......" అని అరిచాడు. చిన్నగా సకిలించి తల విదిలిస్తూ గోతిలోకి చూసింది సిల్వర్.

మరొకసారి తన మాటలను రిపీట్ చేశాడు షాడో. అతని భావం అర్థం చేసుకొని మెల్లిగా నాలుగడు వేసింది సిల్వర్ .

పైకి లేస్తున్న తాటితోపాటు నాలుగు అడుగులు పైకి వచ్చాడు షాడో. మరొకసారి సిల్వర్‌ని హెచ్చరించాడు.

మరో నాలుగు అడుగులు వేసిందా ఆశ్వం.

ఐదు నిముషాల తర్వాత అలసిపోయిన శరీరాన్ని మీదికి చేర్చాడు. ఎమిలీని పచ్చగడ్డిలో పడుకోబెట్టి బీట్స్ గమనించాడు. ఆమెకు ఎటవంటి ప్రాణహనీ లేదు. గుట్ట మీదినుంచి కిందికి దొర్లటంవల్ల భయంతో స్పృహ కోల్పోయింది – అంతే!

"ఎమిలీ!.... ఎమిలీ!" అంటూ బుగ్గల మీద తట్టి పిలిచాడు.

కొంచెం కదిలింది గాని, కనులు తెరిచి చూడలేదు. ఉన్నట్టుండి ముందుకు వంగి, ఆ ఎర్రటి పెదవులు మీద గట్టిగా ముద్దుపెట్టాడు. ఆ స్పర్శకు పూర్తిగా తెలివితెచ్చుకున్నది ఎమిలీ. బలవంతంగా పెనగులాడి విడిపించుకుంది. దూరంగా జరిగి కూర్చున్నాడు షాడో.

కళ్ళు తెరిచి చుట్టూ చూసిందామె. తన వంటివైపోసారి చూసుకున్నది. వెంటనే జరిగింది గుర్తుకువచ్చి భయంతో వణికిపోయింది. ఆమె ఫీలింగ్స్ జాగ్రత్తగా వాచ్ చేస్తున్న షాడో ముందుకు జరిగి బుజాలు పట్టుకున్నాడు.

అతన్ని కౌగిలించుకొని పెద్దగా ఏడ్వసాగింది. మాట్లాడకుండా అలాగే విగ్రహంలా కూర్చుండిపోయాడు షాడో. పది నిముషాల తర్వాత తనను తానే కంట్రోలు చేసుకొని దూరంగా జరిగింది ఎమిలీ.

"ఇంత జరిగినా.... నన్ను.... నన్నెందుకు రక్షించావ్?" అవి అడిగింది. షాడో అందించిన హేండ్ కర్చిఫ్‌తో కనులు తుడుచుకుంటూ.

"ఎమిలీ! అటువంటి సిల్లీ క్వశ్చన్స్‌కి సిల్లీ ఆన్సరే యివ్వాల్సి వస్తుంది. నీలాంటి అందమైన యువతి అలా దారుణంగా మరణించడం యిష్టంలేక రక్షించాను...." అన్నాడు.

"ప్రస్తుతం..... అంత అందంగా లేను కదా," పూర్తిగా చేరుకొని తన అవతారాన్ని చూసుకుంటూ అన్నది ఎమిలీ.

"పోయి స్నానం చేసిన తర్వాత ఆ ప్రశ్న అడుగు... సమాధానం యిస్తాను" అని లేచి నిలబడ్డాడు షాడో.

"మిష్టర్ షాడో! నా మీద జాలితో ప్రాణాలు కాపాడావ్ అనుకున్నాను. కానీ నన్ను కాపాడింది.... తీసుకు పోయి అఫీషియల్స్‌కి వప్పచెప్పటానికే కదూ?"

"వెల్ ఎమిలీ! నీ ఇరవై సంవత్సరాల జీవితంలో చాలా తప్పులు చేసావ్. మీ అంకుల్ చేస్తున్న పని 'చెడ్డది' అని తెలిసి కూడా అతనితో పాటు ఆ పనుల్లో పాలు పంచుకున్నావ్. కిల్లర్స్ గాంగ్‌తో అతన్ని కలపటానికి శక్తి వంచన లేకుండా కృషి చేశావ్. నేను శాంతి భద్రపడే కాపాడవలసిన బాధ్యతగల వ్యక్తిని. 'న్యాయం' చేతిలో ఒక ఇన్‌స్ట్రుమెంట్ లాంటి వాడిని. ఈ పరిస్థితుల్లో కర్తవ్యం ఏమిటో నువ్వే యోచనచేసి చెప్పు" అన్నాడు సిల్వర్ జీనుకు కట్టిన తాటిని చుట్టలు చుడుతూ.

"యువార్ రైట్, మిస్టర్ షాడో! తెలివి తక్కువగా అన్నానా మాట. చిన్నతనం నుంచీ మా అంకుల్ నన్ను ఎంతో గారాబంగా చూసేవాడు. అందుకే ఆయనంటే నాకు ఎంతో యిష్టం! అంకుల్‌కి సంతోషం కలిగించే పనిచేసేదాన్ని. కాని... కాని..... లాస్ట్ నైట్ ..." అని ముఖం రెండు చేతుల్లో దాచుకొని మరొకసారి విలపించటం ప్రారంభించింది ఎమిలీ.

"ఏమయింది ఎమిలీ... లాస్ నైట్ ఏమయింది?.... తాటిని కిందకు వదిలి ఆమెను సమీపించి అడిగాడు షాడో.

"రాత్రి అంకుల్ డాక్టర్ వెల్బీ యిద్దరూ పారిపోయాడు నన్ను తమతోపాటు తీసుకు పోతామని చెప్పి, అఖరి మోసంచేసి పోయారు పోతూ – పోతూ అంకుల్ ఏమన్నాడో తెలుసా?

" 'గఫూర్! నీ అజాగ్రత్త వల్ల జెన్నీ పారిపోయి యింత గొడవ జరగటానికి కారకురాలయింది. ఈ పిచ్చిది కూడా అలాగే పోకుండా జాగ్రత్తగా చూసుకో! అవసరం అనుకుంటే అడ్డు తొలగించుకో!' అంటూ వెళ్ళిపోయాడు" ఆపి మరింత బిగ్గరగా ఏడ్పు సాగించింది ఎమిలీ.

"అందుకే – అవకాశం చూసుకొని పారిపోదామని సిల్వర్‌కు జీను వేసి సిద్ధం చేసి వుంచాను. ఇంతలో మీరు ఎటాక్ చేశారు."

ఆమె బాధను అర్థం చేసుకొని సానుభూతి చూపగల హృదయం షాడోది. కాని అన్నింటికంటే క్లీ, వెల్బీలు పారిపోయారని విని ఖంగారు పడ్డాడు. ఆ ఖంగారులో ఎమిలీ జీవిత చరిత్ర అతని మనసుకు పట్టనే లేదు.

"ఎప్పుడు పారిపోయారు ఎమిలీ? ఎన్ని గంటలకు?" జేబులో నుంచి పెన్ తీస్తూ అడిగాడు ఆత్రుతగా.

"మీరు యింకో గంటకు వస్తారనగా వెళ్ళిపోయారు..." సమాధానం యిచ్చిందామె.

కాఫ్ మీద వున్న బటన్ నొక్కి పెద్దగా పిలిచాడు షాడో "హాల్లో! ముఖేష్ ఆర్ యూ హియరింగ్ మీ?"

ముఖేష్ జవాబు క్షణంలో వచ్చింది. అతను గూడా ఖంగారుపడుతున్నట్లు అతని కంఠం తెలియ చేస్తున్నది.

"బాడ్ న్యూస్ రాజూ" మన క్లీ తప్పించుకున్నాడు.... భవనమంతా గాలించాం. ఎక్కడా కన్పించలేదు. అతనితో పాటు వెల్బీ కూడా మాయమైనాడు."

"అదేమాట ఎమిలీ కూడా అన్నది జస్ట్.... కొద్దిసేపటికిందే ఆమెను ఊబిలో నుంచి పైకి లాగాను. గఫూర్ యిక మనలో లేడు. సుమారు రెండు గంటల క్రితం పారిపోయాట్ట క్లీ!......" అంటూ పెన్ మూసి ఎమిలీని లేవతిపాడు షాడో.

సిల్వర్ జీను మీద ఆమెను ఎక్కించి. తను వెనుక ఎక్కి కూర్చున్నాడు. అతని మనసు గ్రహించినట్లు వేగంగా గాలప్ తీయసాగింది సిల్వర్.

"ఎమిలీ! నువ్వు చేసిన పనులకు విష్కృతి లభించాలి అంటే – మాకు సహాయం చేయడం మంచిది. నీ అంకుల్ సంగతి నీకు బాగా తెలుసు. అతని స్థావరాలు ఎక్కడెక్కడ వున్నాయో తెలిసే వుంటుంది. ఇప్పుడు ఎక్కడికి పోయాడో ఊహించగలవా?" అని ప్రశ్నించాడు.

తన ఫేట్‌ని గురించిన ఆలోచనలో వుండి వెంటనే సమాధానం యివ్వలేక పోయింది ఎమిలీ. భుజం తట్టి మరొకసారి అడిగాడు షాడో.

"ఇంకెక్కడికి పోతాడు? యిక్కడికి సమీపంలో వున్నది ఫాక్టరీ ఒకటే. అందులో వున్న లేబరేటరీకి పోయి వుంటాడు."

ఆ మాత్రపు ఆలోచన చేయలేని తన మంద బుద్ధికి నిందించుకుంటూ పెన్ అందుకున్నాడు షాడో.

"ముఖేష్ ! బాస్‌కి రిపోర్ట్ చేశావా?"

"చేశాను గురూ! మీదపడి అరిచి కరచినంత పని వేశారు – హి యీజ్ నాట్ హేపీ!"

"అయినా.... మన మిత్రులు ఫాక్టరీకి పోయివుండవచ్చని అంటున్నది ఎమిలీ హౌ ఎబౌట్ ఇట్?"

"కరెక్ట్ రాజూ. అయితే మన కొంపలు నిలువుగా తగలబడి పోతున్నాయన్నమాట!" లేబరేటరీలో క్లీ చేయబోయే పని వూహించి అన్నాడు ముఖేష్.

ఫాక్టరీ మైలు చదరపు స్థలంలో వుంది దానిచుట్టూ బలమైన ఫెన్సింగ్ వుంది. కాపలాగా క్లీ అనుచరులున్నారు.

క్లీని అందులోనుంచి బయటకు లాగటం ఎలా? అని ఆలోచించసాగాడు షాడో.

తన ఆలోచనలనుంచి తేరుకుని అతని వైపు తిరిగింది ఎమిలీ....

"మిష్టర్ షాడో...... నాకు విధించబడే శిక్షకు భయపడటం మానేశాను.... అయినా కొంచెం భయంగానే వుంది – అది పోవటానికి..... ఇందాక యిచ్చిన ట్రీట్ మెంట్ మరొక్కసారి యివ్వవూ" అన్నది అతనికి దగ్గిరిగా జరుగుతూ.

★ ★ ★

భవనం ముందు పికప్ ట్రక్కు రెడీగా నిలబడి వుంది. స్టీరింగ్ పట్టుకొని అసహనంగా చూస్తూ షాడో రాక కోసం ఎదురు చూస్తూన్నాడు ముఖేష్. ట్రక్కు వెనుక కాళ్ళూ చేతులూ బంధింపబడి పడుకోబెట్టబడి వున్నా బంధింతులందరూ.

అలసిపోయిన సిల్వర్‌ని ట్రక్కు దగ్గిరగా ఆపి కిందికి దూకాడు షాడో.

"ఎమిలీ..... పోయి వారితో కూర్చో. యిదేమాదిరి మా ప్రశ్నలకు సమాధానాలు యిచ్చి సహాయపడితే... నీ విషయం కన్సిడర్ చేయడానికి అవకాశాలున్నాయి" అంటూ ఆమెను ట్రక్కు వెనుక కూర్చోపెట్టాడు.

అక్కడే నిలబడిన సిల్వర్‌ని వెన్నుతట్టి గేటువైపు చేయి చూపించాడు. చిన్నగా సకిలిస్తూ భవనం కాంపౌండ్ లోకి పరుగుతీసింది సిల్వర్.

"రాజూ! మన వాళ్ళకు మెస్సేజ్ పంపాను. ఫ్యాక్టరీకి పోయే దోవలో వచ్చి వీళ్ళందర్నీ పికప్ చేసుకుంటామన్నారు. సో..... మనం ముగ్గురం ఫ్యాక్టరీని ఆటాక్ చేయాలి" యింజన్ స్టార్టు చేస్తూ అన్నాడు ముఖేష్.

"ముగ్గురం... అంటే?" అని లోపలికి తొంగి చూశాడు షాడో. ముఖేష్ పక్కనే కూర్చొని వుంది జెన్నీ.

"జెన్నీ! యింతవరకూ జరిగింది చాలు నిన్ను మరిన్ని ప్రమాదాలలో దించటం నాకూ యిష్టంలేదు" అన్నాడు

"బయలుదేరాడండీ.... జీనస్ క్రైసు.... అసలు నన్ను రొంపిలోకి దించింది నువ్వు. చేసే పనేదో లండన్ లోనే చేసి... యిప్పుడు నీతులు వల్లిస్తున్నాడు మిమ్మల్ని వదిలి ఒక్క అడుగు కూడా అవతలికి పోను" మరింత కంఫర్టబుల్‌గా సర్దుకు కూర్చుంది జెన్నీ.

"అడది కాదు ముఖేష్ యిది బ్రహ్మరాక్షసి!" ఆమె పక్కన కూర్చుంటూ తెలుగులో అన్నాడు షాడో.

"ఏమంటున్నాడు?" అర్థం కాక అడిగింది జెన్నీ.

"యువ్వార్ ఎ గుడ్ గర్ల్ అన్నాడు" అని ట్రాన్స్‌లేట్ చేసి, ట్రక్కును ముందుకు పోనిచ్చాడు ముఖేష్.

★ ★ ★

"క్లీ బ్రాండ్ " బ్రాంది ఫ్యాక్టరీముందు ట్రక్కు ఆపి చుట్టూ చూశాడు ముఖేష్.

"నౌ జెన్నీ డార్లింగ్ ఫ్యాక్టరీలో ఎంత మంది వున్నారో చెప్పమ్మా!" రిక్వెస్టు చేశాడు షాడో.

"ఫ్యాక్టరీ వర్కింగ్ అవర్స్ 'పది' నుంచీ మొదలైతాయి.... ఎంతో మంది వుండరు యీ సమయంలో" అంటూ ఫ్యాక్టరీ వాచ్‌మన్స్ పేరు జ్ఞప్తికి తెచ్చుకుటూ వేళ్ళమీద లెక్క పెట్టసాగింది జెన్నీ.

"గేటు దగ్గిర యిద్దరూ... ఫెన్స్ చుట్టూ పెట్రోల్ చేయటానికి యిద్దరూ.... పవర్ హౌస్‌లో యిద్దరూ.... మొత్తం అరడజను మంది వుంటారు" అన్నది వేళ్ళు మడిచి.

"ప్లస్ మీ ఆంకుల్, పందికొక్కు వెల్బీ.... మొత్తం ఎనిమిది మంది. ఒక్కొక్కళ్ళకూ నలుగురన్నమాట!" అనుకున్నాడు షాడో.

"మనం ముగ్గురం వుంటే.... మనిషికి నలుగురు ఎట్లా వస్తారు? యూ బిగ్ అగ్లీ మగ్!" తనను లెక్కలోనుంచి తీసేసినందుకు ఆగ్రహంతో అరిచింది జెన్నీ.

ఇంతలో ఆమె మాటలు వింటూ మౌనంగా కూర్చున్న ముఖేష్ ఇంకో పాయింటు పట్టుకున్నాడు.

"పవర్ హౌస్ అంటే...."

"ఫ్యాక్టరీకి కావాల్సిన ఎలక్ట్రిసిటీ ఇక్కడే తయారౌతుంది ముఖేష్! హండ్రెడ్ కిలోవాట్లు ప్రోడ్యూస్ చేసే జనరేటర్లు రెండున్నాయి" జవాబిచ్చింది జెన్నీ.

"అయితే మనం పవర్ లైన్స్ కట్ చేస్తే అందరూ బైటికి రాక తప్పదుగా?"

"కరెక్ట్."

వెంటనే ట్రక్కును మరికొంత ముందుకు పోనిచ్చి ఫెన్సింగ్ సమీపంలో ఆపాడు ముఖేష్.

జెన్నీ అన్నట్లు గేటుముందు కాపలా ఎవరూ లేరు తమ ట్రక్కు ఫాక్టరీలను సమీపిస్తుండగా హడావుడిగా సిటీవైపు పోతున్న వ్యక్తులను గుర్తు తెచ్చుకున్నాడు షాడో బహుశా క్లీ భవనంలోవున్న టెలిఫోన్ పనిచేసి వుంటుంది అనుకున్నాడు.

ట్రక్కులో నుంచి దిగి, వెనుకవున్న పొడుగాటి ఇనుప ఛైను అందుకొని చుట్టూ చూడసాగాడు ముఖేష్.

"ఏం కావాలి ముఖేష్?" అతని పక్కకుపోయి అడిగాడు షాడో.

"చిన్న బురదగుంట." జవాబు యిచ్చాడు ముఖేష్.

"క్లీ మీద వేయటానికా?"

"నీ ముఖానికి పూయటానికి!" అని, షాడో సమాదానం కోసం ఎదురు. చూడకుండా ఫెన్స్‌కు నాలుగు అడుగుల దూరంలో వున్న తడినేలను సమీపించాడు ముఖేష్. ఎనిమిది అడుగుల ఎత్తున వున్నది ఫెన్సింగ్. దాని మామూలు తీగెలలా కాకుండా చిటికెన వేలంత బరువుగా వున్నాయి. ప్రతి ఐరన్ పోల్ దగ్గిర పింగాణి కేసులకు చుట్టబడి వున్నాయి.

అతని అభిప్రాయం గ్రహించి షాడోకు ఎక్స్‌ప్లెయిన్ చేసింది జెన్నీ.

"అది ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ రాజూ! అందుకే అంత హడావుడి చేస్తున్నాడు."

"అది సరే. ఇంత కూ ఈ పెద్దమనిషి చేసే పని ఏమిటి?" అది విని వారి దగ్గరికి వచ్చాడు ముఖేష్.

"ఎలక్ట్రిక్ ఫెన్సింగ్‌లను ఎప్పుడైనా చూశావా?"

"చూశాను." సమాధానం యిచ్చాడు షాడో. అతని బస్సులో ఒక ఎస్సైన్‌మెంట్[3] మెదిలింది. అప్పుడు బతకంటే బలమైన ఫెన్సింగ్‌నే ఎదుర్కోవాల్సి వచ్చింది ... ఫెన్సింగే కాకుండా దానిలో వున్న వైల్డ్ యానిమల్స్‌ని గూడా దాటిపోవాల్సి వచ్చింది. ఆ సంఘటన జ్ఞప్తికి రాగానే అప్రయత్నంగా అతని వళ్ళు జలదరించింది."నాట్ ఫర్ మీ... ఈ ఫెన్సింగ్‌ల జోలికి పోదలుచుకోలేదు" అన్నాడు.

---

[3] ఈ సంఘటన మధుబాబు రచన 'మిషన్ ఫర్ కిడ్నాపింగ్'లో వివరించ బడింది.

"ఐరన్ పోల్స్ చుట్టూ సింగాణీ తొడుగులు ఎందుకు పెట్టారు?" అతని మాటలు వినిపించుకోకుండా డిమాండ్ చేశాడు ముఖేష్.

"కరెంట్ పోల్స్ ద్వారా భూమిలోకి పోకుండా" షాడో తరపున జవాబిచ్చింది జెన్నీ.

"కరెక్టు... చిన్న సందు దొరికితే భూమిలోకి పారిపోతుందా డార్లింగ్ ఎలక్ట్రిసిటీ. ఇప్పుడు చిన్న సందు కాదు, పెద్ద రాజ మార్గమే చూపించబోతున్నాను" అంటూ చేతిలో వున్న చైన్ ఒక చివరను తడి నేలలోకి తొక్కాడు ముఖేష్ రెండవ కొసను ఎత్తి పెన్సింగ్ మీదికి విసిరాడు.

గాలిలోకి లేచి పెనున్న రెండు తీగలమీదపడి చుట్లుకు పోయింది ఐరన్ చైన్. మరుక్షణం కనులు మిరుమిట్లు గొలిపే ప్లాష్ కనిపించింది ఒక కాలు యింకా తడి నేల మీదే వేసి వున్న ముఖేష్ ఎగిరి అవతల పడ్డాడు.

దూరం నుంచి విన్పిస్తున్న జనరేటర్ ఒక్కసారిగా ఆగిపోయింది. వెంటనే ఎమర్జన్సీ అలారమ్స్ మోగసాగాయి. స్టీం నింపుకుంటున్న ఫాక్టరీ బాయిలర్స్ పని చేయటం ఆగిపోవటంవల్ల పెద్ద మోతలుతో స్టీంని బయటకు వదిలివేయసాగాయి.

ఎంతో ప్రశాంతంగా వున్న ఫాక్టరీ ఆవరణ ఆ మోతలతో హోరెత్తిపోయింది.

తగిలిన షాక్‌తో దిమ్మర పోయిన ముఖేష్‌ని ట్రక్కులో కూర్చోపెట్టి వెంటనే ఫాక్టరీ గేటు దాటించి లేబొరేటరీల వైపు పోనిచ్చాడు షాడో.

ట్రక్కు లేబరేటరీ ముందు ఆగబోయే క్షణంలో దూరం నుంచి వారిమీద ఫైరింగ్ మొదలయింది. అప్పటికి పూర్తిగా కోలుకున్నాడు ముఖేష్. షాడోను

ఎటాకర్స్ సంగతి చూసుకోమని ట్రక్కు దిగి లోపలికి పరుగు తీశాడు . లేబరేటరీ తలుపులన్నీ బార్లా తెరిచి వున్నాయి. పురుగు కూడా లోపల లేదు.

కారిడార్ లోనుంచి పరుగెత్తి – క్లీ పర్సనల్ లేబరేటరీ దగ్గరికి పోయాడు. దాని తలుపులు బంధించి వున్నాయి. వెంటనే జేబులోనుంచి చిన్న ప్లాస్టిక్ బాంబు తీసి డోర్ తీసుకు ఎటాచ్ చేశాడు. నాలుగు అడుగులు వెనక్కు వేసి తన రివాల్వర్‌తో దాన్ని డిటనేట్ చేశాడు.

పొగలు విరజిమ్ముతూ పగిలిపోయాయి తలుపులు. మీద నుంచి ఎగిరి లోపలకు తొంగి చూశాడు. లోపల లేరు. అంతా ఖాళీగా వున్నది ట్రక్కుమీదనుంచి రైఫిల్ తీసుకుని అక్కడకు వచ్చి చేరింది జెన్నీ. "ఎవరూ లేరూ డార్లింగ్. పిట్టలు పారిపోయినట్లున్నాయి. జాగ్రత్త..... అది ఆటోమాటిక్ రైఫిల్. నా వైపు పెట్టకు" అంటూ కారిడార్ లోకి వచ్చాడు ముఖేష్.

ఆమె సహాయంతో బిల్డింగ్ నంతా క్షుణ్ణంగా పరీక్షించి క్లీ – వెల్బీలు తమకు టోకరా యిచ్చారన్న సంగతి తెలుసుకొని తిరిగి ముఖద్వారం దగ్గిరికి వచ్చాడు.

బయట ఫైటింగ్ జోరుగా నడుస్తున్నది. ట్రక్కులో మంచి బయటకు రాకుండా రైఫిల్‌తో ఎటాకర్స్‌ని నిలబెట్టి ఆపడానికి తంటాలు పడుతున్నాడు షాడో.

లోపలే నిలబడి కులకర్ణిగారిని కంటాక్టు చేశాడు ముఖేష్.

"ప్లాంట్ లేబరేటరీలో వున్నాం సార్! క్లీ వెల్బీలు పారిపోయారు."

"ఐ.సీ.... యిప్పుడు వారిని వెతికి పట్టుకోవటం ఎలా? ఎక్కడని వెతుకుతాం?"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను సార్!"

"ముఖేష్!... డాలీ.... డాలీ దగ్గరికి పోయి వుండచ్చు" సడన్‌గా అడిగింది జెన్నీ.

"వాట్? డాలీ దగ్గిరా? అంటే!"

"డాలీ.... అంకుల్ బోటు పేరు."

"ఎక్కడ వుందది?"

"గ్రీన్ కెనాల్‌లో అంకుల్కి చిన్న హార్బర్ వుంది. అక్కడే వుంటుందది."

"అంటే ఆల్మోరా సిటీలోనే!"

"కరెక్ట్"

వెంటనే మళ్ళీ తన వాచ్ వైపు చూశాడు ముఖేష్. "విన్నారా సార్? డాలీ అనే బోటు...."

"విన్నాను ముఖేష్! మీరు వెంటనే గ్రీన్ కెనాల్ దగ్గిరికి రండి. అక్కడ కలుసుకుంటాను" అని సర్క్యూట్ కట్ చేశారు కులకర్ణిగారు.

వాచ్ బటన్ యధాస్థానంలోకి నొక్కి పెడ్తూ బయటికి తొంగి చూశాడు ముఖేష్ తల మీదనుంచి ఒక బుల్లెట్ దూసుకు పోవటంతో వెనక్కి గెంతి, తలుపు చాటున నిలబడ్డాడు.

"రాజూ! మన పని అయిపోయింది. ఇక బయలు దేరటం మంచిది" అని కేక వేశాడు అక్కడే నిలబడి.

"ఆ పని ఎంత త్వరగా చేసే అంత మంచిది! ఈ గ్రీన్‌లాండర్స్ నా ప్రాణాలు తోడేస్తున్నారు. అసలు పుట్టటమే వీళ్ళు గన్స్ చేతుల్లో పెట్టుకొని పుడ్తారనుకుంటాను" గ్రీన్‌లాండ్ మీద వున్న అక్కసు వెళ్ళగక్కాడు షాడో.

వెంటనే లేబరేటరీలోకి పోయి రెండు తెల్లటి సీసాలు పట్టుకు వచ్చాడు ముఖేష్. షాడోను హెచ్చరించి, వాటిని ఎదురుగా వున్న బిల్డింగ్ లోకి విసిరాడు అవి బిల్డింగ్‌ని సమీపిస్తున్న తరుణంలో రైఫిల్‌తో పగలగొట్టాడు షాడో. వాటిలో బిగించబడి వున్న అమ్మోనియా ద్రావణం నలుపక్కలకూ విరజిమ్మబడింది.

ఆ ఘాటైన వాసనను తట్టుకోలేక ముక్కులు మూసుకుని బిల్డింగ్ లోకి పారిపోయారు ఎటాకర్స్. అది చూసి వెంటనే బయటికి వచ్చి ట్రక్కు ఎక్కారు ముఖేష్, జెన్నీలు.

రింగ్ అందుకొని ట్రక్కుని టైట్ సర్కిల్లో వెనక్కి తిప్పాడు షాడో. యాక్సిలేటర్ని బలంగా నొక్కి ఫాక్టరీ గేటులోనుంచి పోనిచ్చి రోడ్డు ఎక్కించాడు.

క్లీ బోటులో పోయి వుండొచ్చన్న విషయం వారిని కలవర పరచసాగింది. గ్రీన్ కెనాల్ సరాసరి సముద్రం లోకి పోవటానికి ఎటువంటి అటంకమూ వుండదు. అతన్ని పట్టుకోవాలంటే అతని దగ్గిర వున్న కిల్లింగ్ కాటన్‌ని ఎదిరించి నిలువగలగాలి! అది అతని దగ్గిర వున్నంతకాలం ప్రపంచమంతా కలిసి కట్టుగా ఎదురించినా ప్రయోజనం వుండదు.

"ఆ కాటన్ సముద్రంలో పడేస్తాడంటావా?" అడిగాడు షాడో.

"ఇక్కడ పడవేయక పోవచ్చు. మొదటి నుంచి గ్రీన్‌లాండర్స్‌తో బ్రిటీష్‌కి పడదు. ఆజన్మ విరోధులు వారిద్దరూ. క్లీ కూడా ఒక గ్రీన్‌లాండరే. అందువల్ల బ్రిటన్ మీదికి దండెత్తవచ్చని నా అభిప్రాయం" అన్నాడు ముఖేష్.

"ఆ కాటన్‌ని ఆపే మార్గం ఏమైనా వుందా?" మరొకసారి ప్రశ్నించాడు షాడో. "కొద్దిపాటి మార్గం వుంది రాజూ ! ఈ విషయం క్లీ నోట్ బుక్‌లో రాసి వుంది. కిల్లింగ్ కాటన్ పనిచేయటం ప్రారంభించిన ప్రాథమిక దశలో..... అది పడినచోట ఆయిల్ పోస్తే ఆగిపోతుంది. హై టెంపరేచర్‌లో కూడా అది పనిచేయదు" సజెస్ట్ చేసింది జెన్నీ.

"మరి....... మనం ఆర్కిటిక్ సముద్రం క్రింద కట్టెలు పేర్చి వేడిచేయాలి కాబోలు ఏం" అని గొణిగాడు.

"నాకు తెలిసింది చెప్పాను.... యూ .... యూ...."

"బిగ్ అగ్లీ...... మంకీ" అని అందించి ఆమె చాటున దాగుకొని షాడో దెబ్బనుంచి తప్పించుకున్నాడు ముఖేష్.

★ ★ ★

గ్రీన్ కెనాల్ ఓవర్ బ్రిడ్జి దగ్గిర నిలబడివున్న కులకర్ణి గారిని చూడగానే సడన్ బ్రేక్ వేసి పికప్ ట్రక్కును ఆపారు షాడో.

"...... రాజూ! క్లీ మరోసారి మనకు మస్కాకొట్టి తప్పించుకున్నాడు మీ కోసం ఒక మోటార్ బోటు ఎరేంజి చేయించాను. వెంటనే బయలు దేరండి...." హృదయంలో చెలరేగుతున్న ఆందోళనను కప్పిపుచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ అన్నారాయన.

రెండు నిముషాలు తమకుకావల్సిన ఎక్విప్‌మెంట్ సరిచూసుకుంటూ గడిపి రేవు దగ్గిరికి పరుగుతీశారు షాడో ముఖేష్. వారికన్నా ముందుపోయి మోటార్ బోటులో కూర్చుంది జెన్నీ.

వారు రావటం చూడగానే ఇంజన్ అన్ చేసి గయిడింగ్ వీల్ ముఖేష్ చేతికిచ్చి తప్పుకున్నాడు ఒక స్పెషల్ ఫోర్స్ మెకానిక్. మరుక్షణం వేగంగా నీటిలోకి దూసుకుపోయింది బోటు. అడ్డువచ్చిన బోట్లను అదరగొడుతూ..... సముద్రం వైపు ప్రయాణం ప్రారంభించింది. బోటు మధ్యగావున్న చిన్న కొయ్య దిమ్మను అనుకొని కూర్చున్నాడు షాడో. మూడు రోజులనుంచీ విశ్రాంతి లేకుండా తిరగటంవల్ల.... ఆఫ్టర్ ఎఫెక్ట్స్ అవహిచసాగాయి. కనులు బరువుగా మూసుకుపోయాయి.

అలాగే కూర్చుని కునికిపోట్లు పడసాగాడు. ముఖేష్ తో గయిడింగ్ వీల్ దగ్గిర నుండి ముందుకే చూస్తున్నది జెన్నీ. "డాలీ" ఆమెకు బాగా తెలుసు దాన్ని చూసిన మరుక్షణం వారిని హెచ్చరించే బాధ్యత ఆమెకు అప్పగించాడు ముఖేష్. కునికిపాట్లు పడుతున్న షాడో అంతరంగం రకరకాల ఆలోచనలు చేస్తూనే వున్నది. గ్రీన్‌లాండ్ అంటే ఎంతో అందమైన దేశం అని ఎవరూ అనుకోగా విని కాబోలు అనుకున్నాడు. లేదు, క్లీ లాంటి చీడపురుగులు అన్ని జాతుల్లోనూ అన్ని దేశాలల్లోనూ వున్నారు. అటువంటి వారిని చూసి మిగిలినవారిని తప్పుగా అంచనా వేసుకోవటం నేరం. అప్రయత్నంగా అతని ఆలోచనలు జెన్నీ, ఎమిలీల మీదికి మరలాయి. ఇద్దరూ సౌందర్య దేవతలే. కాని ఇద్దరి మనస్తత్వాలలోనూ హస్తిమశకాంతరమంత భేదం వుంది. ఎమిలీ కూడా చాలా తెలివైనదే. కాని ఆమె

తెలివి తేటలు అపమార్గాన పడి ఆమెను నేరస్థురాలి కింద మార్చివేశాయి. ఆ మాట ఎంతవరకూ నిజం? క్లీ మూలంగా తప్పుదారిన నడిచింది ఎమిలీ. అతను మోసం చేయటంతో ఆమె మానసికంగా దెబ్బతిన్నది. సరైన అవకాశం వస్తే మారుతుందా? మళ్ళీ తప్పులు చేయకుండా న్యాయమార్గాన సంచరిస్తుందా?

ఉన్నట్లుండి బోటు ఎగిరెగిరి పడడం ప్రారంభించేసరికి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు షాడో. గ్రీన్ కెనాల్ అంతమైపోయింది. బోటు సముద్రంలోకి ప్రవేశించింది. బ్రహ్మాండమైన అలలు దాన్ని ఎత్తి ఎత్తి పడేస్తున్నాయి. గట్టిగా అవలిస్తూ రైఫిల్‌ని భుజానికి తగిలించుకొని కూర్చున్నాడు షాడో. చూస్తుండగానే రెండు గంటలు గడిచి పోయాయి. సూర్యుడు నడిమింట మీదికి వచ్చాడు. ఎటు చూసినా అనంతమైన సముద్రం తప్ప మరేమి కన్పించటం లేదు. మాక్సిమమ్ స్పీడులో బోటును పోనిస్తున్నాడు ముఖేష్.

ముందుండి చూస్తున్న జెన్నీ ఒక్కసారిగా గట్టిగా అరిచింది. బోటు చేస్తున్న మోతలో ఆ అరుపు ముఖేష్‌కి మాత్రమే వినిపించింది.

బోటు లోనుంచి చెదిరి మీద పడుతున్న నీటి జల్లుకు చేయి అడ్డుపెట్టి జెన్నీ చూపించిన వైపు పరీక్షగా చూశాడు ముఖేష్.

దూరంలో ఒక పసుపు రంగు నౌక వేగంగా ప్రయాణిస్తూ కనిపించింది. అవసరం లేకపోయిన అందుకోసం అమర్చిన తెరచావ కొయ్య ఎత్తుగా కనిపిస్తుంది. నీలం రంగు తెరచాపలు... అదే రంగువేసిన కాబిన్... చూడముచ్చటగా వున్నదా చిన్న నౌక. దాన్ని వర్ణించాడు ముఖేష్.

"యస్..... అదే డాలీ.... అంకుల్ క్లీ ఫేవరెట్ బోటు" అన్నది జెన్నీ. ఆ మాట విని వారి పక్కన నిలబడ్డాడు షాడో. గయిడింగ్ వీల్ జెన్నీకి అందించి ఫ్రీగా నిలబడ్డాడు ముఖేష్. తనతోపాటు తెచ్చిన బైనాక్యులర్స్‌తో ముందున్న 'డాలీ'ని పరిశీలించ సాగాడు.

డాలీలో నుంచి ఒక పేపర్ లాంటి వస్తువు సముద్రంలో పడటం గమనించాడు. తెల్లగా వున్న పదార్థమేదో అందులో పాక్ చేయబడి వుంది.

"తెల్లగా వున్నదా?" అదిరిపడ్డారు షాడో, జెన్నీలు. "ఏం చేద్దాం, ముఖేష్" గయిడింగ్ వీల్‌ని బలంగా పట్టుకొని అడిగింది జెన్నీ.

"అటుపోనీ బోటును. దాన్ని సమీపించి అందుకోవటం కన్న వేరే మార్గం లేదు." సమాధానం ఇచ్చాడు ముఖేష్.

బోటులో వున్న చిన్నవలను పట్టుకున్నాడు షాడో. బోటు వేగాన్ని తగ్గించింది జెన్నీ. మెల్లగా నీటిలో తేలుతున్న పేపర్ బాగ్‌ను సమీపించింది బోటు.

తెల్లటి ప్లాస్టిక్ బాగ్ అది. సగంవరకూ వైట్ కలర్ పౌడర్ నింపివుంది. దగ్గరికి రాగానే నేర్పుగా వల విసిరి దాన్ని పైకి లాగాడు షాడో. అది నీటిలో తేలిన విధానం ముఖేష్ మనస్సులో అనుమానం రేకెత్తింది. దాన్ని పట్టుకొని చెవికి అనించుకున్నాడు. లోపలనుంచి టైమ్ పీస్ కొట్టుకున్నట్లు టిక్ – టిక్ మని మోత వినవచ్చింది.

వెంటనే బోటు స్పీట్ హెచ్చించమని చెప్పి.... బాగ్ వూడతీయటంలో నిమగ్నుడైనాడు. మూడు నిముషాల తరువాత బయటికి వచ్చింది చిన్న టైం బాంబ్. దాన్ని చూడగానే బలంగా నీటిలోకి విసిరాడు.

అది పేలి– సముద్రాన్ని అల్లకల్లోలం చేసేసింగి. ముప్పై అడుగుల ఎత్తున లేచిపడింది సముద్రపు నీరు.

"రాజూ! ఇంకోటి వదిలారు......" వార్నింగ్ ఇచ్చింది జెన్నీ.

మళ్ళీ బోటు వేగం తగ్గించి, నీటిలో తేలుతున్న ప్లాస్టిక్ బాగ్ సమీపంలోకి తీసుకుపోయింది.

ప్లాస్టిక్ బాగ్‌లో వున్న పౌడర్ మీద నీరు పడకుండా మళ్ళీ పాక్ చేసి, ఇంజన్ పక్కన పెట్టి మళ్ళీ వల అందుకున్నాడు షాడో.

వల విసరబోయే సమయానికి...... అలలో మాయమైందా బాగ్. ఖంగారుగా నలుమూలలకూ చూశాయి వారికళ్ళు ముఖేష్ కాలిక్యులేషన్స్ ప్రకారం ఏడు నిముషాలలో పేలుతుంది టైం బాంబు. బాగ్ నీటిలోపడి నాలుగు నిముషాలైంది.

"ఇదిగిదిగో..... యిక్కడ....." అంటూ అరిచింది జెన్నీ. వల రెడీగా పట్టుకొని అటు గెంతాడు షాడో. మరొక సారి అలల తాకిడికి మునగబోతున్న బాగ్ మీదికి విసిరాడు.

"కమాన్ ముఖేష్! గివ్ మీ ఎ హేండ్!" అని అందించాడు. దాన్ని పైకితీస్తూ ఇద్దరూ కలిసి బాగ్‌తో కుస్తీపట్లు పట్టి ఓపెన్ చేశారు. ఏడవ నిముషం పూర్తికాబోతుండగా టైం బాంబ్ బయటకు వచ్చింది దాన్ని అందుకొని బలంగా గాలిలోకి విసిరాడు షాడో నీటిని తాకకముందే గాలిలో పేలిపోయిందా బాంబ్.

మరొకసారి వేగం హెచ్చింది జెన్నీ. రైఫిల్స్ పట్టుకొని నిలబడ్డారు స్నేహితులిద్దరూ వీలైతే బాగ్‌లు సముద్రంలో వేయకుండా ఆపుదామని వారి

ఉద్దేశ్యం. వారి అభిప్రాయం కనిపెట్టినట్లు. రైఫిల్ రేంజిలోకి రాకుండా ముందుకు పోయింది డాలీ.

"మైగాడ్! రాజూ!మళ్ళీ ఇంకొకటి పడింది. దాన్ని టైంలో అందుకోలేం!" అస్పష్టంగా అన్నాడు ముఖేష్.

"జెన్నీ! ఫాస్ట్.... ఫాస్ట్....." అరిచాడు షాడో.

నిట్టనిలువుగా తేలుతూ, అలలలో వుయ్యాలలూగుతున్నదా ప్లాస్టిక్ బాగ్. వల రెడీగా పట్టుకొని బోటు చివర నిలబడ్డాడు ముఖేష్. క్షణాలు త్వరత్వరగా గడిచి పోతున్నాయి. అలలు రేపుతూ బాగ్ సమీపంలోకి చేరింది బోటు. వెంటనే ఒక్క సారి స్పీడ్ తగ్గించింది జెన్నీ. బోటు తెల్లటి మరుగుల్ని ముందుకుతోస్తూ మెల్లిగా బాగ్ పక్కకు చేరింది.

వున్నట్లుంది పక్కకు ఒరిగింది. సమీపంలో వున్న బాగ్ దాని చెక్కలకు కొట్టుకుంది. వెంటనే చెవులు చిల్లులు పడేటంత శబ్దంతో పేలిపోయింది.

పైకిలేచిన నీటితోపాటు లేచి వెనక్కు విరుచుకుపడింది బోటు. ప్రేలుడు అదటు మూలంగా అంతకుముందే గాలిలోకి లేచాడు షాడో. బోటు వెనక్కి పడుతుండగా నీటిలో పడి మునిగాడు. అతి ప్రయత్నంమీద పైకితేలి, బోటు సమీపంలోకి యీదుకొంటూ వచ్చాడు. వైల్డుగా వూగుతున్న బోటు అంచుపట్టుకొని పైకి చేరాడు. రెండవపక్క నీటిలో నుంచి పైకితేలాయి ముఖేష్ జెన్నీల తలలు. వారితో పాటు మరికొన్ని వలలు కూడా పైకి తేలాయి.

ఎఱ్ఱగా రక్తపు ముద్దలాగా వున్న బుడగలు వేగంగా బోటు చుట్టూ చేరసాగాయి. వాటి మధ్యనుంచి వచ్చి బోటు ఎక్కారు ముఖేష్. జెన్నీలు. సరాసరి

ఇంజన్ దగ్గిరికి పోయి స్టాక్ చేపివున్న పెట్రోల్ డ్రమ్ము అందుకున్నాడు ముఖేష్ రెండవ డ్రమ్మును షాడో వైపు దొర్లించాడు.

"రాజూ! నువ్వు – అటునుంచి పోసుకుంటూ రా. జాగ్రత్త.... వేస్టు చేయొద్దు" అన్నాడు. డ్రమ్ము మూత తీసి పెట్రోల్ నీటిమీదికి వంచాడు షాడో.

ఆ ప్రదేశమంతా అక్కడ పెట్రోల్ వాసనతో నిండిపోయింది. పెట్రోల్ పడిన ప్రదేశంలో పెరుగుదల ఆగిపోయింది. నిలబడిన కిల్లింగ్ కాటన్‌లో నుంచి కొన్ని ముక్కలు చెదిరి దూరంగా పోనారంభించాయి. డ్రమ్ము గట్టిగా పట్టుకొని నీటిలోకి దూకాడు షాడో. వాటిని తరుముకుంటూ పోయి మిగిలిన పెట్రోల్ అంతా అక్కడ గుమ్మరించి వచ్చాడు.

తన డ్రమ్ముతో నీటిలోకి మణిగాడు ముఖేష్ పది అడుగులు. కిందికి పోయి డ్రమ్ములోని పెట్రోల్‌ని కిందికి వంచుతూ పైకి తేలాడు. మరింత వేగంగా ఆ ప్రదేశమంతా వ్యాపించింది పెట్రోల్.

బోటు వెనుక కొంత కిల్లింగ్ కాటన్ చేరడం గమనించి ఇంజన్ కున్న పెట్రోల్ టాంక్ పగలకొట్టింది జెన్నీ.

ఐదు నిముషాలపాటు మరమనుషులల్లే పనిచేశారు ముగ్గురూ. అలసిపోయి బోటు మధ్యలో నిలబడ్డారు.

బోటు చుట్టు పదిగజాల దూరంవరకూ ఎఱ్ఱటి నెత్తురు ముద్దలు తేలుతున్నాయి. అయిల్ పడటంతో మరింత నిగనిగ మెరుస్తున్నాయి.

"ఆపగలిగాం రాజూ! థాంక్ గాడ్ ఫర్ దట్!" అంటూ నిట్టూర్చాడు ముఖేష్. "అది సరే మన గతేమిటి? పెట్రోల్ టాంక్ అంతు చూసింది మన లిటిల్

డార్లింగ్ – ఇప్పుడు డాలీ వెనక్కువస్తే మన పని గల్లంతే" చిన్నగా నవ్వుతూ అన్నాడు షాడో.

"మన రైఫిల్స్ కూడా గల్లంతైనాయి. జరగబోయేది చూస్తూ కూర్చోవడం తప్ప చేయగలిగింది ఏమీలేదు" అన్నాడు ముఖేష్.

"ముఖేష్! నీ ట్రాన్స్‌మీటర్ వుందిగా? హెల్ప్ అడగరాదూ?" సజెస్ట్ చేసింది జెన్నీ.

"లాభం లేదు డియర్! హెల్ప్ రావటానికి చాలా టయిం తీసుకుంటుంది యీ లోగా మన పని ఆటో యిటో తేలిపోతుంది" సమాధానమిచ్చాడు ముఖేష్.

"ఐయామ్ సారీ జెన్నీ!..... అనవసరంగా నిన్ను ఈ రొంపిలోకి దింపాం....." జేబులోనుంచి తడిపిపోయిన హేండ్ కర్చీఫ్ తీసి నీటిని పిండుతూ అన్నాడు షాడో.

"డోన్ట్ వర్రీ బిగ్ బోయ్! మీరు రమ్మంటే వచ్చానా?" అన్నది జెన్నీ ఆమె మాటలకు నవ్వుతూ కిందికి చూశాడు షాడో. హేండ్ కర్చీఫ్‌తో పాటు ఒక విజిటింగ్ కార్డు కూడా బయటికి వచ్చింది. దాన్ని అందుకొని చూశాడు.

'మిస్టర్ క్లీ ఆల్మోరా' అని నీట్‌గా ప్రింట్ చేసి వుంది.అంతకు ముందు క్లీ ఇచ్చిన కార్డది. ఆ మిస్టర్ క్లీ యే ఇప్పుడు తమ అంతం చూడటానికి సిద్ధపడుతున్నాడు. కార్డును చూపుడు వేలికి బోటన వేలికి మధ్యన పెట్టి దూరంగా విసిరాడు.

గాలిలో తేలుతూ పోయి కిల్లింగ్ కాటన్ తలలమీద పడింది. దానిమీద నుంచి దృష్టిని ముఖేష్ వైపు మరల్చాడు. తీవ్రమైన ఆలోచన వున్నాడు ముఖేష్.

"ఏం గురూ మళ్ళీ ఏమొచ్చింది?" అడిగాడు షాడో. "రాజూ! జెన్నీ అన్న మాటలతో ఒక చిన్న అయిడియా వచ్చింది. జస్ట్ వెయిట్ " అంటూ జేబులో నేవున్న నోట్ బుక్ బయటికి తీశాడు ముఖేష్.

తడిసిపోయిన పేజీలను జాగ్రత్తగా తెరుస్తూ..... ట్రాన్స్‌మీటర్ డయాగ్రమ్స్ వున్న పేజీని జెన్నీకి చూపించాడు.

"యీ డ్రాయింగ్ ఎందుకో తెలుసా?" అని అడిగాడు. రెండు తలలూ ఏకమై ఆ డయాగ్రమ్స్ గురించి చర్చించసాగాయి. వున్నట్లుండి హుషారుగా విజిల్ వేస్తూ తల ఎత్తాడు ముఖేష్.

"రాజూ! మనవాళ్ళను జాగ్రత్తగా చూసుకో ఐ గాట్ సమ్ వర్క్" అంటూ మరొకసారి నోట్ బుక్లో దూర్చాడు.

డాలీ.... వెనుతిరిగి వారి బోటును సమీపిస్తున్నది. అప్రయత్నంగా బెల్టుమీద చెయ్యి వేశాడు రివాల్వర్ కోసం. అదెక్కడి వుంటుంది?

నెమ్మదిగా గాలి వీచినప్పుడల్లా పక్కకు జరుగుతూ..... కిల్లింగ్ కాటన్‌కి దూరంగా పోసాగింది బోటు.

డాలీ మరింత దగ్గిరికి వచ్చింది. కాబిన్ దగ్గిర నిలబడి బైనాక్యులర్స్‌తో బోటువంక చూస్తున్నారు యిద్దరు వ్యక్తులు. ఒక వ్యక్తి..... మిస్టర్ క్లీ... రెండవ ఆకారం – డాక్టర్ వెల్బీ.

వెల్బీ కింద పెట్టిన లైఫిల్ అందుకొని గురిపెట్టాడు. బుల్లెట్ షాడో తలమీద నుంచి దూసుకుపోయింది.

కిందికి పడి డెక్ మీదవున్న నాలుగు అంగుళాల చెక్క గోడ చాటున దాగుకోవటానికి ప్రయత్నించాడు షాడో.

డాలీలో వున్నవారికి... షాడో బృందం తమ ఆయుధాలనన్నిటినీ పోగోట్టుకుందని తెలియదు. జాగ్రత్తగా దూరంలోనే ఆపారు డాలీని. అక్కడినుంచి లాంగ్ రేంజ్ రైఫిల్స్‌తో బంబార్డ్‌మెంట్ మొదలుపెట్టారు.

బోటు మధ్య కూర్చుని తన వాచ్‌లో వున్న ట్రాన్స్‌మీటర్‌తో టింకరింగ్ మొదలు పెట్టాడు ముఖేష్. గోటితో చిన్న చిన్న స్క్రూలను తిప్పుతూ ఏవో అడ్జెస్టుమెంట్లను చేయసాగాడు. ఇంట్రస్టుతో చూస్తూ కూర్చున్నది జెన్నీ.

డాలీలోనుంచి ఫైరింగ్ ఇంటెన్సిఫై అయింది. వెల్బీ బుల్లెట్లు షాడో సమీపంలోకి వస్తున్నాయి. అతనికి తోడుగా క్లీ గూడా ఇంకో రైఫిల్‌తో ఫైరింగ్ ఓపెన్ చేశాడు

బోటులోనుంచి సమాధానం రాకపోయేసరికి అసలు విషయం గ్రహించి, డాలీని ఇంకా దగ్గిరికి తీసుకురాసాగాడు క్లీ.

"యస్.... అయిపోయింది రాజూ! అనుకున్నట్లు పని చేస్తే అమోఘంగా వుంటుంది" తల ఎత్తి అన్నాడు ముఖేష్.

"అది దేనికి? వాళ్ళతో ఫేర్‌వెల్ మాటలు మాట్లాడటానికి?" వెక్కిరించాడు షాడో.

"కరెక్టు క్లీ అండ్ వెల్బీలకి ఫేర్‌వెల్ కాదు.... గుడ్‌బై చెప్పబోతున్నాను. జస్టు – వాళ్ళను చూస్తూండు " అన్నాడు వాచ్‌ని రెండు చేతులతోనూ పట్టుకొని.

"డాలీ" మీద నిలబడిన వారిద్దరూ రైఫిల్స్ ఎత్తి బుజాన అనించుకున్నారు. బోటుకు మరి కొంత దగ్గిరిగా వచ్చింది డాలీ. అటేచూస్తున్న షాడో మెడమీద వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. ఈసారి రైఫిల్స్ గురి తప్పటానికి ఆవకాశం లేదు. నీటిలోకి దూకితే ఎలా వుంటుందీ? అన్న ఆలోచనను తర్కించి చూసుకుంటున్నాడు.

"వన్..... టూ... త్రీ..... ఫైర్ " అంటూ వాచ్ కీ బటన్ మీద బొటనవేలు పెట్టి బలంగా అదిమాడు ముఖేష్.

అదేక్షణంలో "డాలీ" మీదవున్న వారిద్దరూ చిన్న జర్క్ ఇచ్చారు. క్లీ కోటులోనుంచి నల్లటి పొగ తెరలు తెరలుగా పైకి వచ్చింది. వెల్బీ పాంటు జేబులోనుంచి కూడా అదే మాదిరి పొగ బయలుదేరింది.

పొగ కనుపించిన మరుక్షణం రెండు ప్రేలుళ్ళు వినిపించాయి. వారి చేతుల్లో నుంచి రైఫిల్స్ జారి పడబోయాయి. పొగవస్తున్న ప్రాంతాలను చేతులతో అదిమి పట్టుకుంటూ తూలి డెక్ వాల్ మీద పడిపోయారు. అక్కడే రెండు క్షణాలు గిలగిలా కొట్టుకొని నీటిలోకి వాలిపోయారు.

"బ్యూటిఫుల్ యాక్షన్ ఐ.సే...... ఏం చేశావ్ గురూ?" అడిగాడు షాడో.

"ఏమీ లేదు రాజూ! ఓల్డు ట్రిక్కే. విజిటింగ్ కార్డుల తమాషా. క్లీ తన దగ్గిర వున్న కార్డులు కొంతమందికి మాత్రమే ఇస్తాట్ట!"

"అవును నాకూ ఒకటి యిచ్చాడు."

"వెల్..... క్లీ ఏ పని చేసినా ఏదో ఒక కీలకంతో చేస్తాడు. అని ప్లాస్టిక్ ఎక్స్‌ప్లోజివ్ కార్డులు. వాటిని డిటనేట్ చేసి స్పెషల్ ట్రాన్స్‌మీటర్ ఒకటి తయారు

చేసుకున్నాడు. దాని డయాగ్రం నోట్ బుక్‌లో వున్నది. నాకు కలిగిన అనుమానాన్ని జెన్నీ బలపరిచింది. ఆ ప్రకారం నా ట్రాన్స్‌మీటర్‌ని సరిచేసి ఒకరొకర్ని కాకుండా అందర్నీ ఒకేసారి పైకి పంపే బ్రాడ్‌మీటర్‌లో యాక్టివేట్ చేశాను. చూశావ్‌గా ఏమయ్యారో ?" అన్నాడు ముఖేష్.

"అర్థం అయింది క్లీ దగ్గిర అటువంటి కార్డులు చాలా వున్నాయి. బహుశా వెల్బీకి గూడా ఒకటి యిచ్చివుంటాడు. అవునూ....." అని జేబులు తడుముకున్నాడు షాడో. "నాకూ ఒకటి యిచ్చాడు...." అంటూ.

ఇంతలో తను ఆ కార్డును సముద్రంలోకి విసిరినట్లు గుర్తువచ్చి వెనక్కి చూశాడు.

అక్కడ యాభై అడుగుల ఎత్తున రేగుతున్నాయి మంటలు. శరవేగంతో వారివైపు వస్తున్నాయి. క్లీ దగ్గిరున్న కార్డులతో పాటు షాడో విసిరిన కార్డు కూడా పేలిపోయింది. చుట్టూ వున్న పెట్రోల్ అంటుకొని కిల్లింగ్ కాటన్‌తో కలియటంవల్ల మరింత ప్రజ్వరిల్లి పెట్రోలు పాకినంత మేరా వ్యాపిస్తున్నాయి మంటలు.

"జంప్! ఎవ్రీబడీ" అని అరిచి తల్లకిందులుగా నీటిలోకి దూకాడు షాడో.

అతని మాటలు వినగానే రియాక్టు అయ్యారు ముఖేష్, జెన్నీ. ఏం జరుగుతున్నదో కూడా చూడకుండా సముద్రంలోకి దూకారు. నీటిపైకి రాగానే బలంగా బారలు వేస్తూ బోటుకు దూరంగా పోయి వెనుతిరిగి చాశారు.

చుట్టుముట్టిన అగ్నిజ్వాలలో ఒక జ్వాలగా మారి పోయింది వారి బోటు. కళ్ళమీదికి జారిన నీటిని విదిలించుకుంటూ ముఖేష్ వంక కోపంగా చూశాడు

షాడో. "ఏం చేయబోతున్నావో, ముందుగా చెప్పి చేస్తే నీ సోమ్మేం పోయింది? ఏదో అదృష్టం బాగుండి నా దగ్గిరున్న కార్డును అవతల పడేశాను కాబట్టి సరిపోయింది గాని లేకపోతే నేను గూడా క్లీ వెల్చీలకు కంపెనీ ఇవ్వాల్సి వచ్చేదిగా?"

"క్లీ నీకు కార్డు ఇస్తాడని నేనేమన్నా కలగన్నానా?" అని బుజాలు ఎగిర వేశాడు ముఖేష్.

"ఇప్పుడు మన గతేమిటి?" వారిద్దరి మధ్య తేలి ప్రశ్నించింది జెన్నీ.

"డాలీలో ఎవరైనా వుంటే.... వారిని బ్రతిమాలుకుని వెనక్కు పోవటం తప్ప ఇంకే దారి లేదు" అటువైపు చూస్తూ అన్నాడు షాడో.

ముగ్గురూ డాలీ వైపు యీదసాగారు. పది అడుగులు కూడా పోకముందే మళ్ళీ రైఫిల్ బుల్లెట్లు వచ్చి వారిని పలుకరించాయి.

"ఇది గ్రీన్‌లాండ్ కాదు ముఖేష్! గన్‌లాండ్. వీళ్ళు నిద్రలో కూడా గన్స్ వదలరని నా అనుమానం" ముఖం అదోలా పెట్టి అన్నాడు షాడో.

"రాజూ! నాకో అయిడియా వచ్చింది" అన్నది జెన్నీ బుల్లెట్లను తప్పించుకోటానికి అటూ ఇటూ కదులుతూ.

"అమ్మా.... బంగారం...... అదేమిటో త్వరగా చెప్పు.... మళ్ళీ నువ్వు కూడా నా కొంపతీసే మార్గం చూడకు" ఖంగారుగా అన్నాడు షాడో.

అతని వంక కోపంగా చూసి ముఖేష్‌కి తన ప్లాను వివరించింది జెన్నీ. అతను తల వూపగానే వారిని అక్కడే వదిలి 'డాలీ' వైపు యీదుకుంటూ పోయింది.

దూరం నుంచి ఆమెను అనుసరించసాగారు స్నేహితులిద్దరూ.

"డాలీ" లోవున్నవారు ముందు వస్తున్న ఆకారం మీదికి రైఫిల్ గురిపెట్టారు. ట్రిగ్గర్స్ నొక్కబోయే సమయంలో నీటిలో నుంచి తల ఎత్తి పెద్దగా అరిచింది జెన్నీ.

"హెల్ప్..... హెల్ప్....నేను.... జెన్నీని.... హెల్ప్."

ఒక వ్యక్తి ముందుకు వచ్చి కిందికి తొంగి చూడటం గమనించి చిన్నగా నవ్వాడు షాడో. "మొత్తానికి అన్నంతపనీ చేసింది. వారిని బోల్తా కొట్టించింది" అన్నాడు.

వెంటనే ఇద్దరూ గుండెలనిండా గాలి పీల్చుకుని నీటిలో మునిగారు. తిరిగి పైకి తేలెసరికి 'డాలీ' వెనుక భాగానికి చేరుకున్నారు.

జెన్నీని గుర్తుపట్టి తాటి నిచ్చెన వదిలారు క్లీ అనుచరులు. ఒక వ్యక్తి నాలుగుమెట్లు కిందికి దిగి జెన్నీకి చేయి అందించాడు. ఆ చేతిని అసరాగా తీసుకొని రెండు మెట్లుపైకి ఎక్కిందామె. ఎడమచేతితో తాటినిచ్చెనను గట్టిగా పట్టుకుని బలమంతా ఉపయోగించి అతన్ని కిందికి గుంజింది. అనుకోని అదటుకు పట్టు జారి కేకలు పెడుతూ సముద్రంలో పడిపోయాడతను.

వెనుక భాగంలో వేలాడుతున్న లంగరు తాళ్ళను పట్టుకొని పైకి పాకాడు షాడో. జెన్నీ వెనుక తాటినిచ్చెనమీది నుంచి పైకి ఎక్కుతూ, నీటిలో పడిన వ్యక్తిని పైకి రానీయకుండా అడ్డుపడ్డాడు ముఖేష్.

డెక్ మీదికి అడుగు పెట్టింది జెన్నీ. ఆమెవైపు రైఫిల్స్ గురిపెట్టి ప్రశ్నార్థకంగా చూశారు మిగిలిన ఇద్దరు అనుచరులూ.

"వాళ్ళు..... అదుర్మార్గులు.... నన్ను.... బలవంతంగా..."

ఆయాసంతో వగరుస్తూ అన్నది జెన్నీ. ఆమె మాటలు వింటున్న వారిద్దరూ వెనుకనుంచి వచ్చిన ప్రమాదాన్ని చూడలేకపోయారు.

వెనుక భాగంనుంచి పైకి వచ్చిన షాడో పిల్లిలా అడుగులు వేస్తూ వారిని సమీపించాడు. రెండు అడుగులదూరంలోకి పోగానే ఎగిరి ఒకడిని వీపుమీద తన్నాడు. రెండవ వ్యక్తి వ్యక్తి మెడచుట్టు చేతులు వేసి వెనక్కు వంచాడు. అతని చేతిలోని రైఫిల్ గుంజుకొని ఎయిమ్ చేసింది జెన్నీ.

"ఫైన్ డార్లింగ్.... వెరీ.... ఫైన్.. మీరిద్దరూ వీడిని చూస్తూండండి నేను పోయి లోపల ఇంకెవరయినా వున్నా రేమో చూసివస్తాను" అంటూ కాబిన్ లోకి పోయాడు ముఖేష్.

★ ★ ★

మసక చీకటి మెల్లగా సముద్రంమీద పరుచుకుంటున్నది. మెల్లగా అలలమీద వుయ్యాల లూగుతూ గ్రీన్ కెనాల్ వైపు సాగిపోతున్నది డాలీ.

కాబిన్‌లో వున్న బిస్కట్ పాకెట్సు, డ్రైడ్ ఫ్రూట్ డబ్బాలూ ముందువేసుకొని ఖాళీచేసే ప్రయత్నంలో వున్నారు ముఖేష్, షాడో, జెన్నీ.

తన ట్రాన్స్‌మీటర్‌ని మామూలు సర్క్యూట్‌లో పనిచేసే విధంగా రిపేర్ చేసి చేసి బటన్ నొక్కాడు ముఖేష్.

వెంటనే పలికింది కులకర్ణిగారి కంఠం.

"ముఖేష్! వాట్ హేపెన్డ్?"

"ఎవ్రీథింగ్ ఓకే సార్! మిషన్ కంప్లీటెడ్"

ఆ రెండు మాటల్లోనూ ఆయనకు కావల్సిన ఇన్ ఫర్మేషన్ ఇచ్చాడు.

"సార్! మాకు జెన్నీ ఎంతో సహాయపడింది. హౌ వుడ్ లైక్ టూ..."

"ఎగ్రీడ్. గ్రీన్‌లాండ్ ప్రభుత్వంతో మాట్లాడి ఆమెకు మెరిట్ బాడీ ఇప్పించే ప్రయత్నం చేస్తాను. రాజు వున్నాడా?" వెంటనే షాడో ముందుకు వచ్చాడు.

"గుడ్ యీవినింగ్ బాస్! ఇంకో మూడు వారాలదాకా నన్ను మాట్లాడించకండి."

"రాజూ! ఎమిలీ ద్వారా చాలా విషయాలు తెలిశాయి. రియల్లీ షీ హెల్ప్‌డ్ ఎలాడ్. అవకాశం యిస్తే మంచి మార్గంలో నడుచుకునేటట్లే కనిపిస్తోంది. ఏమంటావ్?"

"బాస్... మీరు అలా అంటున్నందుకు చాలా సంతోషం. నేనే యీ విషయం మీతో మాట్లాడదామనుకుంటున్నాను."

"దెన్.... యిటీజ్ ఆల్ సెటిల్డ్. మీరు ఇంకో వారం రోజులు యిక్కడే వుండి రెస్టు తీసుకురండి. నేను వెళ్ళిపోతున్నాను."

"ఒక వారమా! ఒక్కవారమా? నంథింగ్ డూయింగ్ బాస్! కనీసం రెండు వారాలయినా కావాలి. పాపం ఎమిలీ వాళ్ళ యింటిని నాశనం చేశాం గదా! వారికి హెల్ప్ చేసి....."

"కరెక్టు రాజూ! అదే నేనూ అంటున్నాను. కనీసం మనం రెండు వారాలన్నా ఇక్కడ వుండాలి" అన్న ఒక కోమల స్వరం.

ఆ కంఠం విన్న షాడో అలాగే చతికిలపడ్డాడు.

"ఏమిటి రాజూ! ఏమైంది?" తీవ్రంగా అడిగాడు ముఖేష్. "ఇంకేమవ్వాలి? బిందు వచ్చింది" రిస్టువాచ్‌లో నుంచి క్లియర్‌గా వినిపించాయి కులకర్ణిగారి మాటలూ – ఆయన పక్కనే నిలబడి నవ్వుతున్న బిందు నవ్వూ!

----:అయి పోయింది:----


GUN FIGHT IN
GREEN LAND
MADHU BABU